




# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక — PEN POWER TELUGU DAILY — ప్రశ్నించడం మన హక్కు








సంపుటి : 11 సంచిక :67 పేజీలు :12 సంపాదకులు : గంట్యాడ అప్పారావు ప్రచురణ : ఒంగోలు మంగళవారం 12 నవంబర్ 2024 వెల : 5/-రూ॥

VOLUME :11 ISSUE : 67 PAGES :12 EDITOR : GANTYADA APPARAO PUBLISHED :ONGOLE TUE 12 NOVEMBER 2024 PRICE : 5/- RS

Simultaneously Published form Ongole, Kakinada, Visakhapatnam, Circulated by Srikakulam, Vizianagaram, Eluru, Vijayawada, Guntur, Nelloru, Chittur, YSR Kadapa, Kurnool, Anantapur






# రూ. 2.94 లక్షల కోట్లతో ఏపీ వార్షిక బడ్జెట్

## బడ్జెట్ లో కేటాయింపులు ఇలా..

- ఆరోగ్య రంగం రూ.18,421 కోట్లు
- గ్రామీణాభివృద్ధి రూ.16,739 కోట్లు
- జల వనరులు రూ.16,705 కోట్లు
- పంచాయతీరాజ్, పట్టణాభివృద్ధి రూ.11,490 కోట్లు
- రోడ్లు, భవనాలు రూ.9,554 కోట్లు
- పోలీసు శాఖ రూ.8,495 కోట్లు
- ఇంధన రంగం రూ.8,207 కోట్లు
- గృహ నిర్మాణం రూ.4,012 కోట్లు
- పరిశ్రమలు, వాణిజ్యం రూ.3,127 కోట్లు
- ఉన్నత విద్య రూ.2,326 కోట్లు
- యువజన, పర్యాటక, సాంస్కృతిక శాఖ రూ.322 కోట్లు
- పాఠశాల విద్య - రూ.29,909 కోట్లు
- వ్యవసాయం, అనుబంధ రంగాలు - రూ.11,855 కోట్లు
- ఎస్సీ సంక్షేమం - రూ.18,497 కోట్లు
- ఎస్టీ సంక్షేమం - రూ.7,557 కోట్లు
- బీసీ సంక్షేమం - రూ.39,007కోట్లు
- మైనార్టీల సంక్షేమం - రూ.4,376 కోట్లు
- మహిళా శిశు సంక్షేమం - రూ.4,285 కోట్లు
- మానవ వనరుల అభివృద్ధి - రూ.1,215 కోట్లు
- పర్యావరణ, అటవీ, శాస్త్ర, సాంకేతిక శాఖ - రూ.687 కోట్లు

అప్పుల ఊబిలో కూరుకుపోయిన ఆంధ్రప్రదేశ్ ను కాపాడడంతో పాటు, సంక్షేమం, అభివృద్ధి సమ్మేళనంతో వార్షిక బడ్జెట్ కు రూపకల్పన చేశామని మంత్రి పయ్యావుల కేశవ్ పేర్కొన్నారు. సోమవారం అసెంబ్లీలో బడ్జెట్ ప్రవేశపెట్టి మంత్రి మాట్లాడుతున్నారు. గత ప్రభుత్వం పరిమితికి మించి అప్పులు చేసిందని, రాష్ట్రాన్ని అప్పుల్లోకి నెట్టిందని ఆరోపించారు. రాబోయే పాతికేళ్ల ఆదాయాన్ని తగ్గించిందని చెప్పారు. గత ప్రభుత్వం అనుసరించిన లోపభూయిష్టమైన విధానాల కారణంగా రాష్ట్రంలో అభివృద్ధి కుంటుపడిందని ఆరోపించారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి సమ్మేళనంగా 2024%-%25 వార్షిక బడ్జెట్ ను ప్రవేశ పెడుతున్నట్లు చెప్పారు.

వివరాలు 2లో..

- 2024 - 25 బడ్జెట్ కు ఆమోదం తెలిపిన మంత్రివర్గం
- రాష్ట్రాన్ని కాపాడే బడ్జెట్ ఇది.. బడ్జెట్ ప్రసంగంలో మంత్రి పయ్యావుల కేశవ్
- ఏపీని అప్పుల ఊబిలోకి నెట్టిందంటూ గత ప్రభుత్వంపై విమర్శలు
- రూ.2.94 లక్షల కోట్లతో బడ్జెట్ ను అసెంబ్లీలో ప్రవేశ పెట్టిన ఆర్థిక మంత్రి
- ఆరోగ్యం, అభివృద్ధి, సంక్షేమం కేంద్రంగా కేటాయింపులు

వార్షిక బడ్జెట్ రూ. 2,94,427.25 కోట్లు

రెవెన్యూ వ్యయం అంచనా రూ. 2,35,916.99 కోట్లు

మూలధన వ్యయం అంచనా రూ. 32,712.84 కోట్లు

రెవెన్యూ లోటు రూ. 34,743.38 కోట్లు

ద్రవ్య లోటు రూ. 68,742.65 కోట్లు



## ఎవరి కోసమో అసెంబ్లీ సమావేశాలు ఆగవు

- నిన్న నుంచి ఏపీ అసెంబ్లీ సమావేశాలు
- నిన్న బడ్జెట్ ప్రవేశపెట్టిన కూటమి ప్రభుత్వం
- సభకు గైర్హాజరైన జగన్
- ఎమ్మెల్యేలు తప్పనిసరిగా సభకు రావాలన్న చంద్రబాబు



పెన్ పవర్ డెస్క్: ఏపీలోని కూటమి ప్రభుత్వం నేడు అసెంబ్లీలో బడ్జెట్ ప్రవేశపెట్టింది. నేటి నుంచి అసెంబ్లీ సమావేశాలు షురూ అయ్యాయి. రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ బడ్జెట్ ప్రవేశపెట్టిన తర్వాత, సభలో కొన్ని సాధారణ కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం అసెంబ్లీ, శాసనమండలి ఎల్లుండికి వాయిదాపడ్డాయి. ఈ నేపథ్యంలో, సీఎం చంద్రబాబు స్పందించారు.

వివరాలు 2లో..

## వర్రా రవీంద్రారెడ్డిని మార్కాపురం సమీపంలో అదుపులోకి తీసుకున్నాం

- కూటమి నేతలపై సోషల్ మీడియాలో అసభ్య పోస్టులు
- పరారైన వర్రా రవీంద్రారెడ్డి
- ప్రత్యేక బృందాలతో గాలించిన పోలీసులు
- ఎట్టకేలకు అదుపులోకి తీసుకున్న వైనం
- మీడియా ముందు ప్రవేశపెట్టిన పోలీసులు

వివరాలు 2లో..

పెన్ పవర్ డెస్క్:పరారీలో ఉన్న వైసీపీ సోషల్ మీడియా కార్యకర్త వర్రా రవీంద్రారెడ్డిని పోలీ సులు ఎట్టకేలకు పట్టుకున్న సంగతి తెలిసిందే. దీనిపై కర్నూలు రేంజి డీఐజీ, కడప ఎస్పీ మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. వర్రా రవీంద్రా రెడ్డితో పాటు సుబ్బారెడ్డి, ఉదయ్ అనే



## నేడు ఎమ్మెల్యేలకు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నాం



- వాయిదా పడిన ఏపీ అసెంబ్లీ, మండలి
- నేడు మధ్యాహ్నం టీడీపీ-జనసేన-బీజేపీ శాసనసభాపక్ష భేటీ
- వచ్చే శనివారం కూడా సభ నిర్వహిస్తామన్న అయ్యన్నపాత్రుడు

పెన్ పవర్ డెస్క్:ఏపీ అసెంబ్లీ, శాసనమండలి ఎల్లుండికి వాయిదా పడ్డాయి. (నవం బరు 12) ఉదయం ఎమ్మెల్యేలకు శిక్షణ తరగతులు నిర్వహించనున్నారు.

వివరాలు 2లో..

## 43 వేల కోట్లతో వ్యవసాయ బడ్జెట్ ప్రవేశ పెట్టిన అచ్చెన్నాయుడు

- గుర్రం జాషువా కవితతో ప్రసంగం ప్రారంభించిన మంత్రి
- రైతుకు పాదాభివందనం చేస్తున్నానాన్న అచ్చెన్నాయుడు
- రైతే రాజు కావాలని సీఎం చంద్రబాబు ఆకాంక్ష అని వెల్లడి



"వాని రెక్కల కష్టంబు లేని నాడు
సస్య రమ పండి పులకింప సంశయించు
వాడు చెమటోడ్చి ప్రపంచమునకు
భోజనము పెట్టువానికి భుక్తి లేదు.."
అన్న కవితను మంత్రి చదివి వినిపించారు.

పెన్ పవర్ డెస్క్:'ఆరుగాలం ఇంటిల్లిపాది శ్రమించి ఈ ప్రపంచానికి అన్నం పెడుతున్న రైతన్నకు మనసావాచా కర్మణా శిరస్సు వంచి పాదాభివందనం తెలియజేసుకుంటున్నా' అంటూ ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ మంత్రి అచ్చెన్నాయుడు అసెంబ్లీలో పేర్కొన్నారు. రూ.43,402 కోట్లతో వ్యవసాయ బడ్జెట్ ను అసెంబ్లీలో ప్రవేశ పెట్టి మంత్రి మాట్లాడారు. ముందుగా రైతులపై ప్రముఖ కవి గుర్రం జాషువా రాసిన.. రైతులకు ఈ పరిస్థితి మారాలని, రైతే రాజు కావాలని నిరంతరం ఆలోచించే, అందుకోసం నిరంతరం ప్రయత్నించే వ్యక్తి మన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అని అచ్చెన్నాయుడు చెప్పారు. అయితే, గత ప్రభుత్వం మాత్రం రాష్ట్రానికి వెన్నెముక వంటి వ్యవసాయాన్ని గాలికి వదిలేసిందన్నారు. రాష్ట్ర జనాభాలో 62 శాతం వ్యవసాయ అనుబంధ రంగాలపైనే ఆధారపడిందని చెప్పారు. రాష్ట్రంలో వ్యవసాయ రంగాన్ని తిరిగి గాడిలో పెట్టడానికి, రైతు సంక్షేమం కోసం తమ ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. ఇందులో భాగంగా వ్యవసాయ బడ్జెట్ లో ప్రకృతి వ్యవసాయానికి, సాంకేతికతకు ప్రాధాన్యం కల్పించామని చెప్పారు. రిమోట్ సెన్సింగ్

వివరాలు 2లో..

## భారత 51వ చీఫ్ జస్టిస్ గా సంజీవ్ ఖన్నా ప్రమాణస్వీకారం



- జస్టిస్ ఖన్నాతో ప్రమాణస్వీకారం చేయించిన ప్రెసిడెంట్ ద్రౌపది ముర్ము
- రాష్ట్రపతి భవన్ లో కార్యక్రమం.. ప్రధాని, మాజీ సీజేఐ సహా ప్రముఖుల హాజరు
- 2025 మే 13 వరకు సీజేఐగా బాధ్యతలు నిర్వహించనున్న జస్టిస్ ఖన్నా

వివరాలు 2లో..

## అసెంబ్లీకి వెళ్లే దమ్ము, ధైర్యం లేకపోతే రాజీనామా చేయండి

- నిన్న నుంచి ఏపీ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు
- గైర్హాజరైన జగన్
- ప్రతిపక్ష హోదా ఇస్తేనే సభకు వెళతాననడం అర్థరహితమన్న షర్మిల
- పిచ్చితనాన్ని పక్కనబెట్టి అసెంబ్లీ సమావేశాలకు హాజరు కావాలని హితవు

పెన్ పవర్ డెస్క్:నిన్న నుంచి ఏపీ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు జరుగుతున్న నేపథ్యంలో, వైసీపీ అధినేత జగన్ సభకు గైర్హాజరయ్యారు. దీనిపై రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షురాలు షర్మిల తీవ్రస్థాయిలో స్పందించారు. జగన్ తీరు చూస్తుంటే అత్త మీద కోపం దుత్త మీద చూపించినట్టుందని

వివరాలు 2లో..




## మణిపూర్‌లో భీకర ఎన్‌కౌంటర్.. 11 మంది కుకీ తిరుగుబాటుదారుల హతం



పెన్ పవర్ డెస్క్:మణిపూర్‌లో సోమవారం (నవంబర్ 11, 2024) భీకర ఎన్‌కౌంటర్ జరిగింది. భద్రతా బలగాలకు, కుకీ తిరుగుబా టుదారులుగా అనుమానిస్తున్న వ్యక్తులకు మధ్య జరిగిన కాల్పుల్లో 11 మంది తిరుగుబాటుదారులు మృతి చెందారు. మణిపూర్‌లోని జిరిబమ్ జిల్లాలో ఈ ఎన్‌కౌంటర్ జరిగింది.

వివరాలు 2లో..

# ఎడిటర్ వ్యూ

## సౌత్ లో యూత్ పాలిటిక్స్....

దక్షిణాది రాజకీయాలు దేశంలోనే ప్రత్యేకం. ఎందుకంటే జాతీయ పార్టీలకు ఇక్కడ ప్రాధాన్యం ఉండదు. అన్ని చోట్లా ప్రాంతీయ పార్టీలే కీలకంగా వ్యవహరిస్తూ ఉంటాయి. ఈ ప్రాంతీయ పార్టీల నాయకత్వం సహజంగానే కుటుంబాల చేతుల్లో ఉంటుంది. ఒకరి తర్వాత ఒకరు ఆ కుటుంబం నుంచే వారసులుగా వస్తూంటారు. ఈ సారి దక్షిణాది రాష్ట్రాల్లో ఈ వారసులు ఉదయించడం కాస్త ఎక్కువగా ఉండనుంది. సీనియర్ నేతలంతా రిటైర్మెంట్ వయసు దగ్గర పడటంతో వారసుల్ని యువనేతల్ని ప్రోత్సహించబోతున్నారు. తెలంగాణలో రాజకీయాలు ఇప్పటికే స్పష్టమైన మార్పులు వస్తున్నాయి. రాజకీయాల్లో సూపర్ సీనియర్ అయిన కేసీఆర్ ఇక తెర వెనుకనే ప్రధాన పాత్ర పోషించే అవకాశాలు ఉన్నాయి. మరో నాలుగేళ్ల తర్వాత వచ్చే జమిలీ ఎన్నికల నాటికి ఆయన నేరుగా ఫీల్డ్ లోకి వచ్చే అవకాశాలు తక్కువగానే ఉండవచ్చు. మొత్తం బాధ్యత కేటీఆర్, కవితలకే అప్పగించవచ్చు. అందుకే ఇప్పటికే వారికి పూర్తి స్థాయిలో ప్రతిపక్ష పాత్ర పోషించేందుకు అవకాశం ఇస్తున్నారు. తను సలహాలకే పరిమితమవుతున్నారు. ముందు ముంద కొన్ని సార్లు ప్రజల ముందుకు వచ్చినా కీలక పాత్ర కేటీఆర్‌దే అవుతుంది. కాంగ్రెస్ పార్టీలోనూ రేవంత్ హవా కొనసాగనుంది. బీజేపీలో బండి సంజయ్ వంటి వారే కీలక పాత్ర పోషిస్తారు. అంటే సంప్రదాయ సీనియర్ నేతలు తెర వెనక్కి వెళ్లిపోయినట్లే. ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబునాయుడు నాలుగు దశాబ్దాలుగా రాజకీయం చేస్తున్నారు. అప్పట్నుంచి ఆయనకు పోటీగా చాలా మంది వచ్చారు. నేదురుమల్లి జనార్దన్ రెడ్డి, కోట్ల విజయభాస్కర్ రెడ్డి, వైఎస్ రాజశేఖర్ రెడ్డి, రోశయ్య, కిరణ్ కుమార్ రెడ్డి, వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఇలా ప్రత్యర్థులు వస్తూనే ఉన్నారు. మరో వైపు చంద్రబాబు మాత్రమే ఉంటున్నారు. తాను మొదటి సారి సీఎం అయినప్పుడు జగన్ నిక్కర్లేసుకుని ఆడుకుంటూ ఉంటారని చంద్రబాబు సెటైర్లు వేస్తూంటారు. చంద్రబాబు రాజకీయాల్లో మాస్టర్. కాలానికి తగ్గట్లుగా యువతతో పోటీ పడుతూ ఆయన ఎప్పటికప్పుడు బౌన్స్ బ్యాక్ అవుతూనే ఉన్నారు. కానీ ఆయన వచ్చే ఎన్నికల నాటికి ఎంత యాక్టివ్ గా ఉంటారో చెప్పడం కష్టం. ఆయన వయసు అప్పటికి ఎనభై దరిదాపుల్లోకి చేరుతుంది. ప్రత్యక్ష రాజకీయాల్లోనే ఉన్నా.. ఇప్పటిలా ఆయన నేరుగా క్షేత్ర స్థాయి రాజకీయాలు చేయలేకపోవచ్చు. ఆ బాధ్యతను నారా లోకేష్ తసుకుంటున్నారు. ఇక వైఎస్ వారసుడిగా తెరపైకి వచ్చిన వైఎస్ జగన్మోహన్ రెడ్డి .. ఇప్పటికే ఓ సారి సీఎంగా చేశారు. ముప్ఫై ఏళ్లు నిరాటంకంగా సీఎంగా ఉండాలని ఆయన అనుకన్నారు కానీ .. మొదటికే మోసం వచ్చింది. పవన్ కల్యాణ్ కూడా ఇప్పుడు రేసులో ఉన్నారు. కూటమిలో ఉన్నారు కాబట్టి ఆయన సీఎం పదవిపై ఏమీ చెప్పకపోవచ్చు కానీ రాజకీయాల్లో ఎవరి లక్ష్యమైన ఉన్నతమైన పదవే. అందుకే.. వచ్చే ఎన్నిల నాటికి చంద్రబాబు..తెర వెనుక కీలక పాత్ర పోషిస్తే..తెర ముందు మాత్రం లోకేష్, జగన్, పవన్ లే పోటీ పడనున్నారు. అంటే ఏపీలోనూ యూత్ రాజకీయం నడుస్తుందన్నమాట. తమిళనాడులో వారసత్వ రాజకీయాలకు చాలా ప్రత్యేకత ఉంది. జయలలితకు వారసులు లేకపోడవంతో అన్నాడీఎంకేకు యువనేతల కొరత వచ్చింది. కానీ కరుణానిధి వారసుడిగా స్టాలిన్ తెరపైకి వచ్చారు. ఇప్పుడు స్టాలిన్ వారసుడిగా ఉదయనిధి కూడా వచ్చేశారు. సినీ నిర్మాతగా, హీరోగా తమిళ సినీ పరిశ్రమలో మంచి పేరు తెచ్చుకున్న ఉదయనిధి తాత, తండ్రి వారసత్వాన్ని పుణికి పుచ్చుకుని భవిష్యత్ డీఎంకే యువనేతగా ఎదుగుతున్నారు. మొదట డీఎంకే యువత విభాగానికి నాయకత్వం వహించారు. గత ఎన్నికల్లో అసెంబ్లీకి ఎన్నికయ్యారు. మంత్రి పదవి కూడా వచ్చింది. ఇప్పుడు ఏకంగా డిప్యూటీ సీఎం పోస్టులోకి వెళ్లిపోయారు. తన వారసుడిగా ఉదయనిధిని స్టాలిన్ అనధికారికంగా ఖరారు చేసినట్లే అనుకోవాలి. స్టాలిన్‌కు ఇప్పటికే వయసు 70 దాటిపోయింది. తమిళ రాజకీయాల్లోకి కొత్తగా దళపతి విజయ్ వస్తున్నారు. దళపతి విజయ్ సీనియర్ హీరో. ఆయనకు తమిళనాడు వ్యాప్తంగా అభిమానులు ఉన్నారు. ఆయన భవిష్యత్ లో కీలక నేతగా ఎదిగే అవకాశం ఉంది. ఎందుకంటే.. తమిళనాట వ్యక్తి ప్రాధాన్య రాజకీయాలు ఎక్కువే. అలాగే ఉదయనిధి స్టాలిన్‌కు రాజకయంగా ఫాలోయింగ్ ఉంది. సినిమాల్లోనూ ఆయన మంచి పేరు తెచ్చుకున్నారు.కానీ విజయ్ లాగా మాస్ ఇమేజ్ వచ్చే సినిమాలు చేయలేదు. కానీ అనుచరులకు మాత్రం లోటు లేదు . అందుకే తమిళనాడులో వచ్చే రాజకయం అంతా ఈ ఇద్దరి మధ్య హోరాహోరీ పోరుతోనే ఉంటుంది. అంటే తమిళనాడులోనూ యువ రాజకీయమే నడవనుంది. దక్షిణాదిలో ఎంతో మంది సీనియర్లు దేశ రాజకీయాల్లో కీలక పాత్ర పోషించారు. ఇప్పుడు వారిలో చాలా మంది యాక్టివ్ గా ఉన్నట్లే. చంద్రబాబు నాయుడు, కేసీఆర్ , స్టాలిన్ వంటి వారు వచ్చే ఎన్నికల నాటికి క్షేత్ర స్థాయిలో ఇప్పుడున్నంత చురుకుగా పని చేయలేకపోవచ్చు. కానీ యువనేతలు మాత్రం రాజకీయ రంగాన్ని దున్నేయగలరు. వారసులే కాదు.. సొంతంగా రాజకీయాల్లోకి ఎదిగిన వారు కూడా తమదైన ముద్ర వేసే అవకాశం ఉంది.

# రూ.2.94 లక్షల కోట్లతో ఏపీ వార్షిక బడ్జెట్

- మొదటి పేజీ తరువాయి

మంత్రి మాట్లాడుతూ సమాచార విప్లవాన్ని వినియోగించుకోవాలి. శాశ్వత రాజధాని లేకుండా రాష్ట్ర విభజన జరిగింది. రాష్ట్రాన్ని పునర్నిర్మాణ దిశగా నడిపించే బాధ్యత మా ప్రభుత్వం తీసుకుంది. గత ప్రభుత్వం నీటి పారుదల రంగాన్ని పూర్తిగా విస్మరించింది. గత ప్రభుత్వం పోలవరం నిర్మాణాన్ని ముందుకు తీసుకెళ్లలేదు. గత ప్రభుత్వం ఉత్పాదక మూలధనాన్ని నిలిపివేసింది. తద్వారా ఉత్పత్తి తగ్గిపోయి అభివృద్ధికి ఆటంకం కలిగిందని అన్నారు.

దీపం పథకానికి రూ.895 కోట్లు కేటాయించాం. దీపం పథకం ద్వారా 5 లక్షల మందికి లబ్ధి కలుగుతుంది. వచ్చే మూడేళ్లలో 18 వేల మంది అధ్యాపకులకు శిక్షణాభివృద్ధి కార్యక్రమం చేపడతాం. పాఠశాల విద్యాశాఖకు రూ.29,909 కోట్లు కేటాయించాం. ఉపాధ్యాయులపై యాప్ భారం తగ్గింపు వుంటుంది. 192 నైపుణ్య కేంద్రాలు, కళాశాలల ఏర్పాటు చేస్తున్నామని అన్నారు.

# 43 వేల కోట్లతో వ్యవసాయ బడ్జెట్ ప్రవేశ పెట్టిన అచ్చెన్నాయుడు

- మొదటి పేజీ తరువాయి

సాంకేతికత ఉపయోగించి భూసార పరీక్షలు చేపట్టనున్నామని మంత్రి వివరించారు. ప్రాథమిక పరపతి సంఘాల ద్వారా రాయితీపై ఎరువుల పంపిణీ చేపట్టామని మంత్రి పేర్కొన్నారు.

**కేటాయింపులు..**

అన్నదాత సుఖీభవ - రూ.4,500 కోట్లు
ప్రకృతి వ్యవసాయం - రూ.422.96 కోట్లు
భూసార పరీక్షలకు - రూ.38.88 కోట్లు
పంటల బీమా - రూ.1,023 కోట్లు
వ్యవసాయ యాంత్రీకరణ - రూ.187.68 కోట్లు
రాయితీ విత్తనాలకు - రూ.240 కోట్లు
ఎరువుల సరఫరా - రూ.40 కోట్లు
పొలం పిలుస్తోంది - రూ.11.31 కోట్లు
డిజిటల్ వ్యవసాయం - రూ.44.77 కోట్లు
వడ్డీ లేని రుణాలకు - రూ.628 కోట్లు
రైతు సేవా కేంద్రాలకు - రూ.26.92 కోట్లు
ఇంటిగ్రేటెడ్ అగ్రి ల్యాబ్స్ - రూ.44.03 కోట్లు
విత్తనాల పంపిణీ - రూ.240 కోట్లు
వ్యవసాయ శాఖ - రూ.8,564.37 కోట్లు
ఉద్యాన శాఖ - రూ. 3469.47 కోట్లు
పట్టు పరిశ్రమ - రూ.108.4429 కోట్లు
వ్యవసాయ మార్కెటింగ్ - రూ.314.80 కోట్లు
సహకార శాఖ - రూ.308.26 కోట్లు
ఎన్జీ రంగా విశ్వవిద్యాలయం - రూ.507.038 కోట్లు
ఉద్యాన విశ్వవిద్యాలయం - రూ.102.227 కోట్లు
శ్రీ వెంకటేశ్వర పశు విశ్వవిద్యాలయం - రూ.171.72 కోట్లు
మత్స్య విశ్వవిద్యాలయం - రూ.38 కోట్లు
పశుసంవర్ధక శాఖ - రూ.1,095.71 కోట్లు
మత్స్య రంగం అభివృద్ధి - రూ.521.34 కోట్లు
ఉచిత వ్యవసాయ విద్యుత్ - రూ.7241.30 కోట్లు
ఉపాధి హామీ అనుసంధానం - రూ.5,150కోట్లు
ఎన్టీఆర్ జలసిరి - రూ.50 కోట్లు
నీటిపారుదల ప్రాజెక్టుల నిర్వహణ - రూ.14,637.03 కోట్లు

# వర్రా రవీంద్రారెడ్డిని మార్కాపురం సమీపంలో అదుపులోకి తీసుకున్నాం

- మొదటి పేజీ తరువాయి

నిందితులను కూడా మీడియా ముందు ప్రవేశపెట్టారు. వీరిద్దరూ కూడా వైసీపీ సోషల్ మీడియాలో పనిచేస్తున్నారని డీఐజీ తెలిపారు. వర్రా రవీంద్రారెడ్డిని నిన్న మార్కాపురం సమీపంలో అదుపులోకి తీసుకున్నామని వెల్లడించారు. వర్రా రవీంద్రారెడ్డి గతంలో భారతి సిమెంట్ కంపెనీలో పనిచేశాడని చెప్పారు. కాగా, డిజిటల్ కార్పొరేషన్ ఉద్యోగులను వైసీపీకి అనుకూలంగా వినియోగించుకున్నారని వివరించారు. వీరు జడ్జిలకు వ్యతిరేకంగా కూడా పోస్టులు పెట్టారని పోలీసు ఉన్నతాధికారులు వెల్లడించారు. కుటుంబంలోని మహిళలు, పిల్లలపైనా పోస్టులు పెట్టారని తెలిపారు. ఇలాంటి పోస్టులు పెట్టేవారు రాక్షస జాతికి చెందినవారని, నేతల మనోధైర్యాన్ని దెబ్బతీయడమే వీరి లక్ష్యమని డీఐజీ వివరించారు. ఇలాంటి పోస్టులు పెట్టేవారిని ఇప్పటిదాకా 45 మందిని గుర్తించామని చెప్పారు. నిందితులపై పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేసినట్టు పేర్కొన్నారు. నేతల ఫొటోలను మార్ఫింగ్ చేసి పోస్టులు పెట్టేవారని తెలిపారు. నిందితులకు 40 యూట్యూబ్ చానళ్లు ఉన్నట్టు గుర్తించామని అన్నారు. వీరు తమ యూట్యూబ్ చానళ్ల ద్వారా కూడా అసభ్యకర వ్యాఖ్యలు చేసేవారని పోలీసులు వివరించారు. నిందితులు వాడిన భాష జుగుప్సాకరంగా ఉందని పేర్కొన్నారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కుటుంబాలపై తీవ్రమైన దూషణలు చేశారని వెల్లడించారు. ఇలాంటి వారికి అరబ్ దేశాల్లో అయితే తీవ్రమైన శిక్షలు ఉంటాయని అన్నారు. నిందితులను పట్టుకునేందుకు బృందాలుగా ఏర్పడి గాలించామని చెప్పారు. వీరంతా జగన్ కనెక్ట్స్ అనే వేదిక నుంచి పనిచేస్తున్నారని వెల్లడించారు. ఈ జగన్ కనెక్ట్స్ కు 2022 నుంచి సజ్జల భార్గవరెడ్డి ఇన్చార్జిగా కొనసాగుతున్నారని తెలిపారు. వైసీపీ సోషల్ మీడియా కార్యకర్తలంతా... సజ్జల భార్గవరెడ్డి, అర్జున్ రెడ్డి, వీరారెడ్డి, సుమ్మారెడ్డి సూచనల ప్రకారం పనిచేస్తుంటారని వివరించారు.

# అసెంబ్లీకి వెళ్లే దమ్ము, ధైర్యం లేకపోతే రాజీనామా చేయండి

- మొదటి పేజీ తరువాయి

ఘాటుగా విమర్శించారు. జనం మీకు ఓట్లేసి మిమ్మల్ని గెలిపించింది ఎందుకు? అసెంబ్లీ సమావేశాలు ఎగ్గొట్టడానికా? అంటూ మండిపడ్డారు.

"ప్రజలు మీకు ఓట్లేసింది... అసెంబ్లీ మీద అలగడానికో, మైకు ఇస్తేనే సభకు పోతానని మారాం చేయడానికో కాదు! మిమ్మల్ని ఎమ్మెల్యేగా గెలిపించింది... ఇంట్లో కూర్చుని సొంత మైకుల్లో మాట్లాడేందుకు కాదు! మీ స్వయంకృతాపరాధమే మిమ్మల్ని ప్రతిపక్షానికి దూరం చేసింది. ప్రతిపక్ష హోదా ఇస్తేనే అసెంబ్లీలో అడుగుపెడతాననడం మీ అవివేకానికి, మీ అజ్ఞానానికి నిదర్శనం" అంటూ జగన్ ను దుయ్యబట్టారు.

అసెంబ్లీ అనేది ప్రజాస్వామ్య దేవాలయం అని, ప్రజల పట్ల, ప్రజా సమస్యల పట్ల అధికార పక్షాన్ని నిలదీసేందుకు ప్రజలు ఇచ్చే గొప్ప అవకాశం అని షర్మిల వివరించారు.

"కూటమి ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలకు దిక్కు లేదు. మేనిఫెస్టోలో చెప్పిన హామీలు అమలు కావడంలేదు. రాష్ట్రంలో మహిళలపై దాడులు ఆగడంలేదు. శాంతిభద్రతలకు విఘాతం కలుగుతోంది. ఇసుక మాఫియా రాజ్యమేలుతోంది. బెల్టు షాపుల దందా అరికట్టడంలేదు. ఐదు నెలలు గడుస్తున్నా ఒక్క ఉద్యోగం భర్తీ కాలేదు. ప్రభుత్వ వైఫల్యాలపై నిలదీసే అవకాశాన్ని ప్రజలు వైసీపీకి ఇస్తే , ప్రతిపక్ష హోదా ఇస్తేనే అసెంబ్లీకి వస్తామనడం సిగ్గుచేటు. 1994లో కాంగ్రెస్ పార్టీకి కేవలం 26 సీట్లే వచ్చాయి. అయినప్పటికీ విపక్ష హోదా కావాలని మారాం చేయలేదు. ఆ 26 మంది సభ్యులతోనే అసెంబ్లీలో ప్రజాపక్షంగా కాంగ్రెస్ నిలిచింది. అనేక సమస్యలపై నాడు టీడీపీ ప్రభుత్వానికి కాంగ్రెస్ పార్టీ చుక్కలు చూపించింది.

ఇక కేంద్రంలో... 2014లో 44 సీట్లు... 2019లో 52 సీట్లే వచ్చినా కాంగ్రెస్ ప్రతిపక్ష హోదా అడగలేదు. హోదా లేకపోయినా రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే ప్రజల పక్షాన పోరాడారు. మోదీ నియంతృత్వాన్ని ప్రశ్నిస్తూ, దేశ ప్రజల గొంతుకలా కాంగ్రెస్ మారింది. ఇప్పటికైనా మీ పిచ్చితనాన్ని పక్కనబెట్టి అసెంబ్లీకి వెళ్లి, కూటమి ప్రభుత్వ వైఫల్యాలను, నిర్లక్ష్యాన్ని ఎండగట్టండి. ఒకవేళ అసెంబ్లీకి వెళ్లే దమ్ము, ధైర్యం మీకు లేకపోతే వైసీపీ శాసనసభాపక్షం మొత్తం రాజీనామా చేయండి. అప్పుడు ఇంట్లోనే కాదు... ఎక్కడైనా కూర్చుని తీరిగ్గా మాట్లాడుకోండి" అంటూ షర్మిల విమర్శనాస్త్రాలు సంధించారు.

# నేడు ఎమ్మెల్యేలకు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నాం

- మొదటి పేజీ తరువాయి

మధ్యాహ్నం టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి శాసనసభాపక్ష సమావేశం జరగనుంది. కాగా, అసెంబ్లీ వాయిదా పడిన అనంతరం స్పీకర్ అయ్యన్నపాత్రుడు స్పందించారు. నవంబరు 22 వరకు అసెంబ్లీ సమావేశాలు జరుగుతాయని వెల్లడించారు. అసెంబ్లీ సమావేశాలు ఏదో లాంఛనంగా అన్నట్టుగా కాకుండా, సీరియస్ గా జరగాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. బడ్జెట్ పై రేపు ఎమ్మెల్యేలందరికీ శిక్షణ తరగతులు ఉంటాయని అయ్యన్నపాత్రుడు తెలిపారు. వచ్చే శనివారం కూడా సభ నిర్వహించాలని నిర్ణయం తీసుకున్నట్టు వెల్లడించారు. బిల్లులు, చర్చలకు సమయం లభించేలా రెండు పూటలా సభ నిర్వహిస్తామని చెప్పారు. ఎనిమిది బిల్లులు సహా, వివిధ ప్రభుత్వ పాలసీలకు ఈ అసెంబ్లీ సమావేశాల్లో ఆమోదం లభించనుందని పేర్కొన్నారు.

# మణిపూర్‌లో భీకర ఎన్‌కౌంటర్.. 11 మంది కుకీ తిరుగుబాటుదారుల హతం

- మొదటి పేజీ తరువాయి

ఈ కాల్పుల్లో కొందరు సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్(CRPF) జవాన్లకు కూడా తీవ్ర గాయాలయ్యాయి. అస్సోం-మణిపూర్ సరిహద్దులో జిరిబమ్ పోలీస్ స్టేషన్ సమీపంలోని సీఆర్‌పీఎఫ్ పోస్ట్ దగ్గర గస్తీ కాస్తున్న భద్రతా బలగాలపై ఈ అనుమానిత కుకీ మిలిటెంట్లు కాల్పులు జరిపినట్లు సమాచారం. రెండు వైపుల నుంచి కాల్పులు జరపడంతో భద్రతా బలగాలు అప్రమత్తమై ఎదురు కాల్పులకు దిగినట్లు తెలిసింది. ఇవాళ తెల్లవారుజామున కూడా మణిపూర్‌లోని తూర్పు ఇంఫాల్ జిల్లాలో కాల్పులు జరిగాయి. సమీపంలోని కొండ పై నుంచి ఓపెన్ ఫైర్ చేయడంతో పొలంలో పనిచేసుకుంటున్న ఒక రైతు గాయపడ్డాడు. ఇలా గడచిన మూడు రోజుల నుంచి రైతులపై కాల్పులు జరపడంతో పొలాల్లో పనులకు వెళ్లాలంటేనే రైతులు భయపడుతున్నారు. తూర్పు ఇంఫాల్ జిల్లాలో తుపాకీ తూటాలే కాదు బాంబుల మోత కూడా మోగుతుండటంతో అక్కడి ప్రజలు బిక్కుబిక్కుమంటూ బతుకుతున్నారు.

**కుకీలు ఎవరు?**

ఇండియాలోని అనేక కొండ జాతి తెగల్లో కుకీలు ఒకటి. ఈశాన్య రాష్ట్రాలైన మణిపూర్, మిజోరం, మేఘాలయ, అస్సాం, త్రిపుర, నాగాలాండ్‌లో నివసిస్తారు. కుకీలు ప్రధానంగా కొండ ప్రాంతాల్లో నివసిస్తుండగా.. మణిపూర్ లోని చురాచంద్‌పూర్ వారికి బలమైన కోట. రాష్ట్ర జనాభాలో 40% ఉన్నారు. వీరిలో మళ్లీ 20 ఉప తెగలున్నాయి. చాలా ఏండ్ల కింద కుకీ తెగకు చెందినవాళ్లు క్రైస్తవ మతంలోకి మారారు. కొండ ప్రాంతాల్లో వీళ్లు ఉండొచ్చు. కానీ, ఆ స్థలాలు అమ్మడానికి లేదు.

# భారత 51వ చీఫ్ జస్టిస్ గా సంజీవ్ ఖన్నా ప్రమాణస్వీకారం

**పెన్ పవర్ డెస్క్:** భారతదేశ 51 వ ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ సంజీవ్ ఖన్నా ప్రమాణ స్వీకారం చేశారు. సోమవారం ఉదయం రాష్ట్రపతి భవన్ లో జరిగిన కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము జస్టిస్ సంజీవ్ ఖన్నాతో ప్రమాణం చేయించారు. 2019 జనవరి నుంచి సుప్రీం కోర్టులో న్యాయమూర్తిగా జస్టిస్ సంజీవ్ ఖన్నా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఆర్టికల్ 370 సహా పలు కీలక కేసుల్లో తీర్పులిచ్చిన బెంచ్ లలో జస్టిస్ సంజీవ్ ఖన్నా ఉన్నారు. వచ్చే ఏడాది మే 13 వరకు ఆయన సీజేఐగా బాధ్యతలు నిర్వహిస్తారు. కాగా, రాష్ట్రపతి భవన్ లో జరిగిన సీజేఐ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్, ప్రధాని నరేంద్ర మోదీ, మాజీ సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్, కేంద్ర న్యాయశాఖమంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ తదితరులు హాజరయ్యారు.

# ఎవరి కోసమో అసెంబ్లీ సమావేశాలు ఆగవు

- మొదటి పేజీ తరువాయి

చీఫ్ విప్ లు, విప్ లను ఖరారు చేస్తామని చెప్పారు. ఇక, అసెంబ్లీ సమావేశాలకు వైసీపీ అధ్యక్షుడు జగన్ గైర్హాజరు కావడంపైనా చంద్రబాబు వ్యాఖ్యలు చేశారు. ఎవరి కోసమో అసెంబ్లీ సమావేశాలు ఆగవని స్పష్టం చేశారు. సభలో ప్రజా సమస్యలపై చర్చించడం సభ్యుల బాధ్యత అని పేర్కొన్నారు. ఎమ్మెల్యేలు తప్పనిసరిగా అసెంబ్లీకి రావాలని, చర్చల్లో పాల్గొనాలని ముఖ్యమంత్రి చంద్రబాబు పిలుపునిచ్చారు.

# ఏపీలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంపై బడ్జెట్ ప్రసంగంలో మంత్రి ఏమన్నారంటే..?

## మహిళా శిశు సంక్షేమానికి 4 వేల కోట్ల నిధుల కేటాయించిన ప్రభుత్వం

## తల్లికి వందనం పథకానికి నిధులు కేటాయిస్తామన్న మంత్రి

## పేదరికంతో రాష్ట్రంలో ఒక్క విద్యార్థి కూడా చదువుకు దూరం కావొద్దని వ్యాఖ్య

## దీపం పథకంతో ఏటా మూడు సిలిండర్లు.. 5 లక్షల మందికి లబ్ధి

మహిళలు సాధించిన పురోగతి స్థాయిని బట్టి సమాజ పురోగతిని కొలుస్తానన్న అంబేద్కర్ మాటలను అనుసరించి ముఖ్యమంత్రి చంద్రబాబు మహిళా సాధికారతపై దృష్టి సారించారని మంత్రి పయ్యావల కేశవ్ పేర్కొన్నారు. సోమవారం అసెంబ్లీలో వార్షిక బడ్జెట్ ను ప్రవేశపెట్టిన మంత్రి, వివిధ శాఖల కేటాయింపులపై ప్రసంగించారు. రాష్ట్రంలో మహిళా సంక్షేమం, అభివృద్ధి, భద్రతకు తమ ప్రభుత్వం ప్రాధాన్యమిస్తుందని చెప్పారు. మహిళా శిశు సంక్షేమ శాఖకు ఈ ఏడాది బడ్జెట్ లో రూ.4,285 కోట్లను కేటాయించినట్లు తెలిపారు. తల్లికి వందనం పథకానికి నిధులు కేటాయిస్తామని మంత్రి చెప్పారు. పేదరికం కారణంగా రాష్ట్రంలో ఏ ఒక్క విద్యార్థి కూడా చదువుకు దూరం కాకూడదనేదే తమ ప్రభుత్వ ఉద్దేశమని చెప్పారు. ఇందుకోసం రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో 1 నుంచి 12వ తరగతి చదువుతున్న విద్యార్థుల తల్లులకు ఆర్థిక సాయం అందజేస్తామని చెప్పారు. సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా త్వరలోనే రాష్ట్రంలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ పథకం ప్రారంభిస్తామని మంత్రి వివరించారు. అదేవిధంగా, దీపం%-%2 పథకం ద్వారా గృహిణులకు ఏటా మూడు సిలిండర్లు ఉచితంగా ఇస్తున్నామని గుర్తుచేశారు. ఈ పథకం కింద ఇప్పటికే 5 లక్షల మంది గృహిణులు లబ్ధి పొందుతున్నారని అసెంబ్లీలో మంత్రి పయ్యావుల కేశవ్ పేర్కొన్నారు.



# భక్తిశ్రద్ధలతో భవాని శంకర స్వామికి ప్రత్యేక పూజలు

**కనిగిరి ఆర్సీఇంచార్జ్, పెన్ పవర్, నవంబర్ 11**

పట్టణంలోని శ్రీషిర్డీ సాయిబాబా దేవస్థానంలో కొలువైయున్న శ్రీభవాని శంకర స్వామి వారికి రెండవ కార్తీక సోమవారం సందర్భంగా ఉదయం మాహన్యాస పూర్వక ఏకాదశి రుద్రాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం స్వామివారికి సైకత లింగం (ఇసుకతో తయారు చేసి ) ప్రత్యేకఅలంకరణ చేశారు. ఆలయ కమిటీ పూజా కార్యక్రమాలను పర్యవేక్షించారు. అలయ పూజారి శ్రీమణికంఠ స్వామి పూజా కార్యక్రమంలను నిర్వహించారు.

10 YEAR ANNIVERSARY 2014 - 2024
పెన్ పవర్
గుంటూరు | పల్నాడు | తిరుపతి
బాపట్ల | ప్రకాశం | నెల్లూరు

పెన్ పవర్ వార్త కథనానికి స్పందన



# సాయంత్రం వేళ పాఠశాల స్కూల్ బస్సులు టైమింగ్ మార్చిన ఆర్టీసీ అధికారులు



సాయంత్రం వేళ పాఠశాల బస్సుల టైమింగ్ మార్చండి

మల్లాపురం గొల్లపల్లె వెళ్లే విద్యార్థిని విద్యార్థుల విన్నపం

బేస్తవారిపేట, పెన్ పవర్ నవంబర్ 8

గ్రామీణ ప్రాంతాల నుండి బేస్తవారిపేట మండల కేంద్రంలో ప్రభుత్వ మరియు ప్రైవేటు పాఠశాలల్లో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థినీ విద్యార్థులు ఆర్టీసీ బస్సు సమయపాలన పాటించకపోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. గిద్దలూరు ఆర్టీసీ డిపో అధికారులు కంభం ఆర్టీసీ కంట్రోల్ పాయింట్ నుండి ప్రతిరోజు విద్యార్థిని విద్యార్థుల కొరకు ఉదయం సాయంత్రం వేళల్లో గొల్లపల్లి, మల్లాపురం రెండు పాఠశాల బస్సులను ఏర్పాటు చేశారు. ఉదయం వేళల్లో బస్సులు రెండు విద్యార్థిని విద్యార్థులకు సమయపాలన కరెక్ట్ గా ఉన్నప్పటికీ, సాయంత్రం వేళల్లో బస్సులు సమయానికి రాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వ మరియు ప్రైవేటు పాఠశాలలు సాయంత్రం ఐదు గంటలలోపు వదిలిపెడతారు. అప్పటినుండి 150 మంది విద్యార్థిని విద్యార్థులు బస్సు వచ్చే అంతవరకు బస్టాండ్ లో దాదాపు గంటన్నర పాటు నిరీక్షణ ఉందని విద్యార్థిని విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బేస్తవారిపేటలో ప్రయాణికులు నిల్చునేందుకు బస్టాండ్ సౌకర్యం లేకపోవడంతో తాము షాపుల ముందు నిరీక్షించాల్సి వస్తుందన్నారు. సాయంత్రం నాలుగున్నర గంటలకు కనిగిరి డిపో బస్సు ఉన్నప్పటికీ ఆ బస్సులో విద్యార్థినీ విద్యార్థులు ఎవరిని అందులో అనుమతించడం లేదు. సాయంత్రం వేళ గిద్దలూరు డిపో అధికారులు ఏర్పాటు చేసినట్లు గొల్లపల్లి, మల్లాపురం బస్సులను సాయంత్రం ఐదున్నర గంటలలోపు ఏర్పాటు చేసి విద్యార్థినీ, విద్యార్థుల ఇబ్బందులను తీర్చాలని ... కోరుతున్నారు.

ఆన్లైన్ ద్వారా దరఖాస్తు
వినియోగదారులకు నిర్దేశిత సమయ
సిలిండర్ అందజేయాలి.
ఆధార్ అనుసంధానం చేసుకోని

**బెస్తవారిపేట, పెన్ పవర్ నవంబర్ 11**

బెస్తవారిపేట మండలంలోని పలు గ్రామాలకు చెందిన విద్యార్థిని విద్యార్థుల కొరకు గిద్దలూరు ఆర్టీసీ అధికారులు కంభం పాయింట్ నుండి గొల్లపల్లి,మల్లాపురం గ్రామాలకు ఆర్టీసీ సర్వీసులను ఏర్పాటు చేశారు. ఆ సర్వీసులు ఉదయం వేళ విద్యార్థులకు ఎలాంటి సౌకర్యం లేకుండా ఉన్నాయి. సాయంత్రం వేళ విద్యార్థిని విద్యార్థులు బస్సుల కొరకు సాయంత్రం ఆరున్నర గంటల వరకు వేచి ఉంటున్నారు. ఆ విషయాన్ని" సాయంత్రం వేళ పాఠశాలల బస్సు టైమింగ్స్ మార్చండి" 'గొల్లపల్లి మల్లాపురం గ్రామాల విద్యార్థిని విద్యార్థుల విన్నపం ' అనే వార్త కథనం గత శనివారం ప్రచురితమైంది. ఆ వార్త కథనానికి స్పందించిన గిద్దలూరు డిపో మేనేజర్ మరియు కంట్రోల్ ఇన్స్పెక్టర్ ఆదేశాల మేరకు గిద్దలూరు ఆర్టీసీ ఎస్ టి ఐ రామా నాయక్ సోమవారం సాయంత్రం వేళ బెస్తవారిపేట కు వచ్చి స్థానిక బస్టాండ్ లో వేచి ఉన్నటువంటి విద్యార్థిని విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థుల తెలిపిన విషయాల ప్రకారం సాయంత్రం ఐదు గంటల 15 నిమిషాలకు కంభం లో గొల్లపల్లి మల్లాపురం బస్సులు బయలుదేరి బేస్తవారిపేటకు ఐదున్నర గంటలకు వచ్చేలా చర్యలు తీసుకున్నారు. ఎస్ టి ఐ రామ్ నాయక్ బస్సు టైమింగ్స్ 141 కార్డులో మార్పులు చేసి ప్రతిరోజు ఐదున్నర గంటలకు బెస్తవారిపేటకు వచ్చే విధంగా వెంటనే చర్యలు తీసుకున్నారు. బస్సు టైమింగ్స్ మార్పులకు వెంటనే చర్యలు తీసుకున్న గిద్దలూరు ఆర్టీసీ అధికారులకు, పెన్ పవర్ పత్రిక యాజమాన్యానికి విద్యార్థినీ విద్యార్థులు వారి తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలియజేశారు.



PRESS పెన్ పవర్ ఎఫెక్ట్ AP&TS

# ప్రజలకు కన్నీరు మిగిల్చిన బడ్జెట్

## మోసపూరిత బడ్జెట్ తో జిల్లాకు మోసం
## జిల్లాకు బడ్జెట్ వల్ల ప్రయోజనాలు శూన్యం
## ఆవిరైన ఆరు గ్యారెంటీ పథకాలు
## జిల్లా ప్రజలను నిరాశపరిచిన బడ్జెట్



**ఒంగోలు పెన్ పవర్ నవంబర్ 11**

సోమవారం రాష్ట్ర ప్రభుత్వము ప్రవేశపెట్టిన బడ్జెట్ వల్ల ప్రకాశం జిల్లాకు వరిగిందేమిలేదని సరిపడనంత నిధులు కేటాయించకుండా తూతూ మంత్రంగా బడ్జెట్ ప్రవేశపెట్టి జిల్లా ప్రజలను కూటమి ప్రభుత్వం మోసం చేసిందని, ఈ బడ్జెట్ జిల్లా ప్రజల ఆశలపై నీళ్ళు చల్లిందని,ఇది కేవలం అంకెల గారడి బడ్జెట్ ఆని వైసీపీ జిల్లా అధ్యక్షులు,దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి ధ్వజమెత్తారు. ప్రకాశంజిల్లా పశ్చిమ ప్రాంత వర ప్రదాయిని అయిన వెలుగొండ ప్రాజెక్ట్ కు నిధులు కేటాయించక పోవడం దుర్మార్గమన్నారు.దొనకొండ లో పారిశ్రామిక అభివృద్ధి నిరుద్యోగుల ఉపాధికి నిధులు శూన్యమన్నారు. మార్కాపురం లో ఏర్పాటు చేస్తున్న మెడికల్ కాలేజీకి నిధులు ఏక్కడని కూటమి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.దొనకొండను పారిశ్రామికంగా అభివృద్ధి చేసి ఆ ప్రాంత నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్న ఎన్నికల హామీలు ఎటుపోయాయని,ఈ రోజు పెట్టిన బడ్జెట్ లో ఏటువంటి నిధులు కేటాయించలేదు అంటే కూటమి ప్రభుత్వం ఆ ప్రాంత ప్రజలను నిలువునా మోసం చేయడమేనని అన్నారు. గుండ్ల కమ్మ ప్రాజెక్ట్ అభివృద్ధి కి నిధులు కేటాయించకపోగా కల్లబొల్లి మాటలతో మరోసారి జిల్లా ప్రజలను మోసం చేశారన్నారు.అన్నదాత సుఖీభవ క్రింద రైతులకు 20 వేల రూపాయలు ఇస్తాము అన్నారు కానీ ఈరోజు బడ్జెట్ లో 4500 కోట్లు కేటాయించినట్లు చూపించారన్నారు..దీనిలో 1000 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం నుండి 3500 కోట్లు పీఎం కిసాన్ నుండి కేటాయించారు.1000 కోట్లతో అన్నదాత సుఖీభవ ఎలా అమలు చేస్తారో ప్రజలకు చెప్పాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఎమ్మెల్యే శివప్రసాద్ రెడ్డి అన్నారు.తల్లికి వందనం క్రింద ప్రతి విద్యార్థికి 15వేలు ఇస్తామన్నారు.ఇప్పుడు బడ్జెట్ లో మీరు కేటాయించిన ఐదు వేల కోట్లు నిధులు చూస్తే ఇంటిలో వున్న ప్రతి విద్యార్థికి 15 వేలు ఇచ్చే పరిస్థితి లేదు. అంటే తల్లికి వందనం ఎగనామం పెట్టినట్టే అని అర్థం చేసుకోవాలా అని ప్రశ్నించారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి మహిళకు 15వందల రూపాయలు ఇస్తామన్నారు.ఈబడ్జెట్ లో ఆ పథకం కు నిధులు కేటాయింపులు లేదంటే ఈ పథకం కూడా లేనట్టేనని అన్నారు గ్రామీణ ప్రాంతాలలో 3సెంట్లు పట్టణ ప్రాంతాలలో నిరుపేదలకు 2 సెంట్లు భూమి కేటాయిస్తామని చెప్పి ఈ బడ్జెట్ లో ఆ పథకానికి నిధులు కేటాయించకపోవడం దుర్మార్గపు చర్యని మండిపడ్డారు.ఈ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ కేవలం అంకెలగారడితో మోస పూరిత బడ్జెట్ అని కూటమి ప్రభుత్వం వెంటనే ప్రకాశం జిల్లాకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని,వెలుగొండ ప్రాజెక్ట్ కు నిధులు కేటాయించాలని,సూపర్ సిక్స్ పథకాలు అమలకు నిధులు కేటాయించాలని బూచేపల్లి డిమాండ్ చేశారు.



# రాష్ట్ర ప్రజల పూర్తి ఆమోదయోగ్యంగా బడ్జెట్

## మౌలిక వసతులకు పెద్దపీట :ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు

**కందుకూరు పెన్ పవర్, నవంబర్ 11**

అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమములకు వారధిగా ఈరోజు శాసనసభలో ప్రవేశపెట్టిన రాష్ట్ర బడ్జెట్ ఉందని కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు అన్నారు.తెలుగుదేశం, జనసేన బిజెపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత మొదటి సారిగా శాసనసభలో బడ్జెట్ ను ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సారథ్యంలో రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపేందుకు,అలాగే అభివృద్ధితో పాటు సంక్షేమాన్ని ప్రజలకు అందించేందుకు కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ ప్రవేశ పెట్టిన బడ్జెట్ పూర్తిగా ప్రజల ఆమోదయోగ్యంగా ఉందని చెప్పారు. గత జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టిందని, వైసీపీ ప్రభుత్వ చేతగాని పాలనతో రాష్ట్రాన్ని సర్వ నాశనం చేశారన్నారు. గత ప్రభుత్వ వైఫల్యాలతో అస్తవ్యస్తమైన వ్యవస్థలను గాడిలో పెడుతూ ప్రజా సమస్యలను పరిష్కరించే బాధ్యతయుతంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని ఆయన పేర్కొన్నారు .కూటమి ప్రభుత్వం పేదల కోసం బడ్జెట్ లో విద్యా, వైద్యానికి పెద్దపీట వేశామని తెలిపారు. 2.94 లక్షల కోట్ల రూపాయల బడ్జెట్ లో వెనుకబడిన వర్గాలకు, ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేశారని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల మీద దృష్టి సారించిన ప్రభుత్వం పంచాయితీ రాజ్ శాఖకు 16 వేల 739 కోట్ల రూపాయలు కేటాయించిందని అలాగే రోడ్ల అభివృద్ధికి 9554 కోట్ల రూపాయలు కేటాయించారని చెప్పారు. విద్యా వ్యవస్థలో నూతన మార్పులు తీసుకొచ్చే విధంగా విద్యార్థుల భవిష్యత్తు కోసం కృషి చేసిన కూటమి ప్రభుత్వం 30 వేల కోట్ల రూపాయలు బడ్జెట్లో కేటాయించిందని తెలిపారు. మహిళా శిశు సంక్షేమం కోసం 4280 కోట్ల, ఎస్సీ ల సంక్షేమం కోసం 18497 కోట్ల రూపాయలు,ఎస్టీ ల అభివృద్ధి కోసం 7557 కోట్ల రూపాయలు బడ్జెట్ లో కేటాయించినట్లు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు తెలిపారు.

# ప్రజల సమస్యలు పట్టని వైసీపీ ఎమ్మెల్యేలు రాజీనామా చేయాలి

## తెదేపా అధికార ప్రతినిధి గోచిపాతల మోషే

**కందుకూరు పెన్ పవర్, నవంబర్ 11**



ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రస్తావించి పరిష్కారం దిశగా అడుగులు వేయడానికి దేవాలయం లాంటి అసెంబ్లీ వేదిక అయినప్పటికీ అసెంబ్లీ సమావేశాలకు వెళ్ళకుండా మొహంచాటేసి ప్రజల సమస్యలను గాలికి వదిలేసిన వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు మూకుమ్మడిగా రాజీనామా చేసి ప్రజలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని నెల్లూరు పార్లమెంటు తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి గోచిపాతల మోషే డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ప్రజలు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి కూడా ఓట్లువేసి 11 మంది ఎమ్మెల్యేలను గెలిపించిన విషయం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధినేత , పులివెందుల ఎమ్మెల్యే వైఎస్ జగన్ మోహన్ రెడ్డి మర్చిపోయాడేమోననే అనుమానం కలుగుతుందని మోషే మండిపడ్డారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ప్రజలు ఇబ్బందులు పడుతున్నా నాకు వచ్చిన నష్టమేమీ లేదని నాకు మాత్రం ప్రతిపక్ష నేత హోదా కల్పిస్తే అసెంబ్లీకి వస్తానని జగన్మోహన్ రెడ్డి మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ఎన్డీఏ కూటమి ప్రభుత్వంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు , ఉపముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ సారథ్యంలో రాష్ట్ర అభివృద్ధి , ప్రజల సంక్షేమంపై దృష్టిసారించి పరిపాలనను గాడినపెడుతుంటే చూస్తూ ఓర్వలేక నిరాధారమైన ఆరోపణలు చేస్తూ పబ్బం గడుపుకుంటున్నాడే తప్ప ప్రజలకు ఏమి అవసరమో కనీస అవగాహన లేని వ్యక్తిగా జగన్మోహన్ రెడ్డి నిలిచిపోయారని మోషే ఆవేదన వ్యక్తంచేశారు. జగన్మోహన్ రెడ్డి ప్రవర్తిస్తున్న తీరు దేనికి నిదర్శనమో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు సమాధానం చెప్పాలన్నారు.



# పెద్దారికట్లలో పడకేసిన పారిశుధ్యం

**కొనకనమిట్ల పెన్ పవర్ నవంబర్ 11**

మండలంలోని పలు గ్రామాల్లో పారిశుధ్యం పడకేసింది. ప్రస్తుతం ఇప్పుడున్న పరిస్థితుల్లో పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇచ్చి సీజనల్ వ్యాధుల పట్ల సూచనలు ఇవ్వాల్సిన అధికారులు గ్రామాల్లో పట్టించుకోని పరిస్థితి ఏర్పడింది. పెద్దారికట్ల గ్రామంలో 565 జాతీయ రహదారి పక్కన చెత్త చేదారంతో అపరిశుద్యం నెలకొంది దీంతో వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని గ్రామస్థులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. గ్రామస్థులు ఉపయోగించిన చెత్త చెదారంతో పాటు ప్లాస్టిక్ కవర్లు, ప్లాస్టిక్ వస్తువులన్ని ఒకే చోట పడ వేయడంతో డంపింగ్ యార్డ్ ను తలపిస్తుంది.ఈ రోడ్ గుండా రాక పోకలు సాగించే పలువురు వాహనదారులు జాతీయ రహదారి పక్కనే ఇలా ఉంటే.. గ్రామంలోని వీధులు ఇంకెలా ఉన్నాయో అని విమర్శలు గుప్పిస్తున్నారు.రోడ్ పక్కన చెత్త పేరుకుపోవడంతో దోమలు వ్యాప్తి చెంది ఆ చుట్టు పక్కలనున్న నివాస గృహాల వారు ఇబ్బందులు పడుతున్నారు. పారిశుధ్యం మెరుగు పర్చాల్సిన పంచాయితీ కార్యదర్శులు పట్టి పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. తూఫాన్ ప్రభావం వలన అధిక వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో దోమలు మరింత వృద్ధి చెందే అవకాశం ఉందని దాని వల్ల వ్యాధులు మరింత ప్రభలే అవకాశం ఉంటుందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.తక్షణమే పంచాయతీ అధికారులు స్పందించి గ్రామంలో పేరుకుపోయిన చెత్త చేదారాలను వెంటనే తొలగించి వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.



# పొదిలిలో నేడే డయల్ యువర్ డిఎం కార్యక్రమం



పొదిలి, పెన్ పవర్ నవంబర్ 11

పొదిలిలో ప్రయాణికుల సౌకర్యార్థం మంగళవారం నాడు డయల్ యువర్ డిఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని పొదిలి ఆర్టీసీ డిపో మేనేజర్ జె సుందరరావు చెప్పారు తమ డిపో పరిధిలోని పొదిలి, కొనకనమిట్ల, మర్రిపూడి, దర్శి, దొనకొండ, కురిచేడు మండలాలకు చెందిన ప్రజలు, ప్రయాణికులు ఆర్టీసీ సేవల పరంగా ఎటువంటి ఇబ్బందులు ఉన్నప్పటికీ, వాటిని తమ దృష్టికి తీసుకొని రావాలని డిఎం సుందర రావు కోరారు అందుకోసం ఉదయం 11 గంటల నుండి 12 గంటల వరకు తమ సెల్ ఫోన్ 99 59 22 57 00 నంబరుకు ఫోన్ ద్వారా తమ దృష్టికి తీసుకొని రావాలని ఆయన సూచించారు ఆర్టీసీ డిపో పరంగా అందుతున్న సేవలలో ఎటువంటి ఇబ్బందులు ఉన్నా వాటిని తమ దృష్టికి తీసుకొని రావాల్సిందిగా డిఎం సుందర రావు కోరారు అలాగే ఆర్టీసీ డిపో అభివృద్ధి కోసం కూడా అవసరమైన సలహాలు సూచనలు కూడా అందించాలని డిఎం సుందర రావు సూచించారు.

# ఘనంగా మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్ జయంతి వేడుకలు





దొనకొండ నవంబర్ 11 పెన్ పవర్

మండల కేంద్రంలోని మండల పరిషత్ ప్రాథమిక ఊర్దూ పాఠశాల నందు శ్రీయుత మౌలానా అబుల్ కలాం అజద్ చిత్రపటానికి ఆయన జయంతి సందర్భంగా పూలమాలతో గణ నివాళులర్పించడమైనది. వారు పుట్టినరోజును వారి గౌరవార్థం కేంద్ర ప్రభుత్వం జాతీయ విద్యా దినోత్సవం గా జరుపుకోవాలని2008 సెప్టెంబరు 11న జరుపుకోవాలని ప్రకటించారు. వారు జాతీయ మొదటి విద్యాశాఖమంత్రిగా 11సంవత్సరాలు పనిచేసినారు అని పాఠశాల ప్రదానోపాధ్యయులు అని అది మూలపు ప్రభుదాసు విద్యార్థులుకు వివరించడమైనది. ఈ కార్యక్రమంలో ఆయన స్కూల్ సిబ్బంది పాల్గొన్నారు.

# జగన్మోహన్ రెడ్డిని కలిసిని సత్తిరెడ్డి

పుల్లలచెరువు పెన్ పవర్ నవంబర్ 11

మాజి ముఖ్యమంత్రి వైయస్సార్ పార్టి అధినేత వై యస్ జగన్మోహన్ రెడ్డిని సి కోత్తపల్లి సర్పంచ్ సత్తిరెడ్డి సోమవారం కలిసారు.ఈ సందర్భంగా తమ పంచాయితిలోని పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్ళారు.వైసిపి ప్రవుత్వ హాయాంలో సమస్యల నెలవు లేదనీ అధికారులు ఎప్పటికప్పుడు సమస్యలు పరిష్కరించేవారని,ప్రస్తుతం అధికారులకు జవాబుదారితనం లేకుపోవడంతొ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని వివరించారు.ఈ సందర్భంగా మాజి ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి మాట్లాడుతు కూటమి ప్రభుత్వం అనతి కాలంలోనే ప్రజల మన్నన కోల్పోయిందని,రానున్న రోజుల్లో ప్రజలకు మంచి చేసే మన ప్రభుత్వం వస్తుందని,పార్టిఅభ్యున్నతి కోసం పాటుపడాలని కోరారు.ఈయన వెంట యర్రగొండపాలెం శాసన సభ్యుడు తాటిపర్తి చంద్రశేఖర్.నాయకులు పాల్గోన్నారు.



# అబ్దుల్ కలాం ఆజాద్ 136వ జయంతి వేడుకలు -ముస్లిం సంక్షేమ సంఘం







పెన్ పవర్ పామూరు నవంబర్ 11

పట్టణంలోని ముస్లిం సంక్షేమ సంఘం కార్యాలయం నందు సోమవారం మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్ 136వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముస్లిం సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా పలువురు ముస్లిం నాయకులు మాట్లాడుతూ స్వాతంత్ర్య సమర యోధుడు, భారత ప్రభుత్వ తొలి విద్యాశాఖామంత్రి, మౌలానా అబుల్ కలాం ఆజాద్. అతను అసలుపేరు "మొహియుద్దీన్ అహ్మద్", 'అబుల్ కలాం' అనేది బిరుదు, 'ఆజాద్' కలంపేరు. ఆలియా బేగమ్, ఖైరుద్దీన్ అహమ్మద్ లకు 1888 నవంబరు 11 న మక్కాలో జన్మించాడు. మౌలానా అబుల్ కలాం ఆజాద్ భారత స్వాతంత్ర్య సమర ముఖ్య నాయకులలో ఒకడు. అతను ప్రఖ్యాత పండితుడు, కవి. మౌలానా అబుల్ కలాం ఆజాద్ అరబిక్, ఇంగ్లీష్, ఉర్దూ, హిందీ, పెర్షియన్, బెంగాలీ మొదలగు అనేక భాషలలో ప్రావిణ్యుడు.భారత ప్రభుత్వంలో 11 సంవత్సరాలపాటు విద్యాశాఖామంత్రిగా పనిచేసాడు అని అన్నారు. ఈ కార్యక్రమంలో ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షులు షేక్ హాజీ గౌస్, నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి అబ్దుల్ రషీద్, షేక్ హుస్సేన్, జనసేన పార్టీ జిల్లా నాయకులు యలమందల రహీముల్లా, జనసేన పార్టీ పట్టణ అధ్యక్షుడు షేక్ సందాని, టిడిపి జిల్లా మైనార్టీ నాయకులు ఆర్ఆర్ రఫీ, పత్తి మస్తాన్, యలమందల అస్లీమ్ షేక్ చాంద్ భాషా, షేక్ మీరా మొహిదీన్, షేక్ ఖాసిం, షేక్ ఖజా మొద్దీన్, సయ్యద్ మాగాలి ముస్లిం సంక్షేమ సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# శభాష్... శ్రీనివాస్!

## రాష్ట్ర స్విమ్మింగ్ పోటీల్లో బంగారు పతకాలు కైవసం





పొదిలి, పెన్ పవర్ నవంబర్ 11

ఈనెల 10వ తేదీన ఆదివారం నాడు వరంగల్లులో జరిగిన రాష్ట్రస్థాయి స్విమ్మింగ్ పోటీల్లో ప్రకాశం జిల్లా వాసి తమ సత్తా చాటారు ఇక్కడ జరిగిన ఈత పోటీల్లో వివిధ స్థాయిల్లో పాల్గొని మూడు బంగారపు పతకాలతోపాటు ఒక సిల్వర్ మెడల్ ను కూడా కైవసం చేసుకున్నారు ఈ మేరకు పతకాలను సాధించిన యువకులు ప్రకాశం జిల్లా వాసి కావడం గర్వకారణం జిల్లాలోని ఉప్పలపాడు పంచాయతీ పరిధిలోని గోగినేని వారి పాలెం కు చెందిన శ్రీనివాసరావు కు చిన్నప్పటినుండి ఈత పట్ల మక్కువ ఏర్పడింది ఆ మక్కువతో శ్రీనివాసరావు ఈతపట్ల మమకారం పెంచుకొని కష్టపడి స్విమ్మింగ్ లో మెలకువలను నేర్చుకొని స్విమ్మింగ్ పోటీల్లో దిట్టగా తయారయ్యారు గతంలో కూడా శ్రీనివాసరావు నేపాల్ లో జరిగిన అంతర్జాతీయ ఈత పోటీల్లో భారతదేశం తరపున పాల్గొని ఆ పోటీల్లో కూడా బంగారపు పతకాలను సాధించి భారత దేశ పరువు ప్రతిష్టలను ఇనుమడింప చేశారు ఆదివారం నాడు వరంగల్ లో జరిగిన రాష్ట్రస్థాయి ఈత పోటీల్లో కూడా శ్రీనివాసరావు పాల్గొని తన ప్రతిభను చాటారు అనంతరం అక్కడి ప్రముఖుల చేత ప్రశంసలు అందుకున్నారు ఈ సందర్భంగా సోమవారం నాడు ఆయన పొదిలిలో మాట్లాడుతూ ఈత పోటీల్లో తనకు నాలుగు పతకాలు రావడం సంతోషదాయకంగా ఉందన్నారు అయితే తన లాంటి పేదలకు తగిన ప్రోత్సాహకరం లభించడం లేదని శ్రీనివాసరావు ఆవేదన వ్యక్తం చేశారు ముఖ్యంగా మన జిల్లాలో కళాకారులకు ఆదరణ లేకుండా పోయిందని ఆయన ఆక్షేపించారు పొట్టకూటి కోసం తాను అహర్నిశలు శ్రమ పడాల్సి వస్తుందని, ఇది తన కెరీర్ కు కూడా అడ్డుగా నిలుస్తుందని శ్రీనివాసరావు తన బాధను వ్యక్తపరిచారు దేశ, రాష్ట్రస్థాయిలో జరిగిన ఈత పోటీల్లో తన నైపుణ్యం చూపించానని అది తనకు ఎంతో గర్వకారణంగా ఉందన్నారు ఇప్పటికైనా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తనకు ఉద్యోగ అవకాశం కల్పించి ఆదుకోవాలని శ్రీనివాసరావు అభ్యర్థించారు.

# టిడ్కో గృహాలను పూర్తిగా లబ్ధిదారులకు ఇవ్వాలి సిపిఎం



కావలి, పెన్ పవర్ నవంబర్ 11

సిపిఎం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ప్రజా పోరు కార్య కార్యక్రమంలో భాగంగా 20వ వార్డు శాంతి నగర్ లో ఇంటింటికీ కరపత్రాలను పంచుతూ ప్రజా పోరు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు పసుపులేటి తిరుపాలు వై కృష్ణమోహన్ మాట్లాడుతూ కావలి పట్టణం మద్దూరు పాడు వద్ద నిర్మించి ఉన్న సుమారు 2200 ఇల్లు పూర్తిగా లబ్ధిదారులకు ఇవ్వాలని ప్రస్తుతం ఆ గృహాలలో సగం మందికి కూడా ఇల్లులు ఇచ్చిన సందర్భం కనపడలేదని అక్కడ నివాసం ఉంటున్న వారికి కూడా పూర్తిగా అన్ని వసతులు ఏర్పాటు చేయలేదని వర్షము పడితే అక్కడ ఇళ్ల చుట్టూ మోకార్టి లోతు నీళ్లు ఉంటున్నాయని ఇళ్లకు లిఫ్ట్ లేదని త్రాగునీటి సౌకర్యం పూర్తిగా లేదని ఇళ్ల చుట్టూ కాంపౌండ్ నిర్మాణం లేదని చీకటి పడితే పాములు సంతరిస్తున్నాయని అక్కడ నివాసం ఉంటున్న వారు ఎన్నో ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని వీరికి అక్కడ నెలకొని ఉన్న సమస్యలన్నిటిని అధికారులు పరిష్కరించాలని మిగిలి ఉన్న ఇళ్లను లబ్ధిదారులకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అంతేకాకుండా ముసునూరు వద్ద నిర్మాణంలో ఉన్న జగనన్న ఇల్లును త్వరగా పూర్తిచేసి అన్ని వసతులు ఏర్పాటు చేసి పేదలకు ఇవ్వాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కారం కొరకు ఈనెల 14వ తేదీన ఆర్డీవో కార్యాలయం వద్ద జరిగే ధర్నాలో ప్రజలు పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యదర్శి పసుపులేటి పెంచలయ్య ,నాయకులు వి. బాబురావు కార్యకర్తలు పాల్గొన్నారు.

# మ్యాచ్ బాల్ క్రికెట్ టోర్నమెంట్ లో విజేతగా నిలిచిన బాపట్ల జిల్లా పోలీస్ జట్టు

## జిల్లా పోలీస్ జట్టు సభ్యులను అభినందించిన జిల్లా ఎస్పీ తుషార్ డూడి



పెన్ పవర్ స్టాఫ్ రిపోర్టర్ బాపట్ల నవంబర్ 11

బాపట్ల క్రికెట్ అసోసియేషన్ వారు నిర్వహించిన "మ్యాచ్ బాల్ క్రికెట్ టోర్నమెంట్" లో జిల్లా పోలీస్ జట్టు టోర్నమెంట్ విజేతగా నిలిచింది. నవంబర్ 11న సోమవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో జిల్లా ఎస్పీ తుషార్ డూడి జట్టు సభ్యులను ప్రత్యేకంగా అభినందించి, గెలుపొందిన కప్పును, నగదు బహుమతిని వారికి అందజేసినారు. టోర్నమెంట్ ఫైనల్ మ్యాచ్ ఆదివారం బాపట్ల ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల మైదానంలో జరిగింది. ఉత్కంఠ భరితంగా జరిగిన ఫైనల్ మ్యాచ్ లో బాపట్ల స్ట్రైకర్స్ జట్టు పై బాపట్ల పోలీస్ జట్టు విజయం సాధించింది. టోర్నమెంట్ విజేతగా నిలిచిన పోలీస్ జట్టుకు కప్పుతో పాటు ఇరవైవేల నగదు బహుమతిని, క్రీడాకారులకు మెడల్స్ ను నిర్వాహకులు అందించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ బాపట్ల క్రికెట్ అసోసియేషన్ వారు నిర్వహించిన మ్యాచ్ బాల్ క్రికెట్ టోర్నమెంట్ లో జిల్లాలో విధులు నిర్వహించే పోలీస్ సిబ్బంది ఒక జట్టుగా ఏర్పడి పాల్గొని విజయం సాధించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. 24 గంటలూ విధి నిర్వహణలో ఉండే పోలీస్ సిబ్బందికి క్రీడలలో పాల్గొనడం వలన ఒత్తిడిని అధిగమించి మానసికంగా దృడంగా ఉంటారన్నారు. మరింత సమర్ధవంతంగా విధులు నిర్వహించే అవకాశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో అడ్మిన్ ఆర్.ఐ మౌలుద్దీన్, ఐటీ కోర్ ఎస్.ఐ నాయబ్ రసూల్, సీసీ హరి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# బెల్ట్ షాప్ నిర్వహిస్తున్న వ్యక్తి అరెస్టు

## ఎస్ ఐ బి నరసింహారావు




పెన్ పవర్, కంభం నవంబర్ 11

బెల్ట్ షాప్ నిర్వహిస్తూ మద్యం విక్రయాలు చేస్తున్న ఓ వ్యక్తిని అరెస్టు చేసినట్లు కంభం ఎస్సై బి నరసింహారావు తెలిపారు. సోమవారం కంభం మండలం తురిమెల్లలో అనధికారికంగా బెల్ షాప్ ఏర్పాటుచేసి మద్యం విక్రయాలు చేస్తున్నాడు. ఆ వ్యక్తిని అదుపులోనికి తీసుకొనగా 15 కోటర్ బాటిళ్లు ను స్వాధీనం చేసుకొనడం జరిగింది. పట్టుబడిన వ్యక్తి పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. గ్రామాల్లో మద్యం విక్రయాలు చేస్తున్నట్లయితే తమ దృష్టికి తీసుకురావాలని ఎస్ఐ పేర్కొన్నారు.

# అత్యంత భక్తిశ్రద్ధలతో సాగర హారతి పూజా కార్యక్రమం



చీరాల, నవంబర్ 11,పెన్ పవర్

చీరాల లో వాడరేవు నందు గల ఆంజనేయ స్వామి విగ్రహం ఎదురు, కార్తీక సోమ వారం రోజున, సాగర హారతి కార్యక్రమాన్ని, శ్రీ కామాక్షి కేర్ హాస్పిటల్ ఎండి డాక్టర్ తాడి వలస దేవరాజు, అర్చక స్వాములు వేద పండితులు కారం చేటి నగేష్ కుమార్, వీట వెంక టేష్, హిందూ చైతన్య వేదిక చీరాల వారి ఆధ్వర్యంలో, అత్యంత భక్తి శ్రద్దలతో, శివ పార్వతుల పూజ, సాగర హా రతి కార్యక్రమాలను నిర్వహిం చారు. ఈ సందర్భంగా జ్వాలా నరసింహం, డాక్టర్ తాడివలస దేవరాజు లు మాట్లాడుతూ, కార్తీక పౌర్ణమి రోజున, హైందవ శంఖారావం లో భాగంగా, చీరాల వాడరేవు నందు, నవంబర్ 15వ తేది, శుక్రవారం సాయంత్రం భజన కార్యక్రమం, సాగర తీరాన శివాభిషేకం, సా మూహిక సాగర హారతి కార్య క్రమం నిర్వహించబడుతుంద ని,ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమం లో పాల్గొని, విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కారంచేటి నగేష్ కుమార్, విట వెంకటేశ్, గోపి, రఘు, శ్రీ మహాలక్ష్మి మహిళా భజన బృందం సభ్యులు, భక్తు లు, వాడరేవు ప్రాంత ప్రజలు, పాల్గొన్నారు.


# పాసుపోర్టు పోయినది

కందుకూరు పట్టణంలోని సాయి నగర్ నివాసి బోట్లగూడూరు సాయి నాగ శ్రావణి తండ్రి శేషగిరి తనకు చెందిన ఇండియన్ పాస్ పోర్ట్ (H 2910980) ,తన కుమార్తె చీమలమర్రి హంసిని కి చెందిన అమెరికన్ పాస్ పోర్ట్ (473821918) గల ఫైల్ గత నెల ఐదవతేది పోస్ట్ ఆఫీస్ నుండి ఇంటికి వెళ్లే సమయంలో పోయినవి దొరికిన వారు ఈ క్రింది చిరునామాకు తెలియజేయగలరు.

ఇట్లు
BSN. శ్రావణి
D/o. B. శేషగిరి
సాయి నగర్ ,కోవూరు రోడ్
కందుకూరు –523105
SPSR నెల్లూరు జిల్లా
9908477328.

# అబుల్ కలాం ఆజాద్ సేవలు చిరస్మరణీయం

## మౌలానా అబ్దుల్ కలాం పేరుతో ఒంగోలులో మైనార్టీ స్టడీ సర్కిల్ ఏర్పాటు చేయాలి -జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు షేక్ సైదా






**బ్యూరో పెన్ పవర్, ప్రకాశం నవంబర్ 11**

భారతరత్న, ప్రముఖ స్వాతంత్ర సమరయోధులు భారతదేశ మొట్టమొదటి విద్యాశాఖ మంత్రి, ఏఐసీసీ మాజీ అధ్యక్షులు, బహుముఖ ప్రజ్ఞాశాలి అబుల్ కలాం ఆజాద్ సేవలు చిరస్మరణీయం మని ప్రకాశం జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు షేక్ సైదా పేర్కొన్నారు. సోమవారం ఒంగోలు జిల్లా పార్టీ కార్యాలలో జరిగిన మౌలానా అబుల్ కలాం ఆజాద్ 136 వ జయంతి వేడుకల్లో పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అబుల్ కలాం ఆజాద్ స్వతంత్ర సంగ్రామంలో పాల్గొని 10 సంవత్సరాల పాటు జైలు జీవితం గడిపిన గొప్ప దేశ భక్తుడని, మొట్టమొదటి విద్యాశాఖ మంత్రిగా విద్యావ్యవస్థలో సమూలమైన మార్పులు తెచ్చిన మహా మేధావి, జర్నలిస్టుగా, సాహితీవేత్తగా, మానవత్వం మూర్తిభవించిన మహనీయునిగా చరిత్ర కు ఎక్కారని సైదా కొనియాడారు. ప్రకాశం జిల్లాలో మౌలానా అబుల్ కలాం ఆజాద్ పేరుతో స్టడీ సర్కిల్ ఏర్పాటు చేయాలని తద్వారా మైనార్టీ విద్యార్థులు యువకులు, నిరుద్యోగులు గ్రూప్స్ మరియు కాంపిటేటివ్ ఎగ్జామ్స్ కి ప్రిపేర్ అయ్యేందుకు అవకాశం ఉంటుందని ప్రభుత్వం ఈ విషయమై స్పందించాలని సైదా కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఏఐయుడబ్ల్యుసి చైర్మన్, దర్శి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త కైపు వెంకటకృష్ణారెడ్డి, రాష్ట్ర ఎస్సీ డిపార్ట్మెంట్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఉదండి మల్లికార్జున రావు, జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షులు, కనిగిరి నియోజకవర్గ పార్టీ సమన్వయకర్త దేవరపల్లి సుబ్బారెడ్డి, జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు షేక్ రసూల్, పార్టీ సీనియర్ నాయకులు గోరంట్ల కోటేశ్వరరావు, జిల్లా కాంగ్రెస్ పార్టీ మాజీ అధికార ప్రతినిధి బొడ్డు సతీష్ , జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు పైనం మధు, మైనార్టీ నాయకులు షేక్ గౌస్ మొహిద్దిన్, షేక్ వలి, ప్రసాద్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ విగ్రహం దగ్గర ఫ్లెక్సీ బోర్డు తొలగించాలి

### ఏపిడి మాజీ ఉపాధ్యక్షుడు పాలేటి కోటేశ్వరరావు






**కందుకూరు పెన్ పవర్, నవంబర్ 11**

పట్టణంలోని డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహము దగ్గర,విగ్రహ దిమ్మె వద్ద విగ్రహముకు ఆనించి అనేకమంది ఫ్లెక్సి బోర్డులు, అడ్వర్టయిజింగ్ ఫ్లెక్సిలు కట్టి విగ్రహ ప్రాంగణంలో పవిత్రతను పాడు చేస్తున్నారు అని ఏపిడి మాజీ ఉపాధ్యక్షుడు పాలేటి కోటేశ్వరరావు అన్నారు..ఈ విషయాన్ని సోమవారం కందుకూరు మున్సిపల్ కమిషనర్ అనూష దృష్టికి తీసుకువెళ్ళడం జరిగిందని ఏ ఏ డి మాజీ ఉపాధ్యక్షులు పాలేటి కోటేశ్వరరావు తెలియజేశారు.కమిషనర్ స్పందించి ఆ ప్రాంతంలో ఎలాంటి ఫ్లెక్సిలు కట్టగుండా శాశ్వతంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు అని తెలియజేసారు.

## మొక్కలు నాటుదాం పర్యావరణాన్ని పరిరక్షిద్దాం



**కందుకూరు పెన్ పవర్, నవంబర్ 11**

మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షిద్దామని పూర్వ విద్యార్థులు పూర్వ ఉపాధ్యాయులు పిలుపునిచ్చారు. పట్టణంలోని జిల్లాపరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో సోమవారం ఉదయం కార్తీక వన మహోత్సవం సందర్భంగా సుమారు 30 మొక్కలను, ఆ పాఠశాల పూర్వ విద్యార్థులు పూర్వ ఉపాధ్యాయులు 10 వేల రూపాయలు ఖర్చు చేసి నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాము చదువుకొన్న పనిచేసిన పాఠశాలలో మొక్కలు నాటడం ఎంతో ఆనందంగా ఉన్నదని ఈ అవకాశం తమకు కల్పించిన పాఠశాల ప్రధానోపాధ్యాయులకు పూర్వ ఉపాధ్యాయులు ధన్యవాదములు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో ముప్పాళ అంజయ్య, గుల్లా వెంకటకృష్ణారావు, రావులకొల్లు వెంకటేశ్వర్లు, సీ హెచ్ వి సుబ్బారావు,గుళ్ళా నరసింహం ఇంచార్జ్ ప్రధాపాధ్యాయులు విప్రనారాయణ,పాటిబండ్ల శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## ఈనెల 15న శ్రీ అంకమ్మతల్లి దేవస్థానములో కార్తీక దీపోత్సవ ఆహ్వానము



**కందుకూరు పెన్ పవర్, నవంబర్ 11**

ఈనెల 15 శుక్రవారం కార్తీక పౌర్ణమి సందర్భముగా శ్రీ అంకమ్మతల్లి దేవస్థానము నందు ఉదయం 11 గంటలకు మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం జరుగును అని ఆలయ కార్య నిర్వహణ అధికారి తెలియజేశారు. సాయంత్రం 7 గంటలకు దీపోత్సవము, పల్లకి సేవ జరుగును అని తెలిపారు. కావున భక్తులు అందరు పాల్గొని అమ్మవారి దేవస్థానము నందు దీపాలు వెలిగించి, తీర్ధ ప్రసాదాలు స్వీకరించి

## 18న ఇళ్ల స్థలాల పై జరిగే ధర్నాన్ని జయప్రదం చేయండి

**కందుకూరు పెన్ పవర్,నవంబర్ 11:**

పేదలకు గ్రామాలలో మూడు సెంట్లు పట్టణాలలో రెండు సెంట్లు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని ఇంటి నిర్మాణం కోసం ఐదు లక్షల చొప్పున మంజూరు చేయాలని కోరుతూ ఈనెల 18వ తేదీన సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద జరిగే ధర్నా కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి బి సురేష్ బాబు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వం హయాంలో పేదలకు గ్రామాలలో ఒకటిన్నర సెంట్లు, పట్టణాల్లో ఒక సెంటు ఇవ్వటం జరిగింది. ఆయా ఇళ్ల స్థలాలు పట్టణాలకు సుదూరంగా నివాసయోగ్యం కానీ ప్రాంతాలలో కేటాయించడం జరిగింది. అందులో చాలా మంది పేదలకు ఇప్పటివరకు ఇళ్ల స్థలాలు చూపలేదు. ప్రభుత్వం ఇచ్చే ఒక సెంటు స్థలం పేదల నివాసానికి ఏ మాత్రం సరిపోదని భారత కమ్యూనిస్టు పార్టీ( సిపిఐ), ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ఆనాడే వైసిపి ప్రభుత్వాన్నికి చెప్పినప్పటికీ ఖతార్ చేయకుండా నాటి ప్రభుత్వం మొండిగా ముందుకెళ్ళింది. కాకి లెక్కలతో 32 లక్షల మందికి ఇళ్లపట్టాలు ఇచ్చినప్పటికీ పేదల ఆ స్థలాలు పట్ల సుముకత చూపలేదు. పైగా ఇంటి నిర్మాణానికి ఇచ్చే ఆర్థిక సహాయం కూడా కేవలం 1.80.000 మాత్రమే ప్రకటించారు. ఆ ఆర్థిక సహాయంతో పునాదులు కూడా పూర్తి చేయలేమని పేదలవ్వరు కూడా ఇంటి నిర్మాణం చేపట్టలేదు వైసీపీ ప్రభుత్వం పేదలకు ఇచ్చిన ఇళ్ల స్థలాలు పట్టాలు నిరుపయోగంగా మారాయి. ప్రస్తుత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఎన్నికలకు ముందు పేదలకు గ్రామాల్లో మూడు సెంట్లు, పట్టణాల్లో రెండు సెంట్లు చొప్పున ఇళ్ల స్థలాలు ఇస్తామని హామీ ఇచ్చారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా ముఖ్యమంత్రి అదే విధంగా హామీ ఇస్తూ, ప్రతి ఇంటి నిర్మాణానికి నాలుగు లక్షల చొప్పున ఇస్తామని చెప్పడం జరిగింది. ఇంటి స్థలాల కేటాయింపులు పట్ల చంద్రబాబు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం సానుకూలమే. సిమెంట్, ఇటుక, ఇనుము, కంకర, సామాగ్రి ధరలు పెరిగిన రీత్యా 5 లక్షలకు పెంచి గృహ నిర్మాణం మంజూరు చేయాలి.



పేదలిల్లు నిర్మాణానికి సిమెంటు, ఇసుక, ఇనుము, ఇటుక, కంకర ప్రభుత్వం ఉచితంగా సప్లై చేయాలి. ఇళ్ల స్థలాల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం పట్టణాల్లో, గ్రామాల్లో నివాసయోగ్యంగా గృహ నిర్మాణానికి అనువైన ప్రాంతాలను గుర్తించి గత వైసిపి ప్రభుత్వం హయాంలో ఏర్పాటు చేసిన లేఔట్లను మార్పు చేసి పేదలకు గ్రామాల్లో మూడు సెంట్లు, పట్టణాల్లో రెండు సెంట్లు చొప్పున ఇళ్ల స్థలాల కేటాయించాలి. రోడ్లు, విద్యుత్తు, త్రాగునీరు, డ్రైనేజీ పారుదల వంటి మౌలిక సౌకర్యాలు కల్పించాలి ఆయన అన్నారు. సిపిఐ సహాయక కార్యదర్శి పి బాల కోటయ్య మాట్లాడుతూ పేదల ఇళ్ల స్థలాల నిర్మాణం కోసం అర్థ కమ్యూనిస్టు పార్టీ సిపిఐ ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో నవంబర్ 18వ తేదీన సోమవారం రాష్ట్ర వ్యాప్తంగా పేదలతో వ్యక్తిగత అర్జీలు అందించే ఆందోళన కార్యక్రమం చేపట్టింది. ఇప్పటికే పట్టణాల్లో ఒక సెంటు పట్టా ఉన్నవారు రెండు సెంట్ల కొరకు, గ్రామాలలో ఒకటిన్నర సెంట్లు పట్టా ఉన్నవారు మూడు సెంట్ల కొరకు దరఖాస్తు చేయాలని ఇళ్ల స్థలాలు లేని వారు కొత్తగా తమ వ్యక్తిగతర్జీలతో ఈ ఆందోళన కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయాలని ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వై ఆనందమోహన్, ఏఐవైఎఫ్ నియోజకవర్గ అధ్యక్షులు సిహెచ్ దుర్గాప్రసాద్, ఏఐవైఎఫ్ నాయకులు హరిబాబు పాల్గొన్నారు.

## విజయవంతంగా ముగిసిన జిల్లాస్థాయి తైక్వాండో సబ్ జూనియర్ బాలబాలికల ఎంపిక పోటీలు





**కందుకూరు పెన్ పవర్, నవంబర్ 11**

స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత బాలికల పాఠశాల ఆవరణమందు 10తేదీ ఆదివారం నిర్వహించినటువంటి జిల్లా స్థాయి తైక్వాండ పోటీలు విజయవంతంగా ముగిసాయని జిల్లా కార్యదర్శి ఎస్కె అబ్దుల్ సలాం తెలియజేశారు. సుమారుగా 170 మంది క్రీడాకారులు ఈ పోటీలలో పాల్గొన్నరని అన్నారు. జిల్లాలోని పలు ప్రాంతాల నుండి చీరాల చిన్నగంజం ఒంగోలు సింగరాయకొండ మొదలగు ప్రాంతాల నుండి క్రీడాకారులు పాల్గొనడం జరిగిందన్నారు. ఈ పోటీలను జిల్లా అధ్యక్షులు ఉన్నం వీరాస్వామి, ప్రముఖ వ్యాపారవేత్త గోనుగుంట వెంకటేశ్వర్లు, స్థానిక ఆక్స్ఫర్డ్ పాఠశాల డైరెక్టర్ బాల భాస్కర్ ప్రారంభించారు .వీరు పథకాలు సాధించిన క్రీడాకారులను అభినందించారు క్రీడాకారులను ఉద్దేశించి మాట్లాడుతూ విద్యతోపాటు క్రీడలలో కూడా రాణించాలని క్రీడాకారులను తెలియజేశారు. పోటీలలో పథకాలు సాధించిన క్రీడాకారులు ఈనెల 15, 16, 17 తేదీలలో కందుకూరు లోని ప్రకాశం ఇంజనీరింగ్ కాలేజీ ఆడిటోరియం నందు జరగబోవు రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొనడం జరుగుతుందన్నారు. ఈ పోటీలలో భాగంగా 14 మంది బాలికలు 14 మంది బాలురు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక అవడం జరిగింది..కార్యక్రమంలో జిల్లా ట్రెజరర్ వాజిద్ అలీ వైస్ ప్రెసిడెంట్ సలావుద్దీన్ , జమీలుద్దీన్ కోచ్ జే ముఖేష్ కుమార్, పి అఖిల్, పి ప్రశాంత్ బాబు ,సిహెచ్ వెంకటప్రసాద్ ,పి సుబ్రహ్మణ్యం ,ఎస్కే సుల్తాన్ పాల్గొన్నారు. ఈ పోటీలకు రెఫరీలుగా షేక్ మసూద్ ,షేక్ షాహిద్ ,పీ స్టీఫెన్ జాన్ పాల్ ,పి మెరిస్టెల్లా రఫ్రీలుగా వ్యవహరించారు.

## వైసిపి కార్యాలయంలో అబుల్ కలాం ఆజాద్ జయంతి వేడుకలు

**కందుకూరు పెన్ పవర్, నవంబర్ 11**

మాజీ ఎమ్మెల్యే, వైకాపా ఇన్చార్జి బుర్రా మధుసూదన్ యాదవ్ ఆదేశాల మేరకు భారతరత్న, స్వాతంత్ర సమరయోధులు,భారత ప్రభుత్వ మొట్ట మొదటి విద్యా శాఖ మంత్రి మౌలాన అబుల్ కలాం ఆజాద్ జయంతి సందర్భంగా కందుకూరు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఘనంగా నివాళులు అర్పించారు.ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి వైఎస్ఆర్సిపి నేతలు మాట్లాడుతూ మౌలాన అబుల్ కలాం ఆజాద్ భారత దేశ స్వాతంత్రం కోసం అనేక ఉద్యమాలు పోరాటాలు చేసారని, స్వాతంత్ర్యానంతరం భారతదేశ మొట్ట మొదటి విద్యా శాఖ మంత్రిగా భారతదేశ విద్యారంగంలో నూతన మార్పులు సృష్టించి దేశానికి విజ్ఞానదారులు వేసిన మహానుభావుడు అని శ్లాఘించారు. మౌలానా అబుల్ కలాం ఆజాద్ స్ఫూర్తితో మాజీ ముఖ్యమంత్రివర్యులు జగన్మోహన్ రెడ్డి విద్యారంగంలో విప్లవాత్మమైన మార్పులు తీసుకువచ్చి ప్రభుత్వ విద్యారంగాన్ని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లారు. ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ పేద ప్రజలు అందరూ చదువుకోవాలని అనేక సంస్కరణలు తీసుకువచ్చారు. దాని ఫలితంగానే ఈరోజు ప్రభుత్వ పాఠశాలలను సందర్శించిన రాష్ట్ర ఉపముఖ్యమంత్రి ప్రభుత్వ పాఠశాలల లేక కార్పొరేట్ విద్యాశాలలా అని ఆశ్చర్యానికి గురైన సంగతి విద్యావ్యవస్థలో జగన్మోహన్ రెడ్డి తీసుకు వచ్చిన సంస్కరణ ఫలితమే అని అన్నారు. కూటమి ప్రభుత్వం విద్యారంగానికి అధికంగా బడ్జెట్లో నిధులు




కేటాయించాలని, బకాయిలు ఉన్న ఫీజు రీయింబర్స్మెంట్, విద్యా దీవెన,వసతి దీవెన, అమ్మ ఒడిలాంటి పథకాల బకాయిలను చెల్లించాలని అభిప్రాయపడ్డారు. ముందుగా మౌలానా అబుల్ కలాం ఆజాదు చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి పట్టణ అధ్యక్షులు షేక్ రఫీ, న్యాయవాది, జెసిఎస్ కో ఆర్డినేటర్ ముప్పవరపు కిషోర్, రాష్ట్ర యువజన కార్యదర్శి గణేశం గంగిరెడ్డి, ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షులు రేణమాల అయ్యన్న, సచివాలయం కన్వీనర్లు తలపనేని గోపి , వెంకట్రామిరెడ్డి , జిల్లెలమూడి కోటేశ్వరరావు, షేక్ రహీం, జి. రామాంజనేయులు, షేక్ అబ్దుల్ కలాం, షేక్ బాషా తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా అబుల్ కలాం జయంతి వేడుకలు



**కందుకూరు పెన్ పవర్, నవంబర్ 11**

భారతరత్న భారత ప్రభుత్వ మొదటి విద్యా శాఖ మంత్రి అబుల్ కలాం జయంతి కార్యక్రమం కందుకూరు పట్టణ ముస్లిం సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఎండిఓ బాధ్యులు రఫీ ఉద్దీన్ మాట్లాడుతూ ఆనాడు అబుల్ కలాం భారత దేశ స్వాతంత్రం కోసం అనేక ఉద్యమాలు పోరాటాలు చేసి భారతదేశ మొదటి విద్యా శాఖ మంత్రిగా విద్యారంగంలో అనేక కొత్త మార్పులు సృష్టించి దేశానికి దారులు వేసిన మహానుభావుడు అని కొనియాడారు. ముస్లిం ఐక్యవేదిక సభ్యులు షేక్ మహబూబ్ బాషా, షైన్ ఫౌండేషన్ అధ్యక్షులు రహీం మాట్లాడుతూ ఈరోజు మనం ఇంత హాయిగా స్వచ్ఛ వాయువులను పిలుస్తున్నామంటే దీని వెనకాల అసంఖ్యాకమైన అలుపెరగని త్యాగాలు బలిదానాలు ఉన్నాయన్నారు, అనంతరం అందరూ అబుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా ఒక్ బోర్డ్ సభ్యులు సందాని భాష ,ముస్లిం ఐక్యవేదిక సభ్యులు మహబూబ్ బాషా, ఎండిఓ సభ్యులు మౌల్వి నసీర్, ముస్తఫా, నయీమ్ భాష, మునీర్ భాష ,ఆన్సర్, పాల్గొన్నారు.

## నేషనల్ బాస్కెట్ టీమ్‌కు ఆక్స్ ఫర్డ్ విద్యార్థి ఎంపిక




**కందుకూరు పెన్ పవర్, నవంబర్ 11**

నేషనల్ బాస్కెట్ బాల్ టీమ్ కు ఆంధ్ర ప్రదేశ్ తరపున కందుకూరు బి ఆర్ ఆక్స్ ఫర్డ్ విద్యార్థి షేక్ అష్రాఫ్ ఎంపిక అయినట్లు ఆక్స్ ఫర్డ్ విద్యాసంస్థల చైర్మన్ ఉన్నం భాస్కరరావు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా భాస్కరరావు మాట్లాడుతూ తమ విద్యాసంస్థలలో ప్రణాళిక బద్ధమైన చదువుతోపాటు క్రీడలకు అత్యంత ప్రాధాన్యతిస్తున్నట్లు తెలిపారు. ఓవైపు ఎన్ సి సి మరోవైపు తైక్వాండో తో పాటు అన్ని రకాల క్రీడలకు శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. తమ విద్యార్థులను అన్ని రంగాలలో నిష్ణాతులుగా తీర్చిదిద్దేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పించి అన్ని రంగాలలో అద్భుతమైన ఫలితాలు సాధించేదిశగా ప్రయత్నిస్తున్నామని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ తరపున నేషనల్ బాస్కెట్బాల్ టీమ్ కు ఎంపికైన అష్రాఫ్ కు కరస్పాండెంట్ బండి వెంకటేశ్వర్లు, డైరెక్టర్లు బాల భాస్కరరావు, బెజవాడ నరేంద్రబాబు, అధ్యాపకులు, తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

## అత్యంత భక్తి శ్రద్ధలతో దత్త క్షేత్రంలో రామస్థూప నిర్మాణానికి భూమి పూజ



**వేటపాలెం, నవంబర్ 11,పెన్ పవర్**

వేటపాలెం దత్తక్షేత్రం నందు, కార్తీక మాసం దశమి సందర్భంగా, రామ స్తూప నిర్మాణం నిమిత్తం, ఆదిలక్ష్మి చేతుల మీదగా భూమి పూజ కార్యక్రమాన్ని, అత్యంత భక్తి శ్రద్దలతో నిర్వహించారు.ఈ రామ స్థూపం నందు, భక్తులు రాసిన రామ కోటి పుస్తకాలను నిక్షిప్తం చేసి, స్థూపం ఏర్పాటు చేస్తారని తెలియజేసారు.భక్తు లు రామకోటి రాసి, ఈ మహ త్తరకార్యక్రమంలో పాలుపంచు కోవాలని, దత్త క్షేత్ర కన్వీనర్ ప్రమీలా దేవి, పరిసర ప్రాంత ప్రజలను కోరారు. రామకోటి వ్రాత పుస్తకాలను, దత్తక్షేత్రం నందు వచ్చి తీసుకుని వెళ్లి, అతి త్వరగా రాసివ్వాలని కోరారు.. దత్త క్షేత్రం అధ్యక్షులు ప్రత్తి వెంకట సుబ్బారావు మా ట్లాడుతూ, దత్తక్షేత్ర అభివృద్ధి కి, అందరూ కూడా సహాయ సహకారాలు, అందించాలని కోరుతూ, డిసెంబర్లో జర గబో వు దత్త జయంతి ఉత్సవాల లో, ప్రతి ఒక్కరూ దత్త క్షేత్రాన్ని దర్శించి, క్షేత్రంలో జరుగుతున్న అభివృద్ధికి, సహాయ సహకా రాలను అందించాలని కోరుతు న్నామన్నారు. కార్యక్రమంలో దత్తక్షేత్రం కన్వీనర్ కె. ప్రమీలా దేవి, అధ్యక్షులు ప్రత్తి వెంకట సుబ్బారావు, ప్రధాన కార్యదర్శి నున్నా శివప్రసాదరావు, సహా య కార్యదర్శి కరణం మురళీ కృష్ణ, వెంకటప్పయ్య, దోగుప ర్తి రాం బాబు, చోడెం శ్రీనివాస రావు, పెనుగొండ రాజేశ్వరి, బండ్ల చంద్ర, శిఖాకొల్లి చంద్ర కళ, బి.వెంకట్రావు, పురోహి తులు మృత్యుంజ యుడు తదితరులు, రామనామ సంకీర్తన చేస్తూ పాల్గొన్నారు.

## మహిళ ప్రాంగణ భవన నిర్మాణ పనులు చేపట్టండి బొజ్జల బృందమ్మ..

శ్రీ కాళహస్తి - పెన్ పవర్,నవంబర్ 11



పట్టణంలోని బత్తయ్య నాయుడు హాస్పిటల్ ఎదురుగా ఉన్న ప్రభుత్వస్థలం గత టిడిపి ప్రభుత్వ హాయంలో 1.90 ఎకరాల స్థలంలో మహిళా ప్రాంగణము నిర్మించాలని మాజీ మంత్రివర్యులు కీర్తిశేషులు బొజ్జల గోపాల కృష్ణారెడ్డి ప్రతిపాదనలు చేసి పంపారని వైసీపీ ప్రభుత్వంలో ఆ స్థలం అంతా కబ్జాలకు గురి అయిందని రెవెన్యూ అధికారులు ఆ స్థలాన్ని స్వాధీనం చేసుకొని తక్షణమే మహిళా ప్రాంగణ భవనాన్ని నిర్మించేందుకు చర్యలు చేపట్టాలని బొజ్జల బృందమ్మ అధికారులకు సూచించారు. సోమవారం బొజ్జల బృందమ్మ టిడిపి నాయకులతో కలిసి ఆ స్థలాన్ని పరిశీలించారు.

## కొండచిలువ కలకలం



గిద్దలూరు పెన్ పవర్ నవంబర్ 11

రాచర్ల మండలం రాచర్ల సెక్షన్, అంబవరం బీట్ పరిధిలోని వెల్లుపల్లి గ్రామ సచివాలయం వద్ద కొండచిలువ ఉన్నదని సమాచారం సిబ్బంది అటవీశాఖ అధికారులు ఇవ్వగా గిద్దలూరు డిడిపిటి వైల్డ్ లైఫ్ రెస్క్యూ టీం ప్రసాద్, శివ, అశోక్, కృష్ణ , అంబవరం బీట్ అధికారి నారు నాగ శేఖర్ రెడ్డి వెల్లుపల్లి గ్రామానికి చేరుకొని చాకచక్యంగా కొండచిలువను పట్టు కొని అంబవరం బీటు పరిధిలోని రిజర్వు ఫారెస్ట్ లో వదిలిపెట్టారు.

## జాతీయ కరాటే చాంపియన్ షిప్లో పాల్గొన్న పామూరు విద్యార్థులు





పెన్ పవర్ పామూరు నవంబరు 11

జాతీయ కరాటే చాంపియన్ షిప్ లో పామూరు కరాటే డో స్పోర్ట్స్ అకాడమికి చెందిన విద్యార్థులు సత్తా చాటి పతకాలు సాధించినట్లు మాస్టర్లు షేక్ అబ్దుల్, మహీద్, అర్షద్బాషా తెలిపారు. మంగళగిరిలోని ఆద్దా మజీద్ షాదిఖానాలో ఆదివారం నిర్వహిం చిన జపాన్ షిటోరియో కరాటే డు స్కూల్ షికోకాయ్ ఇజూషి ఇండియా నిర్వహించిన 9వ నేషనల్ ఇన్విటేషన్ కరాటే చాంపియన్ షిప్ పోటీల్లో పామూరు విద్యార్థులు పాల్గొన్నారు. వివిధ కేటగిరిల్లో ఎన్డీ దోహా, కె.యాశ్విని, కె.లాస్య, టి.ప్రదీప్, కె.అభిజ్ఞ, జె.రామ్, ఎన్రోషిత్, ఎ.శ్రీహరి, రిషిక, స్నేహిత, వై.నిహిత, కె.కార్తీక, జి. మనోహార్ పతకాలు సాదించినట్లు కరాటే మాస్టర్లు తెలిపారు.

## ఈ నెల 18న పేదల ఇళ్ల స్థలాల కోసం అర్జీలు

### సీపీఐ రాష్ట్ర కార్యదర్శి మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్




పెన్ పవర స్టాఫ్ రిపోర్టర్ బాపట్ల నవంబర్ 11

రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ఎన్నికల అనంతరం ప్రకటించిన విధంగా పేదలకు గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు, పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్లు చొప్పున నివేశన స్థలాలు కేటాయించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్ కోరారు. సీపీఐ జిల్లా కార్యాలయంలో సోమవారం సాయంత్రం జిల్లా కౌన్సిల్ సమావేశం జిల్లా కౌన్సిల్ మెంబర్ దొంతిబోయిన వెంకటేశ్వరరెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా జల్లి విల్సన్ మాట్లాడుతూ జిల్లాలో ఇళ్ల స్థలాలు కేటాయించటానికి అనువైన ప్రాంతాలను గుర్తించి లే-అవుట్లు వేయాలన్నారు. రోడ్లు, విద్యుత్, తాగునీరు, డ్రైనేజీవంటి మౌలిక సౌకర్యాలు కల్పించాలన్నారు. పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించటంతో పాటు సిమెంటు, ఇసుక, ఇటుక, కంకర తదితర సామగ్రి ధరలు పెరిగిన రీత్యా ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సీపీఐ, వ్యవసాయ కార్మిక సంఘం సంయుక్తంగా పేదల ఇళ్ల స్థలాల సాధన కోసం కార్యరూపం చేపట్టిందన్నారు. సీపీఐ వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు, కార్యకర్తలు ఇంటింటి సర్వే చేసి లబ్ధిదారుల జాబితా తయారు చేయాలన్నారు. నివేశన స్థలాల సాధన కోసం ఈ నెల 18న సచివాలయాల వద్దకు లబ్ధిదారులను తీసుకువెళ్లి అర్జీలు అందించాలని చెప్పారు.అనంతరం 13 మందితో సీపీఐ జిల్లా కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి తన్నీరు సింగరకొండ, నాయకులు జేబీ శ్రీధర్, బత్తుల శామ్యూల్, తుమ్మల పూర్ణచంద్రశేఖర్, సైకం రాజశేఖర్, జె.రత్నకుమారి, నంబూరి సత్యం, బావిరెడ్డి ప్రభాకర్, బక్కా వెంకటరామకృష్ణారెడ్డి, కేఎల్‌డి ప్రసాద్, మేకల వెంకాయమ్మ, ఏటగిరి శ్రీనివాసులు, మేకల బిజిలిబాబు, మామిడిబత్తుల అశోక్, మేకల రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

# మధుసూదన రెడ్డి ఎమ్మెల్యే పై అసత్య ప్రచారాలొద్దు

**లబ్ధికోసం దిగజారుడు రాజకీయాలు చేయొద్దు.**

**నీ అక్రమాలు ప్రజలు మరచిపోలేదు.**

**నీవు చేసిన తప్పులను ఇప్పుడు ఇంకొకరిపై మోపడం సరికాదు.**

**అవినీతి, అక్రమాలకు బొజ్జల కుటుంబం దూరం**

**అందుకే నిజాయితీకి ప్రజలు పట్టం కట్టారు.జ**

**జీర్ణించుకోలేక విద్వేషాలతో రెచ్చగొట్టే కార్యక్రమాలు.**

**ప్రశాంత వాతావరణంలో వైభవంగా గంగ జాతర.**

**మీడియా సమావేశంలో టీడీపీ నేతలు.**




శ్రీ కాళహస్తి - పెన్ పవర్,నవంబర్ 11

రాజకీయ లబ్ధికోసం దిగజారుడు తనంతో వ్యవహరించవద్దు. హుందాతనంతో రాజకీయాలు చేయి. నీవు చేసిన తప్పులు ఇంకొకరు కూడా చేస్తారని అనుకుంటున్నావు. అవినీతి, అక్రమాలకు బొజ్జల కుటుంబం ఎప్పుడూ దూరం. అందుకే ప్రజలు రికార్డు స్థాయి మెజారిటీతో పట్టం కట్టారు. ఇది జీర్ణించుకోలేక విద్వేషాలు రెచ్చగొట్టేలా మాట్లాడుతున్నావు అంటూ మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి చేసిన సత్యపు ప్రచారాలపై తెలుగుదేశం పార్టీ నాయకులు మీడియా సమావేశంలో వ్యాఖ్యానించారు. శ్రీకాళహస్తి ప్రెస్ క్లబ్ లో సోమవారం తెలుగుదేశం పార్టీ పట్టణాధ్యక్షులు విజయ్ కుమార్ నాయుడు నేతృత్వంలో ఆ పార్టీ నాయకులు మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి వ్యాఖ్యలపై మండిపడ్డారు. గత ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వ పాలనలో శ్రీకాళహస్తిలో ఎప్పుడూ లేని అవినీతి, అక్రమాలు జరిగాయనే విషయం ప్రజలకే తెలుసునన్నారు. గుడి నుంచి బడి దాకా దోచుకున్న సంస్కృతి వైసీపీది అని ఆరోపించారు. ఏడు గంగమ్మల ఆలయాన్ని త్వరితగతిన పునర్నిర్మాణ పనులు పూర్తిచేసి కుంభాభిషేకం నిర్వహించిన ఘనత తెలుగుదేశం పార్టీకి దక్కుతుందన్నారు. వైసీపీ హయాంలో ఏ రోజు కూడా ప్రతిపక్ష పార్టీలకు ఆలయ కార్యక్రమాల్లో స్థానం కల్పించ లేదన్నారు. అటువంటి తమ ప్రభుత్వ హయాంలో ఏడు గంగమ్మల ఆలయంలో జరిగిన కుంభాభిషేక వేడుకల్లో వైసీపీకి చెందిన ట్రస్టుబోర్డు మాజీ చైర్మన్ అంజూరు శ్రీనివాసులకు అనుమతి కల్పించి గౌరవం అందించిన విషయం రెండు రోజులకే మరిచిపోయి మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. ఏడుగంగమ్మల ఆలయంలో పండితుల సూచనలు, సలహాలతో పూజాది కార్యక్రమాలు సమయం ప్రకారం జరుగుతున్నాయని తెలిపారు. అయితే ఏదో ఒక సమయంలో మాజీ ట్రస్టుబోర్డు చైర్మన్ వచ్చారంట.. అప్పుడు పూజలు చేయలేదంట అంటూ కట్టుకథలతో అసత్య ప్రచారాలు చేశారని చెప్పారు. ఇప్పుడేమో ఏకంగా ఏడుగంగమ్మల జాతర ఉత్సవ నిర్వహణపైనే ఆ ట్రస్టుబోర్డు మాజీ చైర్మన్ తో కలిసి మాజీ ఎమ్మెల్యే నిజనిజాలు తెలుసుకోకుండా గతంలో వారు చేసిన తప్పులను అందరూ చేస్తారనుకుని ఆ నిందలను ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డికి అపాదించడం సరికాదన్నారు. బొజ్జల కుటుంబం ఎప్పుడూ అవినీతి, అక్రమాలకు దూరమని స్పష్టం చేశారు. నాడు రౌడీయిజాన్ని, గంజాయిని ప్రోత్సహించింది ఎవరని నిలదీశారు. రౌడీలను పక్కన పెట్టుకుని న్యాయం కోసం ప్రజాస్వామ్య బద్ధంగా ఆందోళనలు చేసే ప్రతిపక్ష పార్టీ నాయకులపై దాడులు చేసిన సంస్కృతి బియ్యపు మధుకే దక్కుతుందన్నారు. ఇలా ఎంతమందిపై మధు దండుపాళెం బ్యాచ్ దాడులు చేసిందో ప్రతి ఒక్కరికి తెలుసునని చెప్పారు. ఈ రోజు మదుసూదన్ రెడ్డి మాట్లాడుతుంటే దెయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందన్నారు. గంగమ్మ కమిటీలలో మెజారిటీ వర్గం వైసీపీకి చెందిన వారే ఉంటే ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి పేరు చెప్పి బలవంతపు వసూళ్లకు ఎవరు పాల్పడ్డారని ప్రశ్నించారు. ఇప్పటి వరకు అటువంటి కార్యక్రమాలను బొజ్జల కుటుంబం ప్రోత్సహించ లేదని స్పష్టం చేశారు. ఇకపై కూడా అటువంటి పరిస్థితి ఉండదని తేల్చి చెప్పారు. ఇంకా చెప్పాలంటే.. ఈ సారి నుంచి ఏడుగంగమ్మల జాతర నిర్వహణ మొత్తం శ్రీకాళహస్తీశ్వర స్వామివారి దేవస్థానం ఆధ్వర్యంలోనే జరిగేలా పరిశీలన జరుగుతోందన్నారు. తద్వారా ఎటువంటి చందాలు వసూళ్లు ఉండవన్నారు. ఈ విషయం తెలుసుకుని ఎక్కడ తమవారికి చందాల రూపంలో వచ్చే ఆదాయం పోతోందనే ఆందోళనలో మధుసూదన్ రెడ్డి అసత్యపు ఆరోపణలకు దిగారని దుయ్యబట్టారు. ప్రజలు, భక్తుల విశ్వాసాలకు సంబంధించి గంగమ్మ జాతర ఉత్సవంపై విషపు ప్రచారాలతో విద్వేషాలు రెచ్చగొట్టే కార్యక్రమాలు మానుకోవాలని హితవులు పలికారు. మీరు చేసిన తప్పులు, అవినీతి, అక్రమాలపై చట్టపరమైన చర్యలు తప్పవచని హెచ్చరించారు. ఇప్పటికైనా హుందాతనంలో రాజకీయాలు చేయడం నేర్చుకోవాలని సూచించారు. రాష్ట్రంలో జగన్ శవ రాజకీయాలు చేస్తుంటే ఇక్కడ దేవుడి ఉత్సవాలపై అబద్ధపు ప్రచారాలతో విద్వేషాలు రెచ్చగొట్టే కార్యక్రమాలు చేయడం వైసీపీకి అలవాటుగా మారిపోయిందని వ్యాఖ్యానించారు. ప్రజలంతా చూస్తున్నారని త్వరలోనే మరింత గట్టిగా వైసీపీకి తిరగబడి బుద్ధిచెప్పే రోజులు కూడా మరింత దగ్గరలో ఉన్నాయనే విషయాన్ని మధుసూన్ రెడ్డి, ఆయన అనుచరగణం గుర్తించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు షాకిర్ అలీ మినరల్ రవి లక్కమనేని మధుబాబు నాగమల్లి దుర్గాప్రసాద్ సుప్రజ గోపీనాథ్ కాసారం రమేష్ వజ్రం కిషోర్ గుర్రప్ప శెట్టి ఉమేష్ నెమల్లూరు బుజ్జి సుబ్బయ్య కిట్టు ఢిల్లీ బాబు వినయ్ హేమంత్ రాయల్ తదితరులు పాల్గొన్నారు.

# కావలి పట్టణంలో ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కాలేజీలను ఏర్పాటు చేయాలి

### బీసీ ఐక్యత భవన్ ఆధ్వర్యంలో ఆర్డీవోకు వినతి




కావలి, పెన్ పవర్ నవంబర్ 11

కావలి పట్టణంలో ప్రభుత్వ జూనియర్ మరియు డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేయాలని బీసీ ఐక్యత భవన్ రాష్ట్ర అధ్యక్షులు అద్దంకి ప్రభాకర్, రాష్ట్ర గౌరవాధ్యక్షులు ఉరిటి గోవిందు,ప్రధాన కార్యదర్శి చిన్ని వరప్ర సాదరావు, కార్యవర్గ సభ్యులు కలసి గ్రీవెన్స్ డే సందర్భంగా సోమవారం కావలి పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయంలో ఆర్డీఓ వంశీకృష్ణకు వినతి పత్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగా బీసీ ఐక్యత భవన్ రాష్ట్ర అధ్యక్షుడు అద్దంకి ప్రభాకర్( శివ) మాట్లాడుతూ కావలి పట్టణంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఏర్పాటు చేయాలని పేద విద్యార్థిని విద్యార్థులు ప్రైవేట్ కళాశాలలకు ఫీజులు కట్టలేక చాలా ఇబ్బందులు పడుతున్నారని ఫీజులు కట్టలేక విద్యార్థిని విద్యార్థులు చదువుకు దూరం అవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉరిటి గోవిందు మాట్లాడుతూ స్వాతంత్రం వచ్చి 77 సంవత్సరాలు అవుతున్నా నెల్లూరు తర్వాత అతిపెద్ద పట్టణమైన కావలి పట్టణంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల మరియు డిగ్రీ కళాశాలలు లేకపోవడం చాలా బాధాకరమని తెలిపారు. పేద మధ్య తరగతి ప్రజలు పై చదువులు చదువుకోవాలంటే ప్రభుత్వ కళాశాలలు లేకపోవడంతో ప్రైవేట్ కళాశాలలకు అధిక ఫీజులు కట్టలేక మధ్యలోనే చదువుకు స్వస్తి చెబుతున్నారని కూలి పనులు చేసుకుని జీవిస్తున్నారని తెలిపారు. కావలి డివిజన్ పరిధిలోని 10 మండలాలలో ఆరు లక్షల మంది ప్రజలు కలిగి ఉన్నప్పటికీ ప్రభుత్వ డిగ్రీ కాలేజీలు లేకపోవడం దురదృష్టకరమని అన్నారు. పేద మధ్యతరగతి ప్రజలకు విద్యను దూరం చేయడం వలన పేద విద్యార్థులు విద్యకు దూరమవుతున్నారని ఇప్పటికైనా ప్రభుత్వ జూనియర్ డిగ్రీ కాలేజీలను ఏర్పాటు చేయాలని కోరారు. రాజకీయ నాయకులు ఇప్పటివరకు పేద మధ్యతరగతి ప్రజలకు ఉచితంగా విద్యను అందించాలనే ఉద్దేశం లేకుండా ఎవరి పబ్బం వారు గడుపుకుని పోయారని విద్యపై దృష్టి పెట్టకుండా కార్పొరేట్ విద్యను ప్రోత్సహించారని తెలిపారూ. ప్రైవేట్ కాలేజీలలో చేరిస్తే ఆర్థికంగా దెబ్బతిని ఉన్న ఆస్తి అమ్ముకొని చదువుకునే రోజులు వచ్చాయని ఇప్పటికైనా ప్రభుత్వం ఆలోచించి ప్రభుత్వ జూనియర్ కళాశాలలను ప్రతి మండలంలో ఒకటి ఏర్పాటు చేయాలని ప్రతి నియోజకవర్గంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేయాలని పేద మధ్య తరగతి ప్రజలకు ఉచితంగా విద్యను అందించాలని కోరారు.ఈ కార్యక్రమంలో బీసీ ఐక్యత భవన్ కార్యవర్గ సభ్యులు నారాయణ,మధు, రమేష్, రామయ్య, శ్రీనివాసులు, నాగేశ్వరావు, శివ కోటయ్య,రాజా,వేణు,రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

# మొగుళ్ళూరు ప్రజల దాహార్తిని తీర్చాలి

### మోటార్లను వెంటనే మరమ్మత్తు చేయించాలి -సీపీఎం ప్రజాపోరు డిమాండ్



గుడ్లూరు, పెన్ పవర్, నవంబర్ 11:

కేంద్ర ప్రభుత్వ విధానాల నిరసిస్తూ ప్రజా సమస్యలు పరిష్కారం చేయాలని సీపీఎం తలపెట్టిన ప్రజా పోరు గుడ్లూరు మండలంలో నాలుగవ రోజుకు చేరుకుంది. సోమవారం మొగుళ్లూరు గ్రామంలో, ఎస్సీ, ఎస్టీ కలనీలలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మోగుళ్లూరు గ్రామ ప్రజలు మాట్లాడుతూ మాకు గత నెల రోజుల నుండి



మంచినీటి మోటార్లు చెడిపోయిన కారణంగా, త్రాగడానికి గుక్కెడు నీళ్లు లేక ఇబ్బందులు పడుతున్నామని తమ ఆవేదన వ్యక్తం చేశారని, అలానే కరెంటు దీపాలు వెలగడం లేదని, సైడ్ కాలువలు లేని కారణంగా ఇండ్లలో మురుగునీరు చేరి దోమలు స్వైర విహారం చేస్తున్నాయని, కుటుంబాల మధ్య తగాదాలు కూడా వస్తున్నాయని వాళ్ళు ఆవేదనను సీపీఎం నాయకుల ముందు వ్యక్తం చేశారు. మానుగుంట ఆదినారాయణ రెడ్డి బస్టాండ్ సెంటర్లో కరెంట్ కోసం స్థంభం వేశారని అది ఇప్పుడు శిథిలమై ప్రజలపైన పడటానికి సిద్ధంగా ఉందని, దీని మీద అధికారులకు ఎన్నిసార్లు విన్నవించుకున్న పట్టించుకున్న పాపాన పోలేదని వాళ్లు సిపిఎం నాయకులకు తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు మాట్లాడుతూ, మోగుల్లూరు గ్రామానికి వెంటనే బోర్లు రిపేర్ చేసి మంచినీళ్లు ఇచ్చి ప్రజల దాహార్తి తీర్చాలని, కరెంట్ దీపాలు వెలిగించాలని, వెంటనే స్తంభం తీసేసి కొత్త స్తంభం వేయాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. లేకుంటే నవంబర్ 14వ తేదీన గుడ్లూరు మండల కార్యాలయం దగ్గర పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని ఇందులో ప్రజలంతా పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు దామా కృష్ణయ్య, పాలకుర్తి నాగేశ్వరరావు, కొప్పోలు నారాయణ, గ్రామస్తులు రేణుమాల వెంకటేశ్వర్లు, గౌడపేరు మహేశ్వరరావు, కొమరగిరి అంకయ్య, కొమరగిరి అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

## వైసీపీ నాయకుల శుభకార్యాల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ





పలమనేరు నవంబరు 11,(పెన్ పవర్):

పలమనేరు నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ సోమవారం మండల వైసీపీ నాయకులకు చెందిన పలు శుభకార్యాల్లో పాల్గొన్నారు. గంగవరం వైసీపీ నాయకుడు శ్రీనివాసులు సోదరుడి నూతన గృహప్రవేశ శుభకార్యక్రమంలో పాల్గొని శుభాకాంక్షలు తెలియజేసారు. అనంతరం మండలంలోని గండ్రాజుపల్లి పంచాయతీ ఉప సర్పంచ్ దాదుల్లా తనయుడికి నిఖా జరిగిన సందర్భంగా ఆయన స్వగృహానికి వెళ్లి నూతన వధూవరులకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు.ఇందులో నాయకులు ప్రహ్లాద, శ్రీరాములు రెడ్డి, గంగవరం ఉపసర్పంచ్ మంజునాథ్ రెడ్డి, గండ్రాజుపల్లె ఎంపీటీసీ పి.వి.భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## మద్యాన్ని నియంత్రించి అడిక్షన్ సెంటర్లో పెట్టాలి

### ఆర్డీఓ వంశీకృష్ణ కి వినతిపత్రం

### ఇస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు


కావలి పెన్ పవర్ నవంబర్ 11

మద్యాన్ని నియంత్రించి అడిక్షన్ సెంటర్లో పెట్టాలని మరియు పెంచిన పెంచుతున్న కరెంటు చార్జీలను తగ్గించాలని స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలని కోరుతూ సోమవారం మండల వ్యవసాయ కార్మిక సంఘం కెవిపిఎస్ తదితర ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఆర్డిఓ ఎం వంశీకృష్ణ కి వినతిపత్రం అందించడం జరిగింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గత ఎన్నికల్లో మద్యాన్ని నియంత్రిస్తానని వాగ్దానం చేసింది అయితే ఆచరణలో మద్యాన్ని విచ్చలవిడిగా ప్రవహిస్తున్నదని అన్నారు. కావలి బస్టాండ్ సెంటర్ లోనూ బడి గుడి దగ్గరలో షాపులు పెట్టి విచ్చలవిడిగా అమ్ముతున్నారు అని తెలిపారు. గత ప్రభుత్వంలో ఏరకంగా బెల్ షాపులో ఉన్నాయో అదే రకంగా ఇప్పుడు ఉన్నాయి ఎక్సైజ్ శాఖ ఏమీ నివారించడం లేదని అడిక్షన్ సెంటర్లు పెడతానని రాష్ట్ర ప్రభుత్వం పెట్టలేదు కనుక తక్షణం మధ్యాన్ని నియంత్రించి అడిక్షన్ సెంటర్లో పెట్టాలని కోరారు. పెంచిన పెంచుతున్న కరెంటు చార్జీలు 18 వేల కోట్ల రూపాయలను రద్దు చేయాలని అంతేకాకుండా స్మార్ట్ మీటర్లను కూడా రద్దు చేయాలని ఈ సందర్భంగా కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు టి మాల్యాద్రి, కావలి రూరల్ అధ్యక్ష కార్యదర్శులు పి సీతారామయ్య, రాధాకృష్ణయ్య, మరియు కె జాన్, కమలాకర్, సూర్య నారాయణ సింగ్, మధు,తదితరులు పాల్గొన్నారు.



# ఆధునిక విద్యకు ఆధ్యుడు.. "మౌలానా అబుల్ కలాం ఆజాద్"

## జన విజ్ఞానవేధిక రాష్ట్ర నాయకులు పి స్వరూపరెడ్డి






**గిద్దలూరు పెన్ పవర్ నవంబర్11**

స్వాతంత్ర సమరయోధుడు, భారతరత్న గ్రహీత, భారత తొలి విద్యాశాఖ మంత్రి, ఉన్నత విద్యకు ఊపిరి పోసిన మహనీయుడు మౌలానా అబుల్ కలాం ఆజాద్ ఓనమాలతో మొదలైన అక్షరాలు మనిషి జీవితాన్ని మార్చి వేసే గెలుపు మెట్లు. ప్రపంచాన్ని మార్చగల అత్యంత శక్తివంతమైన ఆయుధం చదువు ఒక్కటే. మానవుని మనుగడకు అక్షరం ఆయుధమైతే, దేశ మనుగడకు విద్య వజ్రాయుధం లాంటిది. చదువు బతుకు నివ్వాలి. బతకనివ్వాలని జనవిజ్ఞానవేధిక రాష్ట్రనాయకులు పి స్వరూపరెడ్డి పేర్కొన్నారు ఆదివారం నాడు మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతిని పురస్కరించి రాచర్ల స్పందన విద్యాసంస్థల్లోజరిగిన కార్యక్రమంలో స్వరూపరెడ్డి ముఖ్య అతిధిగా పాల్గొని ప్రసంగించారు .దశాబ్దాలు గడుస్తున్న విద్యార్థుల నమోదు, నాణ్యమైన బోధన, నైపుణ్యాల అభివృద్ధివంటి కీలక అంశాలు చర్చనీయంశాలుగా మిగిలిపోతున్నాయని. ఆ దిశగా చేపడుతున్న చర్యలతో ఆశించిన ఫలితాలు పొందలేకపోతున్నాం అన్నారు ఉపాధికి భరోసా ఇచ్చే పాఠ్యాంశాల బోధన, పరిశ్రమలతో విద్యాసంస్థలను అనుసంధానించడం అవసరము అన్నారు. జాతీయ విద్య దినోత్సవ సందర్భంగా నైనా ప్రభుత్వాలు గట్టిగా సంకల్పం తీసుకొని ఆజాద్ ఆశించిన విధంగా దేశీయ విద్యారంగాన్ని వికసింప చేయడానికి గట్టి చర్యలు అవసరం అన్నారు. ఆనాడు ఎందరో మహనీయులు దేశం కోసం విశేష కృషి చేశారని. భారత స్వాతంత్ర్యం కోసం పరితపించిన వ్యక్తిగా, మత ప్రాతిపదికన భారతదేశం విడిపోవటాన్ని వ్యతిరేకించిన నిజమైన భారతీయునిగా, స్వాతంత్ర్యానంతర భారతదేశంలో సాహిత్యం, విద్యా వికాసాలకొరకు కృషి చేసిన వ్యక్తిగా, దేశభక్తికి మతాలు అడ్డురావని నిరూపించిన వ్యక్తి మౌలానా అబుల్ కలామ్ ఆజాద్అన్నారు. సౌదీ అరేబియా దేశంలోని 'మక్కా' లో 1888 నవంబర్ 11న మౌలానా అబుల్ కలామ్ జన్మించారని మహమ్మదీయ సాంప్రదాయ పద్ధతిలో విద్యాభ్యాసం చేసినప్పటికి మౌలానా రహస్యంగా ఆంగ్లం భాషను కూడా నేర్చుకున్నారన్నారు. సాంప్రదాయ పద్ధతిలోవిద్యాభ్యాసం చేసినప్పటికీ మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ ఏనాడూమతమౌఢ్యానికి లోనొలేదని పైగా ఆయన పరమత సహనం పాటించారన్నారు. 'ముస్లింలీగ్' పార్టీ మొత్తం ముస్లింలందరికీ ప్రాతినిధ్యం వహిస్తోందన్న అపవాదును తుడిచివేయడానికి మౌలానా 'నేషనలిస్ట్ ముస్లిం లీగ్' పార్టీని కాంగ్రెస్‌లో అంతర్భాగంగా స్థాపించారని. స్వాతంత్ర్యానంతర భారతదేశంలో నెహ్రూ నేతృత్వంలోని ప్రభుత్వంలో విద్యాశాఖమంత్రిగా 10 సంబబల పాటుబాధ్యతలుసమర్ధవంతంగా నిర్వహించిన మౌలానా ఆజాద్ ను నెహ్రూ 'సంస్కృతి' ధైర్యాలకు ప్రతీక కీర్తించారన్నారు. యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ ని మౌలానా ఆజాద్ స్థాపించారని.అప్పటి భారత ప్రధాని జవహరలాల్ నెహ్రూ ఆధ్యర్యంలో ప్రతిష్టాత్మక విద్యా సంస్థలైన ఐ. ఐ .టి లను కూడా స్థాపించారన్నారు.అటు విద్యారంగంలో శాస్త్ర, సాంకేతిక, స్త్రీ విద్యాభివృద్ధికి కృషి చేస్తూనే, ఇటుకళారంగంలో తన ఆసక్తిని ప్రదర్శించారని, మౌలానా అబుల్ కలామ్ ఆజాద్. సంగీత, సాహిత్యాలను అమితంగా అభిమానించే మౌలానా అబుల్‌కలామ్ ఆజాద్ 'సాహిత్య అకాడమీ', 'సంగీత నాటిక అకాడమీ', 'లలిత కళా అకాడమీ' లను స్థాపించారని. 'లలితకళా అకాడమీ' ను స్థాపించినపుడు దానికి భవనం లేకపోవటంతో తన నివాసంలో కొంతభాగాన్నిచ్చారన్నారు.మౌలానా అబుల్ కలామ్ రచించిన ఇండియా విన్స్ ఫ్రీడమ్ పుస్తకంలో భారతదేశ విభజన గురించి రాశారని. 1958 ఫిబ్రవరి 22న ఆయన తుదిశ్వాస విడిచారన్నారు.ఆజాద్ కి మరణానంతరం 1992 లో భారతదేశం యొక్క అత్యున్నత పౌర పురస్కార%ళి% భారతరత్న లభించిందని .ఆయన జయంతిని జాతీయ విద్యా దినోత్సవంగా జరుపుతారన్నారు ఆయన స్ఫూర్తితో నేటి పాలకులు విద్య కు అత్యంత ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వవలసిన అవసరం ఉందని ఆయన ఎర్కొన్నారు ఈ సందర్భంగా ఆయనకు ఘనంగా నివాళు లర్పించారు.

## ఎమ్మార్పి మించి ఎరువులని అమ్మరాదు






**దొనకొండ నవంబర్ 11 పెన్ పవర్**

మండల కేంద్రంలోని జనతా రైతు బజార్ మరియు జువారి ఎరువుల షాపులను ఈ రోజు మండల వ్యవసాయ అధికారి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎరువుల చట్టాలకు లోబడి వ్యాపారం చేసుకోవాలని అతిక్రమిస్తే సంభందిత లైసెన్స్ లను రద్దు చేయుటకు సిఫార్స్ చేస్తామని హెచ్చరించారు. రైతుల అవసరాన్ని ఆసరా గా చేసుకొని ఎరువులని అధిక రేట్లకి అమ్మ రాదని, రైతు కొనుగోలు చేసిన ఎరువుల బస్తాలకి కి రైతులు అడిగిన, అడగకపోయినా రశీదు తప్పకుండ ఇవ్వాలని ఆదేశించారు. స్టాక్ రిజిస్టర్ లని, బీల్లు పుస్తకాలని, కంపెనీల అనుమతి పత్రాలని తనిఖీ చేశారు.గోడౌన్ లో ఉన్న ఎరువుల బస్తాలకి,స్టాక్ బుక్ లో ఉన్న వివరాలని సరి చూశారు. నకిలీ ఏరువులని అమ్మినట్లు తెలితే అటువంటి డీలర్ల లైసెన్సులను రద్దు చేయడానికి సిఫారసు చేస్తామని తెలియజేశారు. రైతులు కూడ లైసెన్స్ కలిగిన అధికృత డీలర్ల నుంచి మాత్రమే కొనాలని తెలిపారు.దిగుబడి ఎక్కువగా వస్తదని సిఫారసులను మించి వాడరాదాని, పక్క రైతు వేశారాని మనము వేయాలనే ఉద్దేశ్యం తో ఎరువులను వాడారదని రైతులని కోరారు.జువారి ఎరువుల షాప్ లో రెండు నమూనాలని తీశారు.వీరి వెంటవ్యవసాయ విస్తరణ అధికారి జి యోగేశ్వర రావు,గ్రామ రైతు సేవా కేంద్ర సిబ్బంది విన్నీ బాబు ఉన్నారు.

## డైరెక్టర్ రాం గోపాల్ వర్మపై కేసు

**మద్దిపాడు మండలం మద్దిపాడు పెన్ పవర్ నవంబర్ 11**



ప్రకాశంజిల్లా మద్దిపాడు పోలీసుస్టేషన్లోఐటీ చట్టం కింద కేసునమోదు. 'వ్యూహం' సినిమా ప్రమోషన్ల సమయంలో చంద్రబాబు, లోకేష్, బ్రాహ్మణి వ్యక్తిత్వాలను కించపరిచేలా పోస్టులు చేశారని ఫిర్యాదు టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి రామలింగం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు.

# ప్రజా సమస్యల పరిష్కారానికై పోరాటం చేద్దాం

### సీపీఐ జిల్లా కార్యదర్శి తన్నీరు సింగరకొండ

### డిసెంబర్ 26న సీపీఐ శత వార్షికోత్సవాలను ఘనంగా నిర్వహిద్దాం

### సీపీఐ జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక ఏకీగ్రవం

**పెన్ పవర్ స్టాఫ్ రిపోర్టర్ బాపట్ల నవంబర్ 11**

ప్రజా సమస్యల పరిష్కానికై పోరాటం చేద్దామని సీపీఐ జిల్లా కార్యదర్శి తన్నీరు సింగరకొండ పిలుపునిచ్చారు. సీపీఐ జిల్లా కార్యాలయంలో జిల్లా కౌన్సిల్ సభ్యులు దొంతిబోయిన వెంకటేశ్వరరెడ్డి అధ్యక్షతన సోమవారం జిల్లా సమితి సమావేశం జరిగింది. ఈ సమావేశానికి సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సమావేశంలో జిల్లా నూతన కార్యవర్గాన్ని ఏకీగ్రవంగా ఎన్నుకున్నారు. అనంతరం సింగరకొండ మాట్లాడుతూ డిసెంబర్ 26 సీపీఐ పార్టీ శత వార్షికోత్సవ వేడుకలను జిల్లాలోని గ్రామగ్రామన ఘనంగా నిర్వహించాలన్నారు. ఈ నెల 18వ తేదీన జిల్లాలో ఉన్న ప్రతి సచివాలయాల్లో పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని కోరుతూ అర్జీలు అందించాలన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అన్నీ అమలు చేయాలని కోరారు. జిల్లా కేంద్రంలో నిత్యం సమస్యలతో ప్రజలు అల్లాడుతున్నారని తాగునీరు సాగునీరు లేక గ్రామీణ రైతులు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ప్రజాప్రతినిధులు అధికారులు ప్రత్యేక చొరవ తీసుకొని పరిష్కరించాలన్నారు. అనంతరం జిల్లా కార్యవర్గానికి ప్రత్యేక ఆహ్వానితులుగా జేబీ శ్రీధర్, బావిరెడ్డి ప్రభాకర్ రావు, మేడా వెంకట్రావు, కేవీఎల్‌డీ ప్రసాద్‌లను ఏకీగ్రవంగా ఎన్నుకున్నారు. అనంతరం నూతనంగా పలువురిని జిల్లా కౌన్సిల్‌కు పలువురిని ఎన్నుకున్నారు.మామిడిబత్తుల ఆశోక్ బాపట్ల పట్టణ కార్యదర్శి ఏటగిరి శ్రీనివాసులు, అద్దంకి



నాగేశ్వరరావు (బీకేఎంయూ), జె.రత్నకుమారి, మేకల వెంకాయమ్మ (ఎన్.ఎఫ్,ఐ.డబ్లు) మేకల బిజిలిబాబు, దోమా రాజారెడ్డి (ఏఐవైఎఫ్) లను ఏకీగ్రవంగా ఎన్నుకున్నారు.

**జిల్లా నూతన కార్యవర్గ సభ్యులు** : తన్నీరు సింగరకొండ ( సీపీఐ జిల్లా కార్యదర్శి) తుమ్మల పూర్ణచంద్రశేఖర్ ( అద్దంకి నియోజకవర్గ కార్యదర్శి),చిరమల ప్రకాష్‌బాబు ( చీరాల నియోజకవర్గ కార్యదర్శి) , బక్కా వెంకటరామకృష్ణారెడ్డి ( బాపట్ల నియోజకవర్గ కార్యదర్శి), బండారు శ్రీనివాసరావు (వేమూరు నియోజకవర్గ కార్యదర్శి) బత్తుల శామ్యూల్ (ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి), జె.రత్నకుమారి (ఎన్.ఎఫ్.ఐ.డబ్లు) , ఏటగిరి శ్రీనివాసులు ( వ్యవసాయ కార్మిక సంఘం), నంబూరి సత్యం (రేపల్లె)లను ఏకీగ్రవంగా ఎన్నుకున్నారు.

# అక్రమంగా ఎర్రచందనం తరలిస్తున్న ముఠా సభ్యులు అరెస్ట్



**పలమనేరు నవంబరు 11,(పెన్ పవర్):**

తిరుపతి శేషాచలం అటవీప్రాంతం నుండి తమిళనాడుకు అక్రమంగా ఎర్రచందనాన్ని తరలించే ముఠాను పలమనేరు పోలీసులు అదుపులోకి తీసుకొని సోమవారం పోలీస్ స్టేషన్లో అరెస్టు చూపినట్లు సిఐ నరసింహరాజు తెలిపారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. చిత్తూరుజిల్లా ఎస్పీ మణికంఠ ఛందోలు, డిఎస్పి.డి.ప్రభాకర్ పర్యవేక్షణలో సిఐగా తాను ఎస్సై స్వర్ణతేజ సిబ్బందితో కలిసి ఆదివారం రాత్రి కాలవపల్లి చెక్పోస్ట్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా మహేంద్ర ఎక్స్.యు.వి.500 అనే కారు నెంబర్ కె.ఏ.05.ఎం.బి.2459లో 6మంది వ్యక్తులు. ఇద్దరు మైనర్లు దిగి పారిపోతుండగా వారిని అదుపులోకి తీసుకొని విచారించగా ఎర్రచందనం కూలీలమని గతంలో కూడా అక్టోబర్ 21వ తేదీన వినోద్ కుమార్, సేటుల ఆదేశాల మేరకు తిరుపతి ప్రాంతంలో గల శేషాచలం అటవీ ప్రాంతం నందు ఉన్న ఎర్రచందనం చెట్లను నరికి వాటిని 12దుంగలుగా చేసి ఇనోవా కారు టి.ఎన్ .02 ఏ.ఎల్.7799లో తమిళనాడుకు పలమనేరు మీదుగా తరలిస్తుండగా పోలీసు వాహనాలను తనిఖీ చేయడం చూసి ఆవాహనాన్ని వదిలి పారిపోయారన్నారు.దీంతో అప్పట్లో స్థానిక పోలీస్ స్టేషన్లో క్రైమ్ నెంబర్ 243 /2024 నందు పలు సెక్షన్లను అలాగే అటవీశాఖ యాక్ట్ కేసులను కూడా నమోదు చేశామన్నారు. అనంతరం ఆదివారం తిరిగి అదే ముద్దాయిలు కారులో తిరుపతికి వస్తుండగా వారిని అదుపులో తీసుకొని అరెస్టు చూపి కోర్టులో హాజరు పరిచామన్నారు.కాగా అరెస్ట్ అయిన వారిలో తమిళనాడు రాష్ట్రం తిరువన్నామలై జిల్లా కోరైమడువు గ్రామానికి చెందిన లేట్ మణి కుమారుడు ఎం.శర్వాన తిరువన్నామలై జిల్లా పోలూరు తాలూకా అర్సనపల్లి గ్రామానికి చెందిన మని కుమారుడు బాబు, జమున మాతూర్ తాలూకా కోరై మడువూ గ్రామానికి చెందిన స్వామినాథ కుమారుడు మత్తివన్నన్ జమున మత్తు తాలూకా వాలుబొమ్మ బాయ్ గ్రామానికి చెందిన స్వామినాథ కుమారుడు ఎస్.విజయ్ కుమార్,జమున మత్తూరు తాలూకా కూటత్తూర్ గ్రామానికి చెందిన మురుగన్ కుమారుడు హరీష్ ,జమున మత్తూర్ తాలూకా కోరైమడువూ గ్రామానికి చెందిన చిన్న స్వామి కుమారుడు సి.శక్తివేల్ నిందితులను అరెస్ట్ చూపమన్నారు. వీరితో పాటు ఇద్దరు మైనర్లు ఉన్నారన్నారు. అయితే ఈ కేసులో (ఏ.వన్) వినోద్ కుమార్ (ఏ.టూ) సేటు లు పరారీలో ఉన్నారని త్వరలో వారిని అదుపులో తీసుకుంటామని తెలిపారు.

# వాకర్స్ అసోసియేషన్ ఆధ్వ ర్యంలో నోట్ బుక్స్, విద్యా సామాగ్రి పంపిణీ

### ఘనంగా జాతీయ విద్యా దినోత్సవ, మౌలానా అబ్దుల్ కలామ్ ఆజాద్ జయంతి వేడుకలు

**చీరాల, నవంబర్ 11,పెన్ పవర్**

చీరాల ఎన్.ఆర్. అం డ్ పి.ఎం. హైస్కూల్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో, నిరంతరం చేపడుతున్న సా మాజిక సేవా కార్యక్రమాలలో భాగంగా, జాతీయ విద్యా దినో త్సవం సందర్భంగా, మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ జయం తిని పురస్కరించుకుని, చీరాల వైకుంఠ పురంలోని శ్రీ వల్లభా పురపు పిచ్చయ్య ఎయిడెడ్ అప్పర్ ప్రైమరీ స్కూల్ నందు, విద్యార్థులకు దేవకి సుబ్బారా వు, కొంత మంది వాకర్స్ అసో సియేషన్ సభ్యుల సహకారం తో, రూ.9వేలు విలువగల లాంగ్ సైజ్, కాపీ రైటింగ్ బుక్స్, పలకలు, బలపాలు, పెన్సిళ్ళు, పెన్నులు, రబ్బర్లు,తదితర వి ద్యా సామాగ్రి, బిస్కట్ ప్యాకె ట్లు, స్వీట్స్, పంపిణీ చేశారు. బాగా చదువుకొని, ఉన్నత శిఖరాలు అధిరోహించాలని, విద్యార్థులకు, వాకర్స్ అసోసి యేషన్ ప్రతినిధులు పిలుపు నిచ్చారు. తొలుత మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్ జయం తిని పురస్కరించుకొని, ఆయ న చిత్రపటానికి పూలమాలలు వేసి, ఘనంగా నివాళులర్పిం చారు. విద్యా రంగానికి ఆయన చేసిన సేవలను విద్యార్థు లకు వివరించారు. జాతీయ విద్యా దినోత్సవం, మౌలానా అబ్దుల్ కలామ్ ఆజాద్ జయంతి వేడుకలను, ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో వాక ర్స్ అసోసియేషన్ అధ్యక్షులు పోలుదాసు రామకృష్ణ, చారు గుళ్ళ గురుప్రసాద్, దేవకి సు బ్బారావు, చెక్క చెన్న నారా యణ, దోగుపర్తి వెంకట సురే ష్, వంగర పూర్ణచంద్రరావు, లాల్, సుబ్బారావు, శ్రీనివాస రావు, రామారావు, స్కూల్ సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ ప్రభాకరరావు, ఉపాధ్యాయు లు టి.లక్ష్మి ప్రతాప్, బాలకృష్ణ, శ్రీనివాసరావు, ప్రమీల, విద్యా ర్థులు పాల్గొన్నారు.



# వాహనాలు తనిఖీ

### ఎస్ ఐ నరసింహారావు



**పెన్ పవర్, కంభం నవంబర్ 11**

ద్విచక్ర వాహనాలను ఆపి తనిఖీలు చేపట్టారు. కంభం వై జంక్షన్ లో సోమవారం ఎస్ ఐ నరసింహారావు ద్విచక్ర వాహనదారులకు లైసెన్స్ లేకుండా ప్రయాణించే వారిపై కఠిన చర్యలు చేపట్టారు. అలాగే హెల్మెట్ ధరించాలని హెల్మెట్ లేని వారికి తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ సరైన పత్రాలు లేని వాహనాలను నెంబర్ ప్లేట్ లేకుండా రోడ్డుపై నడుస్తున్న వాహనాల పై చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ వాడాలని వాహనాలపై ఉన్న పెండింగ్ చలనాలను వెంటనే చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఎరువులు పురుగుమందు షాపులు ఆకస్మికతనికి వ్యవసాయ శాఖ అధికారి షేక్ మహమ్మద్





**పెన్ పవర్ ,కంభం అర్ధవీడు నవంబర్ 11**

ఎరువులు పురుగుమందులు అమ్మే వ్యాపార సంస్థలపై అర్ధవీడు వ్యవసాయ శాఖ అధికారి షేక్ మొహమ్మద్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎరువులు పురుగు మందుల షాపులను తనిఖీ చేయడం జరిగింది. స్టాక్ వివరాలు రికార్డులను పరిశీలించారు స్టాకు వివరాలను ఎప్పటికప్పుడు వెంటనే రిజిస్టర్లో నమోదు చేయాలని సూచించడం జరిగింది. ఎరువులు పురుగు మందులు కొనుగోలు చేసిన రైతులకు బిల్లులు ఇవ్వాలని బ్లాక్ బోర్డ్ నందు స్టాక్ వివరాలను వాటి ధర వివరాలను నమోదు చేయాలని డీలర్లకు సూచించడం జరిగింది. అంతేకాక ఎమ్మార్పీ ధరల కంటే అధిక ధరలకు అమ్మినట్లయితే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయా షాపుల వారిని హెచ్చరించినట్లు తెలిపారు.

## సిసి రోడ్ల పనులు ప్రారంభించిన టిడిపి మండల అధ్యక్షుడు పువ్వాడి వెంకటేశ్వర్లు





**పెన్ పవర్ పామూరు నవంబర్ 11**

పట్టణంలోని పువ్వాడి రాధాకృష్ణ నగర్ నందు సోమవారం కనిగిరి నియోజకవర్గం రెడ్డి మంజూరి చేసిన సిసి రోడ్డు పనులను భూమి పూజ ప్రారంభించిన టిడిపి మండల అధ్యక్షుడు పువ్వాడి వెంకటేశ్వర్లు. ఈకార్యక్రమంలో మాజీ పువ్వాడి తిరుపతమ్మ, జిల్లా టీడీపీ రైతు అధ్యక్షుడు ఏలూరి వెంకటేశ్వర్లు , అమీర్జాన్ ,మరియు తెలుగుదేశం పార్టీ శ్రేణులు,పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ డిపార్ట్మెంట్ అసిస్టెంట్, శృతి, పులి నాయిబా,పూవ్వాడి వెంకటేశ్వర్లు (బిల్డర్), తడికమళ్ళ సుబ్బారావు, టిడిపి మహిళ నాయకురాలు హాజరయ్యారు.

## మహేష్ మృతి బాధాకరం

**మాజీ మంత్రి మానుగుంట మహీధర్ రెడ్డి**







**కందుకూరు పెన్ పవర్, నవంబర్ 11**

తోకల మహేష్ మృతి బాధాకరమని ఉమ్మడి రాష్ట్ర మాజీ మంత్రి మానుగుంట మహీధర్ రెడ్డి అన్నారు. తోకల మహేష్ రోడ్డు ప్రమాదంలో ఆదివారం మరణించిన సంగతి తెలిసిందే. సోమవారం ఉమ్మడి రాష్ట్ర మాజీ మంత్రి మానుగుంట మహీధర్ రెడ్డి మహేష్ ఇంటికి వెళ్లి మహేష్ భౌతికకాయానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబసభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. ప్రమాదం జరిగిన ఘటన గురించి తోకల కొండయ్యని అడిగి తెలుసుకున్నారు. మహీధర్ రెడ్డి వెంట ఇంటూరి హరిబాబు, ఇంటూరి మాధవరావు,అనుమోలు వెంకటేశ్వర్లు తదితరులున్నారు.

## బేస్తవారిపేట నూతన మినీ లారీ అసోసియేషన్ ఆఫీస్ ప్రారంభించిన ఎస్సై రవీంద్రారెడ్డి



**బేస్తవారిపేట,పెన్ పవర్ నవంబర్ 11**

బేస్తవారిపేట జంక్షన్ సమీపంలోని హైవే రోడ్ లో మినీ లారీ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం బేస్తవారిపేట మినీ లారీ అసోసియేషన్ ఆఫీసును ప్రారంభించారు ఈ కార్యక్రమానికి బేస్తవారిపేట మండల సబ్ ఇన్స్పెక్టర్ రవీంద్రారెడ్డి మరియు మట్ట రమేష్ , బీసు అరుణ కుమార్ ,మోహన్ రెడ్డి యూనియన్ ప్రెసిడెంట్ ఎస్కే రఫీ వైయస్ సర్పంచి ఎం మస్తాన్ బేగ్ ట్రెజరీ ఎస్.కె దస్తగిరి పి ఖాసీం సెక్రెటరీ డి రంగయ్య డి పీరయ్య జాయింట్ సెక్రెటరీ ఎన్ ప్రేమ్ రాజు డి ప్రేమ్ కుమార్ యూనియన్ మెంబర్స్ తదితరులు పాల్గొన్నారు.


## మైనారిటీ నేతల పదవులపై ముస్లిం నాయకుల హర్షం

**తెదేపా ముస్లిం మైనార్టీ నాయకులు షేక్ గౌస్ బాషా.**

**పెన్ పవర్ పామూరు నవంబర్ 11**




ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ మైనార్టీ శాఖ సలహాదా రులుగా టీడీపీ సీనియర్ నాయకులు, శాసనమండలి మాజీ చైర్మన్ మహమ్మద్ అహ్మద్ షరీఫ్ అదేవిధంగా రాష్ట్రమైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ గా ముస్తాక్ అహ్మద్లను నియమించడంపై మండలానికి చెందిన పలువురు ముస్లిం మైనారిటీ నాయకులు షేక్ గౌస్ బాషా హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, టిడిపి జనసేన, బిజెపి కూటమి నాయకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా షేక్ గౌస్ బాషా మాట్లాడుతూ రాష్ట్రంలో తెలుగుదేశం కూటమి ప్రభుత్వం ముస్లిం మైనారి టీలకు ప్రభుత్వ పదవుల్లో సముచిత స్థానం కల్పించి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నట్లు అందుకు నిదర్శనం సీనియర్ నాయకులను నియమించడం అని అదేవిధంగా రాష్ట్రంలో ముస్లిం మైనారిటీల ఆర్థిక సంక్షేమాభివృద్ధికి టిడిపి కూటమి ప్రభుత్వం ప్రత్యేకంగా కృషిచేస్తున్నట్లు మైనారిటీ నాయకులు షేక్ గౌస్ బాషా అన్నారు.



# ముళ్ళ పొదలతో మూసుకుపోయిన ఆయకట్టు దారి

**రాకపోకలకు ఇబ్బందులు పడుతున్న రైతులు పలు గ్రామాల ప్రజలు.**

**కొద్దిపాటి వర్షం కురిసిన చిత్తడిగా మారుతున్న ఆయకట్టు రోడ్డు.**

**కాలిబాటను తలపిస్తున్న ఆయకట్టు దారి.**

**కొమరోలు పెన్ పవర్ నవంబర్ 11**

కొమరోలు లోని పడిదప్ప చెరువు కట్టపై గల ఆయకట్టు రోడ్డు ముళ్ళపొదలతో మూసుకుపోయి రాకపోకలకు తీవ్ర ఇబ్బందులను కలిగిస్తున్నది. దీనితో రైతులు తీవ్ర నిరసన ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొమరోలు సమీపంలో ని పడి దెబ్బచెరువు కట్టపై గతంలో ఆయకట్టు దారి ఏర్పాటు చేశారు. పడిదప్ప చెరువు ఆయకట్టుదారులైన రైతులు తమ పొలాలకు రాకపోకలు సాగిస్తున్నారు. ఆయకట్టు దారి విశాలంగా ఉన్నందువలన గతంలో ఎద్దుల బండ్లు, ట్రాక్టర్లు కూడా ఆయకట్టుదారిపై రాకపోకలు సాగించేవి. పొలాల్లో పండిన పంట ఎద్దుల బండ్లపై రైతులు ఇళ్లకు చేర్చుకునేవారు. రైతులే కాకుండా చింతలపల్లి ,వర్ధన పల్లి, కూరాకువని పల్లి ,ఓబులాపురం, మలికేపల్లి, కొత్తపల్లి ,పుల్లారెడ్డిపల్లి, ఎర్రంశెట్టి వాని పల్లె ,గోహారపల్లె, కసినేపల్లె తదితర గ్రామాలకు చెందిన ప్రజలు కొమరోలుకు ద్విచక్ర వాహనాలు సైకిళ్లపై వచ్చేందుకు పడిదప్ప చెరువు పై గల ఆయకట్ట దారిని ఉపయోగించుకుంటున్నారు. దీనితో వారికి దాదాపు రెండు కిలోమీటర్ల మేర దూరం తగ్గుతుంది. అయితే గత కొంతకాలంగా ఆయకట్టు దారికి ఇరువైపులా దట్టమైన ముళ్లపొదలు పెరిగాయి. దీనితో ఆయకట్టు దారి పూర్తిగా మూసుకుపోయి కాలిబాటను తలపిస్తున్నది. ఇక కొద్దిపాటి వర్షం కురిసినా, దారి మొత్తం చిత్తడిగా మారి రైతులు ప్రజల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులను కలిగిస్తున్నది .ఏ కొద్ది ఏమరపాటు జరిగిన కాలుజారిన అయిదారు అడుగుల లోతులో ఉన్న అటు చెరువులోకి లేదా ఇటు పొలాల్లోకి జారిపడే ప్రమాదం ఉందదని రైతులు ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు .కావున నీటిపారుదల శాఖ అధికారులు సత్వర చర్యలు తీసుకొని ఆయకట్టు రోడ్డును అభివృద్ధి చేసి తమకు సౌకర్యం కల్పించాలని రైతులు పలు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

# ఎస్సీల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ఆశయం

**ఎస్సీల సంక్షేమానికి 18,497 కోట్ల నిధులు**

**బడ్జెట్ పట్ల ఎంఎస్ పిఎస్ నాయకుల హర్షం -కొమ్ము సుజన్ మాదిగ**

**ఒంగోలు పెన్ పవర్ నవంబర్ 11**



ఎస్సీల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్న విషయాన్ని సోమవారం ప్రవేశపెట్టిన బడ్జెట్ ఎస్సీ ప్రజలకు సంతృప్తినిచ్చిందని,జీవో నెంబర్ 25 ప్రకారం సంక్షేమ పథకాలను సత్వరమే అందించాలని,రాష్ట్ర శాసనసభ సమావేశాల్లో సీఎం నారా చంద్రబాబునాయుడు అధ్యక్షతన జరిగిన బడ్జెట్ సమావేశంలో ఎస్సీల సంక్షేమం కొరకు18,497 కోట్ల నిధులు కేటాయించడం సంతోషకరమని మాదిగ సంక్షేమ పోరాటసమితి రాష్ట్ర అధ్యక్షులు కొమ్ము సుజన్ మాదిగ హర్షం వ్యక్తం చేశారు. సోమవారం ఒంగోలులోని అంబేద్కర్ భవన్లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మునుపెన్నడూ లేనివిధంగా ఎస్సీసంక్షేమానికి పెద్దపీట వేయటం అభినందనీయమన్నారు.ఎస్సీ వర్గీకరణ జిల్లాల వారీగా సత్వరమే జరిగేలా చర్యలు చేపట్టాలని,జీవో నెంబర్ 25 ప్రకారం సంక్షేమ ఫలాలు ఎస్సీలు ఎస్సీ ఉపకులాల జనాభా దామాషా ప్రకారం ఆయా కులాలకు అందించడంలో జాప్యం జరగకుండా చూడాలన్నారు. ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసుల్లో బాధితులకు అందించాల్సిన రిలీఫ్ ఫండ్ ప్రకాశం జిల్లా కు సుమారు 5 కోట్ల రూపాయలు రావాల్సి ఉండగా 55 లక్షలు మాత్రమే కేటాయించారని మిగిలిన నిధులను సత్వరమే అందజేస్తే బాధితులకు సకాలంలో మేలు జరుగుతుందని తెలిపారు. గత ఐదు సంవత్సరాలు వైసీపీ ప్రభుత్వంలో ఎస్సీ కార్పొరేషన్లను నిర్వీర్యం చేసిన సంగతి విధితమేనన్నారు. ఎస్సీలతో పాటు మిగిలిన కార్పొరేషన్లకు ఏ ఒక్కరికి కూడా ఒక్క రూపాయి కూడా నిధులు కేటాయించకుండా బటన్ నొక్కుడు విధానాన్ని అవలంబించి నేరుగా లబ్ధిదారులు ఖాతాలో వేస్తున్నామని చెప్పటం అదొక బూటుకమన్నారు.దానికి ఎస్సీలతో పాటుగా మిగిలిన కులాల ప్రజలు కూడా గత ఎన్నికల్లో ఆ పార్టీకి తగిన బుద్ధి చెప్పారని గుర్తు చేశారు.ఈ కార్యక్రమంలో సంక్షేమ సంఘం నాయకులు మందా.సుధాకర్, తేళ్ల జయరాజ్,రావినూతల జయకుమార్,త్యాగరాజు, సురేష్ ,శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యావ్యవస్థలో సమూలమైన మార్పులు తెచ్చిన మహా మేధావి

**జర్నలిస్టుగా భారతరత్న అబుల్ కలాం ఆజాద్ సేవలు చిరస్మరణీయం**

**మౌలానా అబ్దుల్ కలాం పేరుతో ఒంగోలులో మైనార్టీ స్టడీ సర్కిల్ ఏర్పాటు చేయాలి.**

**షేక్ సైదా జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు**






**ఒంగోలు పెన్ పవర్ నవంబర్ 11**

మొట్టమొదటి విద్యాశాఖ మంత్రిగా విద్యావ్యవస్థలో సమూలమైన మార్పులు తెచ్చిన మహా మేధావి, జర్నలిస్టుగా,సాహితీవేత్తగా, మానవత్వం మూర్తిభవించిన మహనీయునిగా చరిత్ర కు ఎక్కారని ప్రకాశం జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు షేక్ సైదా అన్నారు. ప్రకాశం జిల్లాలో మౌలానా అబుల్ కలాం ఆజాద్ పేరుతో స్టడీ సర్కిల్ ఏర్పాటు చేయాలని తద్వారా మైనార్టీ విద్యార్థులు యువకులు,నిరుద్యోగులకు మేలు జరుగుతుందన్నారు.ఒంగోలు జిల్లా పార్టీ కార్యాలలో జరిగిన మౌలానా అబుల్ కలాం ఆజాద్136 వ జయంతి వేడుకల్లో పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళు లర్పించారు.ఈ సందర్భంగా షేక్ సైదా మాట్లాడుతూ భారతరత్న, ప్రముఖ స్వాతంత్ర సమరయోధులు భారతదేశ మొట్టమొదటి విద్యాశాఖ మాత్యులు,ఏఐసీసీ మాజీ అధ్యక్షులు,బహుముఖ ప్రజ్ఞాశాలి అబుల్ కలాం ఆజాద్ సేవలు చిరస్మరణీయమని కొనియాడారు.విద్యార్థులు గ్రూప్స్ కాంపిటేటివ్ ఎగ్జామ్స్ కి ప్రిపేర్ అయ్యేందుకు అవకాశం ఉంటుందని ప్రభుత్వం ఈ విషయమై స్పందించాలని సైదా కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఏఐయుడబ్ల్యుసి చైర్మన్,దర్శి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త కైపు వెంకటకృష్ణారెడ్డి,రాష్ట్ర ఎస్సీ డిపార్ట్మెంట్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఉదండి మల్లికార్జున రావు, జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షులు, కనిగిరి నియోజకవర్గ పార్టీ సమన్వయకర్త దేవరపల్లి సుబ్బారెడ్డి,జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు షేక్ రసూల్, పార్టీ సీనియర్ నాయకులు గోరంట్ల కోటేశ్వరరావు,జిల్లా కాంగ్రెస్ పార్టీ మాజీ అధికార ప్రతినిధి బొడ్డు సతీష్ ,జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు పైనం మధు,మైనార్టీ నాయకులు షేక్ గౌస్ మొహిద్దిన్,షేక్ వలి, ప్రసాద్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డుకు ఇరువైపులా పెరిగిన చిల్ల చెట్ల తొలగింపు చర్యలు చేపట్టిన కొమరోలు ఎస్సై వెంకటేశ్వర్లు నాయక్

**కొమరోలు నుంచి గిద్దలూరు వెళ్లే ఆర్ అండ్ బి రోడ్డు కు ఇరువైపులా దట్టంగా పెరిగి ఉన్న చిల్ల చెట్లు.**

**ప్రమాదకరంగా మారిన రోడ్డు మలుపులు -రోడ్డు మలుపుల్లో పెరిగిన చిన్న చెట్ల తో జరుగుతున్న ప్రమాదాలు.**

**ద్విచక్ర వాహనదారులు పరిమిత వేగంతో ప్రయాణించాలి -మంచు కురుస్తున్నందువల్ల వాహనదారులు తగు జాగ్రత్తలు పాటించాలి.**

**తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలి -మానవతామవాదిగా మారిన కొమరోలు ఎస్సై వెంకటేశ్వర్లు నాయక్.**





**కొమరోలు పెన్ పవర్ నవంబర్ 11**

రోడ్డుకు ఇరువైపులా ముఖ్యంగా రోడ్డు మొలుపుల్లో పెరిగి ఉన్న దట్టమైన ముళ్ళపొదల కారణంగా తరచుగా ప్రమాదాలు జరుగుతున్నాయని తెలుసుకున్న కొమరోలు ఎస్సై వెంకటేశ్వర్లు నాయక్ మానవతా వాదిగా మారి సోమవారం ముళ్ళపొదల తొలగింపుకు చర్యలు చేపట్టారు. కొమరోలు నుంచి ఎడమ కళ్ళు రాజుపాలెం మీదుగా గిద్దలూరు వెళ్లే ఆర్ అండ్ రోడ్డుకు ఇరువైపులా చిల్ల చెట్లు పొదలుగా పెరిగాయి. అంతేకాక రోడ్డు మలుపుల్లో సైతం చిల్ల చెట్లు దట్టంగా పెరిగి ఉండటంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక రోడ్డు ప్రమాదాలు తరచుగా జరుగుతున్నాయి. రోడ్డు ప్రమాదాలను నివారించి ప్రయాణికుల ,వాహనదారుల ప్రాణాలను కాపాడాలనే లక్ష్యంతో కొమరోలు ఎస్సై వెంకటేశ్వర్లు నాయక్ మానవతావాదిగా మారి సోమవారం జెసిబి ని వినియోగించి రోడ్లకు ఇరువైపులా ఘట్టంగా పెరిగిన చిల్లచట్లను తొలగించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఆ మేరకు ఆయన చిన్న చెట్ల తొలగింపు కార్యక్రమాన్ని స్వయంగా పర్యవేక్షించారు. ఆ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్డుకు ఇరువైపుల చెల్ల చెట్లు ఎక్కువగా పెరిగి వాహన రాకపోకులకు ఇబ్బందికరంగా మారాయి అన్నారు. రోడ్డు ప్రమాదాలను నివారించాలనే ఆశయంతో పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చిల్లర చెట్ల తొలగింపు చర్యలు తీసుకున్నామన్నారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి, పరిమిత వేగంతో ప్రయాణించాలని, అంతేకాక ఆటోలు జీపులు కార్లు తదితర వాహనాలు కూడా రోడ్డు నిబంధన పాటిస్తూ పరిమిత వేగంతో ప్రయాణించాలని ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చాలని ఆయన కోరారు. మంచు కురిసే కాలం ప్రారంభమైనందువల్ల ఉదయం వేళలో రాత్రి వేళల్లో వాహనదారులు తగిన జాగ్రత్తలు తీసుకొని ప్రయాణించాలని ఆయన కోరారు .రోడ్డుకి ఇరువైపులా పెరిగిన చిల్ల చెట్లను తొలగింప చేయుటకు చర్యలు తీసుకొని ప్రమాదాల నివారణకు సహకరిస్తున్న కొమరోలు ఎస్సై వెంకటేశ్వర్లు నాయక్ ను వాహనదారులు, ప్రయాణికులు అభినందిస్తూ ధన్యవాదాలు తెలిపారు. మండలంలో శాంతి భద్రతల పరిరక్షణకే కాకుండా సమాజ సేవకు కూడా ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతున్న ఎస్ఐ వెంకటేశ్వర్లు నాయక్ అభినందనీయులని వారు పేర్కొన్నారు. చిన్న చెట్ల తొలగింపు కార్యక్రమంలో ఎస్సై తో పాటు పలువురు పోలీస్ కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, Published at D.NO: 49-1-35, Miriyalapalem Center, Railway Station Road, Ongole, Prakasam District -523001,Andhrapradesh. Printed by GANTYADA APPARAO, Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS, D.NO: 49-1-35, Miriyalapalem Center, Railway Station Road, Ongole, Prakasam District -523001,Andhrapradesh. Editor: G.APPARAO, (Responsible for selection of news under the PRB Act ) RNI : APTEL/2014/58046 e-mail:penpower9@gmail.com

# విద్య ద్వారానే సమాజం అభివృద్ధి







**ఒంగోలు పెన్ పవర్ నవంబర్ 11**

విద్య ద్వారా సమాజం అభివృద్ధి చెందుతుందన్న లక్ష్యంతో విద్యకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ విద్యా రంగంలో అనేక సంస్కరణలు తీసుకువచ్చిన మహనీయులు జనాబ్ మౌలానా అబుల్ కలాం ఆజాద్ అని,వారి అడుగుజాడల్లో నేటి యువత ముందుకు నడవాల్సిన అవసరం వుందని జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా పేర్కొన్నారు.సోమవారం మైనారిటీల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జనాబ్ మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి సందర్భముగా మైనారిటీల సంక్షేమ జాతీయ విద్యా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఒంగోలులోని సెయింట్ థెరిస్సా హైస్కూల్ ఆవరణము ఏర్పాటుచేసిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులు రెడ్డి, ఒంగోలు నగర మేయర్ గంగాడ సుజాత పాల్గొని జనాబ్ మౌలానా అబుల్ కలాం ఆజాద్ గారి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ,ఏ వ్యక్తి అయినా సమాజమైన అభివృద్ధి చెందాలంటే అది విద్యతోనే సాధ్యమౌతుందని విద్యకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ విద్యా రంగంలో అనేక సంస్కరణలకు నాంది పలికిన వ్యక్తి జనాబ్ మౌలానా అబుల్ కలాం ఆజాద్ అని,వారిని ఆదర్శంగా తీసుకొని నేటి యువత ముందుకు పోవాల్సిన అవసరం ఉందన్నారు.అత్యంత శక్తి వంతమైన ఆయుధం విద్య అని అన్నారు.నేడు ప్రకాశం జిల్లాను వెనుకబడిన జిల్లాగా చెప్పబడుచున్నదని,జిల్లాలో అక్ష్యరస్యతా శాతం 62 శాతం మాత్రమేనని,దాన్ని 100 శాతం సాధించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయడంతో పాటు తమ పిల్లలను కచ్చితంగా డిగ్రీ వరకు చదివించాల్సిన అవసరం ఉందన్నారు.జిల్లాలో బాల్య వివాహాలు ఎక్కువగా జరుగుచున్నాయని,వాటిని అరికట్టాల్సిన భాద్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. బంగారు బాల్యం కార్యక్రమం ద్వారా జిల్లా యంత్రాంగం బాలికల విద్య పై ప్రత్యేక దృష్టి సారించడం జరుగుచున్నదన్నారు.బాల్య వివాహాల రహిత ప్రకాశంజిల్లా లక్ష్యంతో విద్యకు అత్యంత ప్రాధ్యాన్యత ఇస్తూ సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనకు కృషి చేయడం జరుగుతుందన్నారు.నేడు రాష్ట్ర ప్రభుత్వం విద్యా ప్రమాణాలు మేరుగుపర్చేలా విద్య రంగంలో అనేక సంస్కరణలు తీసుకొస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. విద్య రంగ అభివృద్ధికి అనేక కార్యక్రమాలను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్నదని,వాటిని సద్వినియోగం చేసుకొని తమ పిల్లలను డిగ్రీ వరకు చదివించాల్సిన బాధ్యత ప్రతి తల్లిదండ్రులపై ఉందన్నారు. ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులు రెడ్డి మాట్లాడుతూ,11 సంవత్సరాల పాటు విద్యా శాఖా మంత్రిగా పనిచేసి విద్యారంగ అభివృద్ధి కి అనేక సంస్కరణలు తీసుకొచ్చిన మహనీయులు జనాబ్ మౌలానా అబుల్ కలాం ఆజాద్ అని,వారి జయంతిని పురస్కరించుకొని జాతీయ విద్యా దినోత్సవాన్ని జరుపుకోవడం జరుగుచున్నదన్నారు.వారిని ఆదర్శంగా తీసుకొని వారి సూచనలు,ఆశయాలను నేరవేర్చేలా ప్రతి ఒక్కరూ ఆయన అడుగుజాడల్లో నడవాలన్నారు.ఒంగోలు నగర మేయర్ గంగాడ సుజాత మాట్లాడుతూ భారత స్వాత్రంత్య ఉద్యమంలో చురుకుగా పాల్గొని మహాత్మాగాంధీ అడుగుజాడల్లో నడిచిన గొప్ప వ్యక్తి జనాబ్ మౌలానా అబుల్ కలాం ఆజాద్ ఆ ని అన్నారు. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత విద్యా శాఖామంత్రి గా పదవి చేపట్టిన తరువాత,మనిషి తలరాతను మార్చే శక్తి విద్య వల్లనే సాధ్యమౌతుందని భావించి విద్యా రంగంలో అనేక సంస్కరణలు తీసుకొచ్చిన మహనీయులు జనాబ్ మౌలానా అబుల్ కలాం ఆజాద్ అని అన్నారు. వారి కృషిని, ఔనత్యాన్ని భావితరాలకు తెలియచేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు.ఈ కార్యక్రమంలో కపిల్ భాషా, అనీఫ్ ఖాన్,షేక్ సైదా,ఖలీల్ తుల్లా భాషా,గౌస్, పాదర్ పాల్ తదితరులు పాల్గొని ప్రసంగించారు.జనాబ్ మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి సందర్భముగా మైనారిటీల సంక్షేమ జాతీయ విద్యా దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన బండ్లమిట్ట ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉర్దూ పాఠశాల విద్యార్ధులకు బహుమతులు అందచేసారు. ఆర్ టి సిలో పనిచేస్తూ మైనారిటీల అబివృద్ధికి కృషి చేసిన ఎస్.కె సర్దార్ ని,ఉర్దూ గ్రేడ్ 1 పండిట్ మహబూబ్ జాన్ ను సన్మానించారు.ముందుగా పాత మార్కెట్ సెంటర్, సెయింట్ థెరిస్సా చర్చి ఎదురుగా వున్న జనాబ్ మౌలానా అబుల్ కలాం ఆజాద్ విగ్రహానికి జిల్లా కలెక్టర్ శతమీమ్ అన్సారియా, ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులు రెడ్డి, ఒంగోలు నగర మేయర్ గంగాడ సుజాత, అధికారులు పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు.ఈ కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ శాఖ డిడి లక్ష్మా నాయక్, బిసి వెల్ఫేర్ అధికారి అంజల,జిల్లా మైనారిటీ వెల్ఫేర్ అధికారి నారాయణ,ఒంగోలు మునిసిపల్ కమీషనర్ వెంకటేశ్వర రావు,మైనారిటీ నాయకులు,ప్రజలు, విద్యార్ధులు తదితరులు పాల్గొన్నారు.

# జనాభా ప్రాతిపదిక రిజర్వేషన్లతోనే యువతకు ఊతం

### ఉన్న రిజర్వేషన్లను చీల్చడం కాదు - జనాభా ప్రాతిపదికన పెంచాలి

### ఆంధ్రప్రదేశ్ లో ముఖ్యమంత్రి కులగణన జరపాలి -దళిత నేత నీలం నాగేంద్రరావు డిమాండ్

**ఒంగోలు పెన్ పవర్ నవంబర్ 11**

ఆంధ్రప్రదేశ్లో కూడా కులగణన జరపాలని దళిత హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు నీలం నాగేంద్రరావు డిమాండ్ చేశారు. సోమవారం ఒంగోలులోని తన కార్యాలయంలో నీలం నాగేంద్ర మీడియాతో మాట్లాడారు.ఈ సందర్భంగా నాగేంద్ర మాట్లాడుతూ, నవంబర్ 6 నుంచి తెలంగాణలో కుల గణన జరగటం అభినందనీయమన్నారు. బ్రిటీష్ ప్రభుత్వం అధికారంలో ఉండగా 1931లో కుల గణన చేపట్టారన్నారని స్వాతంత్రం వచ్చాక ప్రతి పది సంవత్సరాలకు ఒక సారి జనగణన చేస్తూ వచ్చారన్నారు.ఎస్సీ ఎస్టీ బీసీ ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లకు జనగణన కాదని ప్రాతిపదిక కారాదన్నారు.జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లను అమలు చేయడం ద్వారా దేశంలో విద్య, సాంకేతిక రంగాలలో విపరీతమైన అభివృద్ధి చోటు చేసుకుంటుందని నాగేంద్ర అభిప్రాయపడ్డారు.కులం లేని పాశ్చాత్య దేశాల్లో ప్రతి ఒక్కరికి అవకాశం కల్పించడం ద్వారా,దేశాభివృద్ధిలో ప్రజల్ని భాగస్తుల్ని చేస్తున్నారన్నారు. భారతదేశంలో కులం కారణంగా వందల ఏళ్లుగా కొనసాగుతున్న అసమానతలను రూపుమాపడానికి ఇప్పుడున్న రిజర్వేషన్ వ్యవస్థ సరైన పరిష్కారం కాదన్నారు. ఎస్సీలకు 1950లో రిజర్వేషన్లు ఇస్తే, బీసీలకు 1970 నుంచి రిజర్వేషన్లు అమలు చేశారన్నారు. 1970లో బీసీలకు 25 శాతం రిజర్వేషన్లు యిచ్చినప్పుడు బీసీ జాబితాలో కేవలం 93 కులాలు మాత్రమే ఉన్నాయని, 2024 నాటికి బీసీ కులాల సంఖ్య 139కి చేరినా, రిజర్వేషన్ల శాతం పెరగలేదన్నారు.బీసీ రిజర్వేషన్లను పెంచకపోవడం బీసీ కులాలను మోసగించడమే అన్నారు.



ఎస్సీ ఎస్టీల కన్నా కూడా బీసీల్లోని సంచార కులాలు అత్యంత వెనుకబడి ఉన్నాయన్నారు.కేంద్ర ప్రభుత్వం సంచార కులాలను గుర్తించినప్పటికీ వాటి అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక తీసుకోలేదన్నారు. తెలుగుదేశం పార్టీ బీసీల పార్టీ అని చెప్తుంటారని,1983లో పుట్టిన తెలుగుదేశం పార్టీ బీసీలకు ఒక్క శాతం కూడా రిజర్వేషన్ పెంచలేదన్నారు. ఎస్సీ ల వర్గీకరణకు కమిషన్ వేస్తానంటున్న చంద్రబాబుకు బీసీల పట్ల చిత్తశుద్ధి ఉంటే కుల గణనపై ప్రకటన చేయాలన్నారు.ఎస్సీ ఎస్టీల జనాభాకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం వద్ద ఖచ్చితమైన సమాచారం లేదన్నారు. జనగణన కోసం సెన్సస్ ఎన్యూమరేటర్లు ఎస్సీ నా,ఎస్టీ నా అని విచారిస్తున్నారే తప్ప, 'మాల'మాదిగ'అని కులాల వారి డేటా నమోదు చేసుకోలేదన్నారు.సెన్సెస్ ఎన్యూమరేటర్లుగా పనిచేసిన టీచర్లకు ప్రభుత్వ ఉద్యోగులకు ఈ విషయం తెలుసన్నారు. జనాభా ప్రాతిపదికన షెడ్యూల్డ్ కులాలకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని 2015లో తెలుగుదేశం ప్రభుత్వం 25వ నెంబర్ జీఓ జారీ చేసిందన్నారు.ఈ జీఓలో, జిల్లాల వారీగా ఏఏ కులాల సంఖ్య ఎంత అనే సమాచారం ఇచ్చారని,ఈ సమాచారం బోగస్ అన్నారు.షెడ్యూల్డ్ కులాలను వంచించేందుకు చంద్రబాబు ప్రభుత్వం ఆడుతున్న డ్రామాలో భాగంగానే తేదీ 01-05-2015న 25వ నంబర్ జీఓ జారీ అయిందన్నారు. భారతదేశంలో ప్రత్యేకించి ఆంధ్రప్రదేశ్లో ఏ కులం జనాభా ఎంతో ఏ రోజైనా సర్వే చేశారా అని నాగేంద్ర ప్రశ్నించారు. సర్వే చేయకుండానే, సమాచారం లేకుండానే మాల కులం జనాభాను,మాదిగ కులం జనాభాను,ఇతర కులాల జనాభాను ఎలా నిర్ణయిస్తారని నాగేంద్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.దేశంలో అగ్రకులాల జనాభా ఎంతో ఎవరికీ తెలియదని,వీరిలో పేదల సంఖ్య ఎంత అనే సమాచారం ప్రభుత్వం వద్ద కూడా లేదని,కానీ మోడీ ప్రభుత్వం అగ్రకులాల్లోని పేదలకు ఈ డబ్ల్యు ఎస్ పేరుతో 10 శాతం రిజర్వేషన్ కట్టబెట్టిందన్నారు.రిజర్వేషన్ల శాతం 50 కి మించకూడదని సుప్రీంకోర్టు పదే పదే చెప్పి, అగ్రకులాలకు ఈడబ్ల్యూఎస్ పేరుతో 10 శాతం రిజర్వేషన్లు ఇవ్వటాన్ని సమర్థించటాన్ని దేశంలోని మెజార్టీ ప్రజలు అగ్ర కుల పక్షపాతంగానే చూశారన్నారు.భారతరత్న డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ అన్నట్టుగా కుల నిర్మూలన జరిగితేనే,దేశంలో యువతకు విశాలమైన అవకాశాలు సాధ్యమన్నారు.జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు అమలు చేయడం ద్వారా అన్ని వర్గాల్లోని యువతకు సమాన అవకాశాలు ఇవ్వటం సాధ్యమవుతుందన్నారు.ఈ దేశంలో కులం మతం ఉండాలని కోరుకునే కులతత్వ మతతత్వ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కులగణనకు అంగీకరించేలా ప్రజలు ఒత్తిడి పెంచాలన్నారు.

## పొదిలిలో చురుగ్గా జరుగుతున్న తెలుగుదేశం సభ్యత్వ నమోదు కార్యక్రమం





**పొదిలి, పెన్ పవర్ నవంబర్ 11**

రాష్ట్ర తెలుగుదేశం పార్టీ ఆదేశాల మేరకు జరుగుతున్న తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం పొదిలిలో చురుగ్గా సాగుతోంది మండల దేశం పార్టీ నాయకులు ఉత్సాహంగా పాల్గొంటూ, పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని మరింత ముందుకు తీసుకుని పోతున్నారు అలాగే మండల స్థాయి దేశం నాయకులు పొదిలి పట్టణ మరియు మండలంలోని గ్రామాల్లో పర్యటిస్తూ ఇంటింటికి వెళ్లి రాష్ట్రంలోని తెలుగుదేశ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తూ, వారిని పార్టీ వైపు ఆకర్షించే విధంగా గట్టి కృషి చేస్తున్నారు అలాగే మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు మీగడ ఓబుల్ రెడ్డి, పట్టణ శాఖ దేశం పార్టీ అధ్యక్షులు ముల్లా కుద్దూస్, మాజీ ఎంపీటీసీ డాక్టర్ సయ్యద్ ఇమామ్ సా, షేక్ మస్తాన్, షేక్ రసూల్, ఎస్ యాసిన్ తదితరులు కూడా పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో అత్యంత ఉత్సాహంగా పాల్గొంటూ, రాత్రి పగలు తేడా లేకుండా పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొంటున్నారు మండల స్థాయి తెలుగుదేశం పార్టీ నాయకుల కృషి వల్ల పొదిలి పట్టణ మరియు మండల స్థాయిలో తెలుగుదేశం సభ్యత్వ నమోదు కార్యక్రమం అత్యంత ఉత్సాహంగా సాగుతోంది.

## హెడ్ కానిస్టేబుల్ కోమిటినేని విజయ్ మృతి బాధాకరం

**ఒంగోలు పెన్ పవర్ నవంబర్ 11**

ఒంగోలులో పనిచేస్తున్న హెడ్ కానిస్టేబుల్ కోమటినేని విజయ్ కృష్ణ మృతి చెందటం చాలా బాధాకరమని ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ రావు ఒక ప్రకటన లో తెలియజేసారు.వైసీపీ అధికారం లో వున్నపుడు వారి అరాచకాలను నీలదీచినందుకు వెనకాడ లేదని,గత ప్రభుత్వం పోలీసులు నివేదించిన విషయంలో గత ప్రభుత్వానికి బుద్ధి చెప్పేలా ప్రశ్నించారని గుర్తు చేసుకున్నారు.వారి కుటుంబ సభ్యులకు ప్రగాడ సానుభూతిని తెలిపుతు ఆ కుటుంబానికి అండగా ఉంటామని తెలిపారు.




# రెడ్ క్రాస్ కు భారీ విరాళం అందించిన విశ్రాంత ఉపాధ్యాయ దంపతులు

### అభినందించిన ఆర్డీఓ వంశీకృష్ణ

**కావలి పవర్ నవంబర్ 11**

త్వరలో ప్రారంభం కానున్న రెడ్ క్రాస్ తలసేమియా ఆసుపత్రి నిర్వహణ కొరకు విశ్రాంత ప్రధానోపాధ్యాయులు యాలమూరి కొండారెడ్డి, ఆయన భార్య, విశ్రాంత ఉపాధ్యాయిని అరుణ భారతీదేవి కలసి ఒక లక్ష ఇరవై ఆరు వేల రూపాయలు విరాళం రెడ్ క్రాస్ అధ్యక్షులు, ఆర్డీఓ యం సన్నీ వంశీకృష్ణ కు అందజేశారు. ఈ సందర్బంగా దాత కొండారెడ్డి మాట్లాడుతూ, కావలి లాంటి చిన్న పట్టణంలో తలసేమియా ఆసుపత్రి నిర్మాణం హర్షణీయం అని, ఇటీవల ఆసుపత్రి ఏర్పాటుకు దాతలు సహకరించాలన్న ఆర్డీఓ వంశీకృష్ణ పిలుపు మేరకు స్పందించి తమ దంపతుల ఉద్యోగవిరమణ ప్రయోజన మొత్తం నుండి విరాళం అందించినట్లు తెలిపారు. ఆర్డీఓ వంశీకృష్ణ దాత కొండారెడ్డిని ఘనంగా సత్కరించారు. అనంతరం ఆర్డీఓ మాట్లాడుతూ, కావలి తలసేమియా ఆసుపత్రిని దేశంలోనే ఆదర్శ కేంద్రంగా తీర్చిదిద్దుతామని, దాతలు ముందుకు వచ్చి తలసేమియా బాధిత బాలలకు ప్రాణాలను కాపాడాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రెడ్ చైర్మన్ డి రవిప్రకాష్, కోశాధికారి కలికి శ్రీహరి రెడ్డి, తలసేమియా కేంద్రం కన్వీనర్ కె హరినారప రెడ్డి, రెడ్ క్రాస్ పరిపాలనాధికారి బి యస్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.




# ప్రజల ఆర్జీలకు సత్వరమే పరిష్కారం చూపాలి

## కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా







**ఒంగోలు పెన్ పవర్ నవంబర్ 11**

సోమవారం ఒంగోలు కలెక్టరేట్ లోని మీ కోసం సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రసెల్సిస్టం, పిజిఆర్ఎస్ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా, జాయింట్ కలెక్టర్ఆర్ గోపాల క్రిష్ణ, స్పెషల్ డిప్యూటీకలెక్టర్లు లోకేశ్వర రావు, వరకుమార్ల తో కలసి పాల్గొని ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన అర్జీలపై జిల్లా అధికారులు తక్షణమే స్పందించి,సకాలంలో నాణ్యమైన పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ ఏ. తమీమ్ అన్సారియా,జిల్లా అధికారులను ఆదేశించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా మాట్లాడుతూ, జిల్లా లోని సుదూర ప్రాంతాల నుండి తమ సమస్యలు పరిష్కారం అవుతాయని ఎంతో ఆశతో అర్జీదారులు వస్తారని,వచ్చిన సమస్యలను అర్జీదారుడు సంతృప్తిచెందేలా సమస్యలను నిర్ణీత గడువులోపు పరిష్కరించాలని అన్ని శాఖల అధికారులను ఆదేశించారు.ఎట్టి పరిస్థితుల్లోను బియాండ్ ఎస్ఎల్ఏ లేకుండా నిర్ణీత గడువు లోపు అర్జీల పరిష్కారతీరు ఉండాలన్నారు.అర్జీదారుల సమస్యలను పరిష్కరించడంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ఫిర్యాదుదారుల విజ్ఞప్తులను సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా విచారణ చేసి అర్జీ దారుడు సంతృప్తి చెందేలా నిర్ణీత గడువులోపు పరిష్కరించాలన్నారు.అర్జీలు పెండింగ్, రీ ఓపెనింగ్ లేకుండా చూడాలన్నారు.జిల్లా అధికారులు వారి సిబ్బంది ప్రజా సమస్యల పరిష్కారంలో అలసత్వం ప్రదర్శిస్తే ఉపేక్షించబోనని హెచ్చరించారు.ప్రజా సమస్యలపై సత్వరమే స్పందించి క్షేత్రస్థాయిలో అర్జీదారులు ఎదుర్కొంటున్న అంశాలపై ప్రత్యేక దృష్టి సారించి సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు.ఈకార్యక్రమంలో 269 వినతులు వచ్చాయన్నారు.ఈ నెల 14వ తేదీ నుంచి 20వ తేదీ వరకు నిర్వహించనున్న 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలపై జిల్లా గ్రంథాలయ సంస్థ ప్రచురించిన వాల్ పోస్టర్స్ క్యాన్సర్ నివారణకు తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలపై వైద్య ఆరోగ్య శాఖ ప్రచురించిన వాల్ పోస్టర్స్ ను జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా, సంబంధిత అధికారులతో కలిసి ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో బి.చిరంజీవి,జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ పిడి వసుంధర, డ్వామా పిడి జోసఫ్ కుమార్,ఐసిడిఎస్ పిడి మాధురి,డిపిఓవెంకట నాయుడు, డిఎం అండ్ హెచ్ఓ డా. సురేష్ కుమార్, పశుసంవర్ధక శాఖ జెడి డా. బేబి రాణి, సిపిఓ వేంకటేశ్వర రావు,జిల్లా రిజిస్ట్రార్ బాలాంజనేయులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## జేసిఐ ఒంగోలు జేఏసీ చైర్మన్‌గా వెన్నపూస శ్రీరాములు రెడ్డి



**ఒంగోలు పెన్ పవర్ నవంబర్ 11**

జేసీఐ ఒంగోలు జేఏసీ చైర్మన్ గా 2025 సంవత్సరానికి శ్రీరామ్ హైస్కూల్ కరస్పాండెంట్ జేసి వెన్నపూస శ్రీరాములు రెడ్డి ఎంపికయ్యారు.స్థానిక సత్యనారాయణపురంలోని ఆంధ్ర హైస్కూల్లో జరిగిన ఎన్నికలలో ఆయన ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జేసిఐ ఒంగోలు జేఏసీ చైర్మన్ గా ఎంపిక కావటం చాలా ఆనందంగా ఉందని మరిన్ని కార్యక్రమాలు చేసి జేఏసీ ని ఒంగోలు నగరంలో అందరికీ ఉపయోగపడేలా చేస్తానని తెలిపారు.ఈ సందర్భంగా జేసిఐ ఒంగోలు పూర్వ అధ్యక్షులు జేఏసీ మెంబర్స్ ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో జెసిఐ పూర్వ జాతీయ అధ్యక్షులు నైనాల రామకృష్ణ జేసిఐ జోన్ చైర్మన్ జెసి గోపి కిషోర్, రీజనల్ చైర్మన్ ఆత్మకూరు బ్రహ్మయ్య,ట్రెజరర్ నందకుమార్,విజేత రమణ, సోమినేని సురేష్ ,నామినేని మోహన్ రావు,దాసరి కృష్ణారావు,శేఖర్ బాబు, అద్దంకి శ్రీనివాసరావు,ఆంధ్ర శ్రీనివాసరావు, జేసిఐ ఒంగోలు 2025 అధ్యక్షుడు జె సి ఎం వి సుబ్బారావు, గంధవల్ల బాలకృష్ణ,వరుణ్ కుమార్ తదితరులు పాల్గొని అభినందించారు.

# విద్యార్థులు క్రీడల పట్ల మక్కువ పెంచుకోవాలి

# బాలబాలికల్లో క్రీడా ప్రతిభను వెలికి తీయాలి

## జిల్లా ఎస్పీ ఏఆర్ దామోదర్

**ఒంగోలు పెన్ పవర్ నవంబర్ 11**

అండర్-11 బాలబాలికలకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మినీ బాడ్మింటన్ ఛాంపియన్ షిప్ -2024 పోటీలు 11 సంవత్సరాల వయస్సు లోపుగల బాలబాలికలకు ప్రకాశం జిల్లా బాడ్మింటన్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో ఒంగోలులోని లార్డ్ కృష్ణ బాడ్మింటన్ అకాడమీలో సోమవారం జిల్లా ఎస్పీ ఏ ఆర్ దామోదర్ ప్రారంభించారు. విద్యార్థి దశ నుంచే క్రీడల్లో రాణించి ఉన్నత స్థానాలను అధిరోహించాలని ఎస్పీ తెలిపారు.జిల్లా ఎస్పీ కొంతసేపు.జిల్లా ఎస్పీ క్రీడాకారులతో బాడ్మింటన్ ఆడి వారిని ఉత్సాహపరిచారు.ఈ ఛాంపియన్షిప్ లో ప్రకాశం, ఈస్ట్ గోదావరి, గుంటూరు, అనంతపురం, చిత్తూరు, కృష్ణ, కడప,కర్నూల్, నెల్లూరు, శ్రీకాకుళం, విజయవాడ, వెస్ట్ గోదావరి, విశాఖపట్నం జిల్లాల నుండి బాలబాలికలు పాల్గొననున్నారు.ఇక్కడ గెలుపొందిన వారు నేషనల్ స్థాయిలో పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ బాలబాలికల్లో క్రీడా ప్రతిభను వెలికి తీయడానికి ఈ ఛాంపియన్ షిప్ ఎంతోగాను దోహద పడుతుందన్నారు. పిల్లల్లో ఫిజికల్ ఫిట్‌నెస్ కోసం తల్లిదండ్రులు క్రీడలను ప్రోత్సహించాలన్నారు. క్రీడల్లో ప్రావీణ్యత సాధించేందుకు తల్లిదండ్రులు వారి పిల్లల్లో దాగి ఉన్న క్రీడా కౌశల్యాన్ని వెలికితీసేందుకు కృషి చేయాలని,క్రీడల్లో వారిని ప్రోత్సహిస్తే భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను చేరుకుంటారన్నారు. బాల్యదశ నుండి ఆటలు ఆడటం, వ్యాయామాలు చేయుట వలన శారీరక దృఢత్వం,మానసిక ఉల్లాసం చేకూరుతుందని, అనేక ఆరోగ్య సమస్యలు రాకుండా శరీరంలో రోగ నిరోధక శక్తిని పెంచుతాయన్నారు.క్రీడల్లో గెలుపోటములు సహజమని, ఆటలు ఓటమిని భరించే శక్తిని,కష్టాన్ని ఎదుర్కొనే ధైర్యాన్ని ఇస్తాయన్నారు. చిన్నారులు క్రమశిక్షణతో మెలగాలని,నిత్యము నేర్చుకునే తత్వాన్ని , పోటీతత్వాన్ని క్రీడా స్ఫూర్తిని పెంపొందించుకోవాలని, తల్లిదండ్రుల, గురువుల మాటలు చక్కగా వింటూ బాగా చదువుకోని ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఎస్పీ ఆకాంక్షించారు.ఈ ఛాంపియన్ షిప్ లో ప్రథమ స్థానంలో నిలిచిన వారికి రూ. 2వేలు , ద్వితీయ స్థానంలో నిలిచిన వారికీ వెయ్యి చొప్పున పోలీస్ శాఖ తరుపున నగదు ప్రోత్సాహకం అందిస్తామని జిల్లా ఎస్పీ తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎస్బి ఇన్స్పెక్టర్ కె.వి.రాఘవేంద్ర, ఒంగోలు తాలూకా సిఐ అజయ్ కుమార్,ఏపీ బాడ్మింటన్ సెక్రటరి అంకమ్మ చౌదరి,ఏపీబిఏ ప్రెసిడెంట్ ద్వారకానాథ్,ప్రకాశం జిల్లా అసోసియేషన్ చైర్మన్ అద్దంకి మురళి కృష్ణ,లార్డ్ కృష్ణ బాడ్మింటన్ అకాడమీ చైర్మన్ శిద్ధా సుధీర్ కుమార్,కోచ్ లు క్రీడాకారులు పాల్గొన్నారు.






# ప్రజా సమస్యల పరిష్కార వేదిక" (పి.జి.ఆర్.ఎస్) కార్యక్రమాన్ని నిర్వహించిన జిల్లా ఎస్పీ తుషార్ డూడి

## సమస్యలు వెల్లబుచ్చుకున్న 37 మంది అర్జీ దారులు

## అర్జీలు పునరావృతం కాకుండా శాశ్వత పరిష్కారం చూపాలి -జిల్లా ఎస్పీ తుషార్ డూడి

**పెన్ పవర్ స్టాఫ్ రిపోర్టర్ బాపట్ల నవంబర్ 11**

అర్జీలు పునరావృతం కాకుండా శాశ్వత పరిష్కారం చూపాలని జిల్లా ఎస్పీ తుషార్ డూడి పోలీస్ అధికారులను ఆదేశించారు. నవంబర్ 11న సోమవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని జిల్లా ఎస్పీ నిర్వహించారు. తమ సమస్యలను వెల్లబుచ్చుకోవడానికి జిల్లా పోలీస్ కార్యాలయానికి వచ్చిన అర్జీదారుల సమస్యలను ఎస్పీ స్వయంగా విని, వారు ఇచ్చిన అర్జీలను పరిశీలించారు. సంబంధిత పోలీసు అధికారులతో ఫోన్లో మాట్లాడి అర్జీదారుల సమస్యలను చట్ట పరిధిలో విచారించి నిర్ణీత గడువులోగా పరిష్కారం చూపాలన్నారు. వివిధ సమస్యలతో పోలీస్ కార్యాలయాలకు వచ్చే బాధితులకు భరోసాగా పోలీస్ శాఖ ఉండాలన్నారు. వారి సమస్యలను చట్ట పరిధిలో విచారించి పరిష్కారం చూపాలన్నారు. అర్జీలు మరల మరల పునరావృతం కాకుండా పూర్తి స్థాయిలో విచారించి శాశ్వతంగా పరిష్కారం చూపాలని ఎస్పీ పోలీస్ అధికారులను ఆదేశించారు. ఈరోజు నిర్వహించిన "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" కార్యక్రమంలో కుటుంబ కలహాలు, అత్తారింటి వేధింపులు, ఆస్థి తగాదాలు, భూ వివాదాలు, ఆర్థిక లావాదేవీ మోసాలు, ఇతర పలు సమస్యలతో మొత్తం 37 మంది అర్జీలను అందజేసినారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ టి.పి.విఠలేశ్వర్, పి.జి.ఆర్.ఎస్ ఇంచార్జ్ సీఐ శ్రీనివాసరావు ఇతర అధికారులు పాల్గొన్నారు.







# రాజకీయాలపై జనసేనాని పట్టు



**విజయవాడ, నవంబర్ 11, పెన్ పవర్:** ఒకటి మాత్రం నిజం.. ఏపీ పాలిటిక్స్ ను దగ్గర నుంచి పరిశీలించిన వారికి ఇప్పుడు ఒక విషయం స్పష్టంగా తెలుస్తుంది. అదే జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఉంటేనే పాలిటిక్స్ ఉంటాయి. లేదంటే లేదు అన్నట్లుగా ఏపీ రాజకీయాలు నడుస్తున్నాయి. ఇటు అధికార పక్షం గాని, అటు విపక్షం గాని పవన్ నామస్మరణ లేకుండా మాత్రం పూట గడవటం లేదు. పవన్ కల్యాణ్ ఇప్పుడు ఏపీ పాలిటిక్స్ లో నెంబర్ వన్ గా నిలిచారంటే వినేవాళ్లకు అతిశయోక్తి అనిపించొచ్చు గాని.. ఆయన చేతుల మీదుగానే రాజకీయాలు నడుస్తున్నాయన్నది వాస్తవం. ఆయనతో గొడవలు పెట్టుకుంటే లాస్ అయ్యేది తమదేనన్న భావన మిగిలిన రాజకీయ పార్టీల నేతలకు బలంగా పడిపోయింది. జనసేన అధినేత పవన్ కల్యాణ్ మళ్లీ ఎన్నికలకు ముందు తరహా రాజకీయాలను ప్రారంభించినట్లే కనపడుతుంది. ఫుల్లు ఎఫెన్స్ లో కనపడుతున్నారు. నిన్నటి వరకూ తన పని ఏదో తాను చూసుకుంటూ పవన్ కల్యాణ్ పెద్దగా బయటకు కనిపించలేదు. ఆయన తనకు కేటాయించిన శాఖలపై ప్రత్యేక దృష్టి పెట్టారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, అటవీశాఖలను ఆయన పూర్తిగా అధ్యయనం చేశారు. అధికారులతో సమీక్షలు, ఉత్తర్వులకే పరిమితమైన పవన్ కల్యాణ్ నేడు గ్రౌండ్ లోకి ఎంటర్ అయ్యారు. వచ్చీ రావడంతోనే ఇటు కూటమి ప్రభుత్వంపైనా, అటు విపక్షంపైనా విరుచుకుపడుతూ వెళ్లడం దేనికి సంకేతం అన్న చర్చ జరుగుతుంది. ఏడాది క్రితం వరకూ పవన్ కల్యాణ్ ను ఎవరూ పెద్దగా కేర్ చేసే వారు కాదు. వైసీపీ అప్పట్లో అధికారంలో ఉన్నప్పుడు పవన్ పై ఘటు విమర్శలు చేసేది. వ్యక్తిగత విమర్శలకు కూడా దిగేది. కానీ పవన్ నుంచి మౌనమే సమాధానమయ్యేది. ఇటు టీడీపీ నుంచి కూడా కొందరు నేతలు అడిగిన సీట్లు ఎందుకిస్తాం? బలహీనమైన పార్టీకి అన్ని స్థానాలు అవసరమా? అని వెటకారం చేసిన వాళ్లు కూడా లేకపోలేదు. అన్నింటినీ సహించిన, ఓర్పు వహించిన పవన్ కల్యాణ్ సమయం కోసం వేచిచూశారు. అదే టీడీపీకి తన అవసరమేంటో చెప్పకనే తెలియజెప్పారు. రాజమండ్రి జైలు ఆవరణ బయట నుంచే పొత్తు ప్రకటన చేసి సంచలనం సృష్టించారు. ఇప్పుడు పవన్ కల్యాణ్ ను తక్కువగా చూసిన పార్టీలు కూడా ఆయనను పొలిటికల్ గాడ్ చూడటం ప్రారంభమయింది. 2019 ఎన్నికల్లో ఒక్క సీటుతో సరిపెట్టుకుని, రెండు స్థానాలలో పోటీ చేసి ఓడిపోయిన పవన్ కల్యాణ్ అదే 2024 ఎన్నికలకు వచ్చేసరికి సీన్ మొత్తం మార్చేశారు. 21 అసెంబ్లీ స్థానాలు, రెండు పార్లమెంటు స్థానాల్లో పోటీ చేసి హండ్రెడ్ పర్సెంట్ స్ట్రయిక్ రేట్ సాధించారు. దీంతో పవన్ ఇమేజ్ అమాంతం పెరిగిపోయింది. పవన్ లేనిదే గెలుపు లేదన్నది మొన్నటి ఎన్నికల్లో స్పష్టంగా తెలిసింది. దీంతో పవన్ కల్యాణ్ తోడు ఉంటే చాలు అన్న సీన్ ను రాజకీయాల్లో క్రియేట్ చేయగలిగారు. దీంతో పవన్ కు పాలిటిక్స్ లో ప్రాధాన్యత పెరిగింది. ఇక పిఠాపురం నియోజకవర్గం పర్యటన తర్వా పల్నాడు ప్రాంతానికి పవన్ కల్యాణ్ చేరుకున్నారు. అక్కడ వైసీపీ అధినేత వైఎస్ జగన్ కు సంబంధించిన సరస్వతీ పవర్ భూములను సందర్శించారు. రైతులతో ముఖాముఖి మాట్లాడారు. అన్యాక్రాంతమైన భూముల విషయాలను పవన్ ప్రస్తావించారు. పేదల భూములను జగన్ బలవంతంగా సొంతం చేసుకున్నారంటూ మండిపడ్డారు. జగన్ సీఎం అయిన తర్వాత ఈ కంపెనీకి భూముల లీజును యాభై ఏళ్ల పాటు పొడిగించుకున్నారన్నారు. కోడెల శివప్రసాద్ ను ఫర్నిచర్ కోసం వేధించి నాటి ప్రభుత్వం చంపేసిందంటూ పల్నాడు పర్యటనలో వ్యాఖ్యానించారు. భూములు లాక్కున్న వారికి సరస్వతీ పవర్స్ లో ఉద్యోగాలు ఇవ్వాల్సిందేనంటూ రైతుల వద్ద ఆయన డిమాండ్ చేశారు. డిప్యూటీ చీఫ్ మినిస్టర్ గా ఉన్న పవన్ కల్యాణ్ ఇలా ఆవేశంగా మాట్లాడటం.. తన, తరతమ బేధల్లేకుండా మాట్లాడుతుండటం రాజకీయంగా చర్చకు దారితీసింది. అసలు పవన్ కల్యాణ్ మనస్సులో ఏముందన్నది ఎవరికీ అర్థం కావడం లేదు. ఢిల్లీ నుంచి ఏదైనా సిగ్నల్స్ అందాయా? అన్న చర్చకూడా ఏపీ పాలిటిక్స్ లో జరుగుతుంది. పవన్ కల్యాణ్ ఇన్నాళ్లు మౌనంగా ఉండి, చంద్రబాబు నాయుడుపై ప్రశంసలు కురిపించి కొంచెం ఇమేజ్ తగ్గడంతో తిరిగి దానిని పొందేందుకు ప్రయత్నిస్తున్నారా? అన్న అనుమానం కూడా లేకపోలేదు. పవన్ కల్యాణ్ కు కోపమొచ్చినా, ఒక మాట అనినా ఆయనను బుజ్జగించేందుకే అధికార పార్టీ తంటాలు పడుతుంది. ఆయన ఆవేశంతో అన్న మాటలుగా భావించినప్పటికీ, ఆయనను సర్దుబాటు చేసే ప్రయత్నాలను ఎప్పటికప్పుడు చేస్తుంది. అందుకే నలభై ఐదేళ్ల రాజకీయ అనుభవం ఉన్న చంద్రబాబు సయితం పవన్ కు ఎనలేని ప్రాధాన్యత ఇస్తున్నారు. పవన్ వ్యాఖ్యలను పెద్దగా సీరియస్ గా తీసుకోకుండా ఆయనను పిలిపించుకుని వివరణ ఇస్తున్నారంటే పవన్ కు ఏ రేంజ్ లో ప్రాముఖ్యత పెరిగిందో అర్థం చేసుకోవచ్చు. 2029 ఎన్నికల్లో తిరిగి కలసి పోటీ చేయాలన్న ఉద్దేశ్యం బలంగా ఉండటంతోనే పవన్ కు అంత ప్రాధాన్యత దక్కుతుంది. ఆయన వెనక ఉన్న ఫ్యాన్స్, కాపు సామాజికవర్గం బలం ఆయనకు మరింతగా బలవంతుడిని చేస్తుందనే చెప్పాలి.

# బూమ్ రాంగ్ అవుతున్న నిర్ణయాలు

**విజయవాడ, నవంబర్ 11, పెన్ పవర్:** వైసీపీ అధినేత వైఎస్ జగన్ లో ఓటమి తర్వాత కూడా మార్పు కనిపించడం లేదు. జగన్ నేతలను కలుపుకుని వెళ్లడంలో పెద్దగా ఆసక్తి చూపడం లేదు. అధికారంలో ఉన్నప్పుడు ఎలా ఉన్నారో ఓటమి తర్వాత కూడా అలాగే ఉన్నారు. జగన్ ఎక్కువ సమయం ఒంటరిగా ఉండటానికే ఇష్టపడుతున్నారు. ఆయన ఏదీ నేతలతో పార్టీ విషయాలను ముందుగా పంచుకునే ఉద్దేశ్యం లేనట్లే కనిపిస్తుంది. అసలు వైసీపీకి ఒక పార్టీ కార్యవర్గం ఉందా? అన్న అనుమానం కూడా కలుగుతుంది. ఏ పార్టీలోనైనా నాయకుడు పార్టీ నేతలతో చర్చించి ఒక నిర్ణయం తీసుకుంటారు. ప్రాంతీయ పార్టీల్లోనూ పొలిట్ బ్యూరోలు వంటివి ఉంటాయి. జగన్ అనుకున్నది అనుకున్నట్లే జరగాల్సిందే. జగన్ రెండు విషయాలను ఆయన సొంతంగా తీసుకున్న నిర్ణయాలను అమలు పర్చి మరొకసారి తాను ఇంతేనని నిరూపించుకున్నారు. పార్టీలో ఇది చర్చనీయాంశంగా మారింది. తలపండిన సీనియర్ నేతలు ఎందరో వైసీపీలో ఉన్నారు. రాజకీయాల్లో డక్కామొక్కీలు తిన్న నేతలు కూడా ఉన్నారు. వారందరినీ సంప్రదించి నిర్ణయాలు తీసుకునే సంప్రదాయం మాత్రం ఫ్యాన్ పార్టీలో లేదు. అదే అనేక మంది నేతలకు రాజకీయంగా ఇబ్బందిగా మారింది. పార్టీలో ఉండకపోవడానికి కూడా అదే ప్రధాన కారణంగా చూపుతున్నారు. ఏకపక్ష ధోరణితో వ్యవహరించడం జగన్ ఇంకా మానుకోవడం లేదు. జగన్ తీసుకున్న రెండు నిర్ణయాలు ఆయనలోని ఏకపక్ష వ్యవహారశైలికి అద్దం పట్టాయి. 1. ఎమ్మెల్సీ ఎన్నికల బరి నుంచి తప్పుకోవడం. 2. అసెంబ్లీ సమావేశాలను బహిష్కరించడం. తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలతో పాటు గుంటూరు, కృష్ణా జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలను వైసీపీ బహిష్కరించింది. ఎందుకు బహిష్కరించిందంటే తమ కార్యకర్తలను అక్రమంగా అరెస్ట్ చేసిందని చెప్పి తప్పుకుంది. కానీ గతంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలిచిన తర్వాతనే టీడీపీకి ఊపిరి వచ్చిందన్న విషయాన్ని వైసీ?పీ అధినేత మర్చిపోయినట్లున్నారు. ఎన్నికకు జగన్ సిద్ధంగా లేరన్న సంకేతాలు ఈ నిర్ణయంతో ఇచ్చినట్లయింది. అసెంబ్లీ ఎన్నికల్లో దారుణ పరాజయం ఎదుర్కొంది వైసిపి. దాని నుంచి గుణపాఠాలు నేర్చుకోవడం లేదు. ఇంకా జగన్ తప్పుడు అడుగులు వేస్తూనే ఉన్నారు. తాజాగా అటువంటి రెండు నిర్ణయాలు తీసుకున్నారు. పార్టీ శ్రేణుల్లో ఒక రకమైన ఆందోళన కనిపిస్తోంది వైసీపీ ఆవిర్భావం నుంచి ఎన్నడూ లేనంత క్లిష్ట పరిస్థితులను ఆ పార్టీ ఎదుర్కొంటోంది. 2014లో అధికారంలోకి రాకపోయినా బలమైన పార్టీగా పునాదులు వేసుకుంది వైసిపి. ఆ పార్టీ నుంచి 23 మంది టిడిపిలోకి ఫిరాయించినా లెక్క చేయలేదు. వెన్ను చూపలేదు. అదే దూకుడుతో ముందుకు సాగింది. అధికార పక్షం పై ఫైట్ చేసింది. అంతులేని విశ్వాసంతో 2019 ఎన్నికల్లో రెండోసారి పోటీ చేసి అధికారాన్ని అందుకుంది. కానీ 2024 ఎన్నికల్లో అధికారాన్ని పదిల పరుచుకోవాలని చూసింది. కానీ నిరాశ ఎదురయింది. దారుణ ఓటమిని మూటగట్టుకుంది. అయితే గత అనుభవాల దృష్ట్యా పోరాట బాట పట్టాల్సిన జగన్.. తీసుకుంటున్న నిర్ణయాలు మాత్రం పార్టీ శ్రేణులకు మింగుడు పడటం లేదు. రెండు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలను బహిష్కరించారు జగన్. అంతటితో ఆగకుండా శాసనసభ సమావేశాలకు హాజరు కాకూడదని నిర్ణయం తీసుకున్నారు. దీనిపై పార్టీ శ్రేణుల్లో భిన్న స్వరాలు వినిపిస్తున్నాయి. ప్రజలకు తప్పుడు సంకేతాలు వెళ్తున్నాయని ఆందోళన చెందుతున్నాయి. అధినేత తీరు మారకపోతే కష్టమని పెదవి విరుస్తున్నాయ ఇక మరో నిర్ణయం అసెంబ్లీ సమావేశాలకు దూరంగా ఉండటం. పదకొండు మంది సభ్యులున్నప్పటికీ వారితో మాట్లాడి, చర్చించి నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. 2024 శాసనసభ ఎన్నికల్లో పదకొండు మంది మాత్రమే గెలిచారు. అయినా

గెలిచిన వారి అభిప్రాయాలను కూడా పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంది. వారితో ఏమాత్రం సంప్రదించకుండా ఒక ప్రెస్ మీట్ పెట్టి తాము అసెంబ్లీ సమావేశాలకు దూరంగా ఉన్నామని ప్రకటించడం పార్టీలో చర్చనీయాంశమైంది. జగన్ ఎస్కేప్ అవుతున్నారని.. శాసనసభలో గత అనుభవాల దృష్ట్యా తనకు అవమానాలు ఎదురవుతాయని భావిస్తున్నారని.. అందుకే బహిష్కరిస్తున్నారని అధికార పార్టీ అనుకూల మీడియా ప్రచారం చేస్తోంది. ప్రజల్లోకి సైతం అది బలంగా వెళ్తోంది. వైసీపీ శ్రేణుల్లో ఆందోళనకు అదే కారణం అవుతోంది. అధినేత తీరుపై సొంత పార్టీలోనే ఆగ్రహం వ్యక్తం అవుతోంది. సిట్టింగ్ వైసీపీ ఎమ్మెల్యేలలో కూడా ఈ నిర్ణయం కొంత అసంతృప్తికి దారి తీసేలా ఉంది. కానీ జగన్ మాత్రం అధికారంలో ఉన్న తరహాలోనే వ్యవహరిస్తున్నారన్న కామెంట్స్ వినపడుతున్నాయి.

# ఏడాది తర్వాత మళ్లీ సాగర్ పై ఘర్షణ




**గుంటూరు, నవంబర్ 11, పెన్ పవర్:** ఏపీ, తెలంగాణ మధ్య మరోసారి నాగార్జున సాగర్ వివాదం నెలకొంది. తెలంగాణ అధికారులు కుడి కాల్వ వాటర్ రీడింగ్ నమోదు చేసేందుకు ప్రయత్నించగా, ఏపీ అధికారుల వారిని అడ్డుకున్నారు. దీంతో మరోసారి సాగర్ వివాదం తెరపైకి వచ్చింది. గతేడాది సరిగ్గా నవంబర్ లోనే సాగర్ పై ఘర్షణ తలెత్తింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ మధ్య మరోసారి 'నాగార్జున సాగర్ వివాదం' రాజుకుంది. గత ఏడాది సరిగ్గా నవంబర్ లో తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ రోజున నాగార్జున సాగర్ వద్ద యుద్ధ వాతావరణం నెలకొన్న సంగతి తెలిసిందే. మళ్లీ నవంబర్ లోనే సాగర్ వివాదం తెరపైకి వచ్చింది. ఈసారి కుడి కాల్వ వాటర్ రీడింగ్ నమోదు వివాదానికి దారితీసింది. వాటర్ రీడింగ్ తీసేందుకు తెలంగాణ అధికారులు ప్రయత్నించారు. వీరిని ఏపీ ఇరిగేషన్ అధికారులు అడ్డుకున్నారు. దీంతో పరిస్థితి తీవ్ర ఉద్రిక్తంగా మారింది. ఈ ఘటనపై కృష్ణా రివర్ మేనేజ్మెంట్ బోర్డు యాజమాన్యానికి తెలంగాణ అధికారులు ఫిర్యాదు చేశారు. ఈ వివాదంపై కేఆర్ఎంబీ ఇరు రాష్ట్రాల అధికారులకు సర్ది చెప్పింది. ప్రతిరోజు తెలంగాణ డ్యామ్ సిబ్బంది సాగర్ రైట్ కెనాల్ వాటర్ రీడింగ్ ను నోట్ చేసుకుంటారని తెలుస్తోంది. శనివారం కూడా తెలంగాణ అధికారులు యథావిధిగా రైట్ కెనాల్ వాటర్ రీడింగ్ కోసం వెళ్లగా...తెలంగాణ సిబ్బందిని ఏపీ డ్యామ్ సిబ్బంది అడ్డుకోవడంతో జల వివాదం మరోసారి తెరపైకి వచ్చింది. గతేడాది నవంబర్ 28న నాగార్జున సాగర్ కుడికాల్వ నుంచి నీటిని విడుదల చేయడానికి ఏపీ ఇరిగేషన్ శాఖ అధికారులు ప్రయత్నించారు. దీంతో ఏపీ, తెలంగాణ మధ్య తీవ్ర ఘర్షణ నెలకొంది. సాగర్ పదమూడు గేట్ల నుంచి ఏపీ ఇరిగేషన్ అధికారులు నీటిని విడుదల చేసేందుకు ప్రయత్నించారు. నీటి విడుదలను అడ్డుకునేందుకు తెలంగాణ పోలీసులు ప్రయత్నించగా... ఏపీ పోలీసులు వారిని అడ్డుకున్నారు. దీంతో వీరి మధ్య తీవ్ర ఘర్షణ తలెత్తింది. డ్యామ్ కు ఇరువైపులా ముళ్ల కంచెలు వేసి...కొన్ని రోజులు ఎవరినీ అనుమతించలేదు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో కేంద్ర జలశక్తి సంఘం, కేఆర్ఎంబీ అధికారులు రంగంలో దిగి పరిస్థితిని చక్కదిద్దారు. సరిగ్గా ఎన్నికల పోలింగ్ రోజున ఈ వివాదం నెలకొనడంపై అప్పట్లో అనుమానాలు తలెత్తాయి. అప్పట్లో ఏపీలో వైసీపీ, తెలంగాణ బీఆర్ఎస్ అధికారంలో ఉన్నాయి. ఇరు ప్రభుత్వాలు స్నేహపూర్వకంగా ఉన్నా జల వివాదాలు పరిష్కారం కాలేదు. 2014లో ఆంధ్రప్రదేశ్ విభజన సమయంలో... కృష్ణా, గోదావరి నదీ బోర్డులు ఏర్పాటు అయ్యాయి. అప్పట్లో శ్రీశైలం జలాశయాన్ని ఆంధ్రప్రదేశ్ కు, నాగార్జున సాగర్ ప్రాజెక్టు నిర్వహణ తెలంగాణకు కేంద్ర జల సంఘం కేటాయించింది. అయితే ఈ నిర్ణయం సరిగ్గా అమలు కాలేదు. శ్రీశైలం ప్రాజెక్టు ఎడమ విద్యుత్తు కేంద్రాన్ని తెలంగాణ నిర్వహిస్తుంది. అటుగా ఏపీ అధికారులను అనుమతించడంలేదు. అలాగే నాగార్జున సాగర్ ప్రాజెక్టులో 26 గేట్లకు 1-13 గేట్లు తెలంగాణ, 14-26 గేట్లను ఏపీ నిర్వహిస్తుంది. కుడి కాల్వ నుంచి ఏపీకి నీళ్లను తెలంగాణ అధికారులే విడుదల చేస్తున్నారు. అయితే నీళ్ల విడుదల తరచూ రెండు రాష్ట్రాల మధ్య సమస్యగా మారింది. నీటి విడుదలకు కృష్ణా బోర్డు ఆదేశాలు ఇచ్చినా తెలంగాణ అధికారులు నీళ్లు విడుదల చేయని సందర్భాలు ఉన్నాయి. ఉమ్మడి జలాశయాలను బోర్డుల పరిధిలోకి తీసుకురావాలని ఏపీ డిమాండ్ చేస్తున్న విషయం తెలిసిందే. దశాబ్దాలా తరబడి సాగర్ డ్యామ్ వివాదం నడుస్తోంది. బచావత్ ట్రిబ్యునల్ ప్రకారం తెలంగాణకు కేటాయించిన వాటా ప్రకాటం నీటిని వినియోగించుకోవడంలో తమను అన్యాయం జరుగుతోందని తెలంగాణ వాదన. ఏపీకి కేటాయించిన వాటాతో పాటు అదనంగా నీటిని తరలించుకుపోతుందని తెలంగాణ ప్రభుత్వం ఆరోపిస్తుంది. ఉమ్మడి నల్గొండ సహా హైదరాబాద్ తాగునీటికి సాగర్ డ్యామ్ కీలకం. అత్యవసర సమయంలో సాగర్ టెయిల్ పాండ్ బ్యాక్ వాటర్ నుంచి రివర్స్ పంపింగ్ ద్వారా తెలంగాణ విద్యుత్ ఉత్తత్తి చేస్తుంది. అయితే పలుమార్పు టెయిల్ పాండ్ కుడివైపు నీటిని ఏపీ ఖాళీ చేసిందనే విమర్శలు ఉన్నాయి. కృష్ణా నదీ జల వివాదాలపై 1969లో కేంద్రం బచావత్ ట్రిబ్యునల్ ను ఏర్పాటు చేసింది. ఈ ట్రిబ్యునల్ 1976 మే నెలలో తుది తీర్పు ఇచ్చింది. కృష్ణా నది బేసిన్ లో 811 టీఎంసీల నీటిని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కు కేటాయించారు. ఉమ్మడి ఏపీలో రాజారావు కమిటీ సిఫార్సుల మేరకు ఏపీ, తెలంగాణకు వేర్వేరుగా నీటి కేటాయింపుల ఒప్పందం జరిగింది. ఈ ఒప్పందం మేరకు తెలంగాణకు 293.96 టీఎంసీలు, ఏపీకి 512.04 టీఎంసీలు కేటాయించారు. ఏపీ, తెలంగాణ విభజన అనంతరం కూడా నీటి కేటాయింపులు ఈ ఒప్పందం ప్రకారమే జరుగుతున్నాయి. దీనిపై తెలంగాణ అభ్యంతరం వ్యక్తం చేస్తుంది. నీటి కేటాయింపులో తమకు అన్యాయం జరుగుతోందని వాదన వినిపిస్తుంది. నీటి కేటాయింపుల క్యాచ్ మెంట్ ఏరియా, కరవు ప్రాంతాలు, బేసిన్ జనాభా, సాగు విస్తీర్ణం ప్రకారం జరగాలని తెలంగాణ కోరుతుంది. బచావత్ ట్రిబ్యునల్ నికర జలాల ఆధారంగా అప్పట్లో కేటాయింపు చేసిందని ఆరోపిస్తుంది. బచావత్ ట్రిబ్యునల్ కేటాయింపులపై సమీక్షించాలని కోరుతుంది

## ఏపీలో రైస్ ఏటీఎంలు




**కాకినాడ, నవంబర్ 11, పెన్ పవర్:** సాంకేతికతను మరింతగా వినియోగించుకొని ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. అందులో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా రైస్ ఏటీఎంలు ఏర్పాటు చేయాలని చూస్తోంది. ఉత్తర్‌ప్రదేశ్, ఒడిశా రాష్ట్రాల్లో విజయవంతంగా అమలు అవుతున్న రైస్ ఏటీఎంల విధానం ఇక్కడకూడా అమలు చేయాలని చూస్తోంది. రైస్ ఏటీఎంలు ఏర్పాటు ద్వారా ఎప్పుడు కావాలంటే అప్పుడు రైస్ తీసుకునే వీలు కలుగుతుంది. అంతే కాకుండా రేషన్ దుకాణాల్లో క్యూలైన్లు లేకుండా కూడా చూడొచ్చు. ముఖ్యంగా సమయం ఆదా అవుతుంది. పనికి వెళ్లే వాళ్లు తమ పనులు మానుకొని రేషన్ షాపుల చుట్టూ తిరగాల్సిన పని లేకుండా పోతుంది. అన్నింటి కంటే ముఖ్యంగా అక్రమాలకు చెక్ పెట్టే వీలు ఉంటుంది. ఈ రైస్ ఏటీఎంలకు అనుగుణంగా ఉండేలా రేషన్ కార్డులు డిజైన్ చేస్తున్నారు. గతంలో జగన్ చిత్రాలతో రేషన్ కార్డులు గత ప్రభుత్వం ఇచ్చింది. ఇప్పుడు వాటి స్థానంలో కొత్త రేషన్ కార్డులు ఇవ్వనున్నారు. ఇందులో సాంకేతికత యాడ్ చేయనున్నారు. త్వరలోనే దీనికి సంబంధించిన పూర్తి వివరాలు ప్రభుత్వం వెల్లడించనుంది. వచ్చే కార్డుల్లో క్యూఆర్ కోడ్‌తో పాటు ఆ ఫ్యామిలీ మెంబర్స్ చిత్రాలు ఉంటాయి. ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి ఎక్కడైనా రేషన్ తీసుకోవచ్చు. ఇప్పుడు రైస్ ఎంటీఎంలు ఏర్పాటు చేస్తున్నందున వాటిలో కూడా ఉపయోగపడేలా కార్డులు డిజైన్ చేస్తున్నారు. ఇప్పుడు ఉన్న కార్డుల స్థానంలో కొత్త కార్డులు ఇవ్వడమే కాకుండా అవసరమైన వారికి కూడా కార్డులు జారీ చేస్తారు. ఇప్పటి వరకు ఆరు నెలకోసారి కార్డులు ఇచ్చే పద్ధతి ఉండేది. సాంకేతికత అప్‌డేట్ అయినందుకున పెళ్లైన జంటలకు, లేదా తల్లిదండ్రుల నుంచి వేరు పడి కార్డు కావాల్సిన వారికి రోజుల వ్యవధిలోనే కార్డులు ఇచ్చే ఏర్పాట్లు కూడా చేస్తున్నారు.

**రేషన్ కార్డ్ కోసం హెల్ప్‌లైన్ నంబర్ ఉందా?**

ఆంధ్రప్రదేశ్ రేషన్ కార్డ్‌పై సందేహాలు, ఫిర్యాదులు, ఫీడ్‌బ్యాక్ కోసం 040-23494808కి కాల్ చేయవచ్చు. జూటబ-జీజూఏనితిఇ.తినికి ఇమెయిల్ పంపవచ్చు.

ఆంధ్రప్రదేశ్ రేషన్ కార్డు కోసం దరఖాస్తు చేయడానికి అవసరమైన పత్రాలు ఏమిటి?
మీ గుర్తింపు, చిరునామా, ఆదాయానికి సంబంధించిన పత్రాలు అవసరం.

ఆంధ్రప్రదేశ్‌లో రేషన్ కార్డుకు అర్హత ఏమిటి
దరఖాస్తుదారులు తప్పనిసరిగా ఈ కింది విధంగా ఆదాయం ఉండాలి. గ్రామీణ ప్రాంతాల్లో నెలకు 10,000, అర్బన్‌లో నెలకు 12,000కు మించి సంపాదించే వాళ్లు రేషన్ కార్డుకు అర్హులు కారు.

ఆంధ్రప్రదేశ్ రేషన్ కార్డ్ అప్లైచేసిన తర్వాత స్టాటస్ ఎక్కడ చూసుకోవాలి.?
మీ ఆంధ్రప్రదేశ్ రేషన్ కార్డ్ అప్లై చేసిన తర్వాత స్టేటస్ తెలుసుకోవడానికి అధికారిక వెబ్‌సైట్ ష్ట్రబిబిజూబ://లిలిలి.బజూజీనిటజీనిజీ.జీజూ.ఐనీల.తిని ని సందర్శించవచ్చు.

రేషన్ కార్డు కోసం దరఖాస్తు చేసుకున్న తర్వాత వచ్చేందుకు ఎంత టైం పడుతుంది?
ఆంధ్రప్రదేశ్ రేషన్ కార్డు కోసం దరఖాస్తు చేసిన తర్వాత దాన్ని పొందేందుకు 15 రోజుల కంటే ఎక్కువ సమయం పట్టదు.

రేషన్ కార్డ్ కోసం దరఖాస్తు చేసేటప్పుడు దరఖాస్తు రుసుము ఏదైనా ఉందా?
లేదు, ఆంధ్రప్రదేశ్ రేషన్ కార్డు కోసం దరఖాస్తు చేసేటప్పుడు మీరు ఎటువంటి దరఖాస్తు రుసుమును చెల్లించాల్సిన అవసరం లేదు.

రేషన్ కార్డులో సభ్యుల పేర్లను జోడించవచ్చా లేదా తొలగించవచ్చా?
అవును, ఆంధ్రప్రదేశ్ రేషన్ కార్డులో కుటుంబ సభ్యుల పేర్లు జోడించవచ్చు లేదా తొలగించవచ్చు. మీరు దీన్ని వ్యక్తిగతంగా లేదా ఆన్‌లైన్‌లో చేయవచ్చు.

బియ్యం కార్డు, ఆంధ్రప్రదేశ్ రేషన్ కార్డు ఒకటేనా?
లేదు, అవి ఒకేలా ఉండవు. ఆంధ్రప్రదేశ్‌లో రేషన్ కార్డుల స్థానంలో బియ్యం కార్డులు వస్తున్నాయి.

నా రేషన్ కార్డుకు నా ఆధార్‌ను లింక్ చేయవచ్చా
అవును, మీరు మీ రేషన్ కార్డుకు మీ ఆధార్‌ను లింక్ చేయవచ్చు.

పెళ్లయిన జంటలు ఆంధ్రప్రదేశ్ రేషన్ కార్డు కోసం దరఖాస్తు చేయవచ్చా? (ంఖ ఖీజీబితినీని అజీతీట ంజూజూశ్రీఎ వానిశ్రీతినివ)
అవును, భార్యాభర్తలలో ఒకరు రాష్ట్ర నివాసంగా ఉంటే వివాహిత జంటలు దరఖాస్తు చేసుకోవచ్చు.

# కుప్పం, హిందూపురం మున్సిపాల్టీలపై తమ్ముళ్ల గురి

**అనంతపురం, తిరుపతి, నవంబర్ 11, పెన్ పవర్:** రాయలసీమ జిల్లాల్లోని అన్ని మున్సిపాలిటీల్లో టీడీపీ జెండా రెపరెపలాడ్సిందేనంటూ తెలుగు తమ్ముళ్లు పావులు కదుపుతున్నారు. ముందుగా బావబామ్మర్దులు తమ నియోజకవర్గాల్లో అంతా సెట్ చేసి పెట్టారు. ఏ టైమ్‌లోనైనా పీఠం తమ వశం చేసుకునే అవకాశం ఉంది. సీఎం చంద్రబాబు సెగ్మెంట్‌లోని కుప్పం మున్సిపాలిటీలో పాలిటిక్స్ హాట్ హాట్‌గా మారాయి. ఛైర్మన్ పీఠం కోసం టీడీపీ..తమ సీటును నిలబెట్టుకునేందుకు వైసీపీకి ఎత్తుకు పైఎత్తులు వేస్తున్నాయి. కుప్పం మున్సిపాలిటీలో 25 వార్డులు ఉన్నాయి. 19 చోట్ల వైసీపీ, ఆరుచోట్ల టీడీపీ కౌన్సిలర్లు గెలిచారు. అసెంబ్లీ ఎన్నికల ఫలితాల తర్వాత కుప్పంలో పొలిటికల్ సిచ్యువేషన్స్ మారిపోయాయి. నలుగురు మున్సిపల్ కౌన్సిలర్లు టీడీపీలో చేరారు. అందులో నుంచి మరో కౌన్సిలర్ తిరిగి వైసీపీకి లోకి వెళ్లారు. లేటెస్ట్‌గా కుప్పం మున్సిపల్ ఛైర్మన్ సుధీర్ అన్ని పదవులకు రాజీనామా చేసి టీడీపీ కండువా కప్పుకున్నారు. అయితే సుధీర్‌కు సంబంధించి మున్సిపల్ ఛైర్మన్ పదవికి రాజీనామానే పరిగణలోకి తీసుకున్నారు. కౌన్సిలర్ పదవికి రాజీనామాను మున్సిపల్ కమిషనర్ కన్సడర్ చేయలేదు. అయితే సుధీర్‌తో రాజీనామా చేయించి..గతంలో టీడీపీ మున్సిపల్ ఛైర్మన్ అభ్యర్థిగా ఉన్న నేత భార్యకు అవకాశం కల్పించాలని టీడీపీ ప్లాన్ చేస్తోంది. ఇప్పుడు కుప్పం మున్సిపాలిటీలో టీడీపీకి 11, వైసీపీకి 14మంది సభ్యుల మద్దతు ఉంది. అయితే తమ సభ్యులు చేజారిపోకుండా ఎమ్మెల్సీ భరత్, ఎంపీ మిథున్‌రెడ్డి ప్రయత్నాలు చేస్తున్నారు. ఇక హిందూపురంలో బాలయ్య ప్లాన్ వర్కౌట్ అయింది. హిందూపురం మున్సిపల్ ఛైర్మన్ ఎన్నికలో మ్యాజిక్ ఫిగర్ దాటింది టీడీపీ. క్యాంపులో 22 మంది టీడీపీ కౌన్సిలర్లు, ఛైర్మన్ ఎన్నిక రోజున హైదరాబాద్ నుంచి నేరుగా హిందూపురానికి రానున్నారు. హిందూపురంలో మొత్తం 38 వార్డులు ఉండగా 22 మంది కౌన్సిలర్ల మద్దతు టీడీపీకి ఉంది. ఇప్పటికే హిందూపురంలో వైసీపీ మున్సిపల్ ఛైర్మన్‌గా ఉన్న ఇంద్రజ రాజీనామా చేసి టీడీపీలో చేరిపోయారు. 22 మంది కౌన్సిలర్లు రెండు రోజుల క్రితం క్యాంప్‌కు వెళ్లారు. కొత్త మున్సిపల్ ఛైర్మన్ ఎన్నిక రోజున నేరుగా హైదరాబాద్ నుంచి హిందూపురంకు వచ్చి సంఖ్యాబలం నిరూపించుకుంటామని టీడీపీ వర్గాలు చెబుతున్నాయి. హిందూపురం మున్సిపాలిటీలో మొత్తం 38 మంది కౌన్సిలర్లు ఉండగా 30మంది వైసీపీ కౌన్సిలర్లు గెలుపొందారు. ఆరుగురు టీడీపీ తరపున గెలిచారు. ఒకరు బీజేపీ, మరొకరు ఎంఐఎం నుంచి గెలిచారు. అసెంబ్లీ ఎన్నికల ముందు వరకు టీడీపీ సంఖ్యాబలం 6 ఉండగా వైసీపీ మున్సిపల్ ఛైర్మన్ ఇంద్రజతో పాటు మరో 9 మంది కౌన్సిలర్లు ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ ఆధ్వర్యంలో టీడీపీలో చేరారు. దీంతో ఎంపీ, ఎమ్మెల్యే ఓటుతో కలిపి టీడీపీ సంఖ్యాబలం 22కు చేరింది. ఈ క్రమంలోనే నలుగురు కౌన్సిలర్లు తిరిగి వైసీపీలో చేరి తమకే ఛైర్మన్ పీఠం ఇవ్వాలని వైసీపీ అధిష్టానం ముందు డిమాండ్లు పెట్టారు. ప్రస్తుత పరిస్థితుల్లో వైసీపీ అధిష్టానం పెద్దలు మున్సిపాలిటీని చేజిక్కించుకోవడానికి ఆసక్తి చూపలేదు. వైసీపీ అధిష్ఠానం సీరియస్‌గా తీసుకోకపోవడం, నెంబర్ గేమ్ ఆసక్తికరంగా మారింది. పార్టీ పవర్‌లో లేకపోవడంతో మరికొందరు వైసీపీ కౌన్సిలర్లు తమ రాజకీయ భవిష్యత్తు కోసం టీడీపీలో చేరిపోయారు. ప్రస్తుతం 22 మంది మద్దతుతో మున్సిపల్ ఛైర్మన్ పీఠం టీడీపీ కైవసం చేసుకోవడం ఖాయంగా కనిపిస్తోంది. అటు కుప్పం..ఇటు హిందూపురం రెండు మున్సిపాలిటీల్లో పాగా వేసే ప్లాన్ చేస్తుంది టీడీపీ. రాయలసీమ జిల్లాల్లోని మున్సిపాలిటీలను కైవలం చేసుకుని..వైసీపీ షాక్ ఇచ్చేందుకు వర్కౌట్ చేస్తోంది. అందులో భాగంగా ముందు హిందూపురం..తర్వాత కుప్పం..ఆ తర్వాత మిగతా మున్సిపాలిటీల్లో పావులు కదుపుతున్నట్లు తెలుస్తోంది.

# గంభీర్ ను మీడియా ముందుకు పంపించకపోవడమే మంచిది

బోర్డర్ గవాస్కర్ ట్రోఫీ కోసం ఆస్ట్రేలియా బయల్దేరిన టీమిండియా

మీడియాతో మాట్లాడిన గంభీర్

గంభీర్ మీడియాతో మాట్లాడిన తీరును తప్పుబట్టిన మంజ్రేకర్

గంభీర్ తెరవెనుక ఉండడమే మేలని వ్యాఖ్యలు





**హైదరాబాద్ పెన్ పవర్:** బోర్డర్ గవాస్కర్ ట్రోఫీ కోసం ఆస్ట్రేలియా వెళ్లేముందు టీమిండియా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ మీడియా సమావేశంపై మాజీ ఆటగాడు సంజయ్ మంజ్రేకర్ విమర్శనాస్త్రాలు సంధించాడు. ఇలాంటి మీడియా సమావేశాలకు గంభీర్ ను పంపవద్దని బీసీసీఐకి సూచించాడు. గంభీర్ మీడియా ముందుకు రావడం కంటే, తెరవెనుక ఉంటూ జట్టు కోచింగ్ పనులు చూసుకోవడమే మంచిదని హితవు పలికాడు. "గంభీర్ మీడియాతో మాట్లాడుతుండగా ఇప్పుడే చూశాను. అతడిని మీడియా ముందుకు పంపకుండా ఉంటేనే బాగుంటుంది. మీడియాతో ఎలా వ్యవహరించాలో గంభీర్ కు తెలియదు. మీడియాతో ఏం మాట్లాడాలో అంతకన్నా తెలియదు. మీడియాతో మాట్లాడే విషయంలో అతడి కంటే రోహిత్ శర్మ, అజిత్ అగార్కర్ ఎంతో బెటర్" అని మంజ్రేకర్ వ్యాఖ్యానించాడు.

భారత జట్టు ఆసీస్ పర్యటనకు బయల్దేరేముందు గంభీర్ మీడియాతో మాట్లాడాడు. విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మల ఫామ్ పై ఆసీస్ దిగ్గజం రికీ పాంటింగ్ చేసిన వ్యాఖ్యలను గంభీర్ ఖండించాడు. భారత క్రికెట్ తో పాంటింగ్ కు ఏంటి సంబంధం? పాంటింగ్ ఆస్ట్రేలియా క్రికెట్ గురించి మాట్లాడితే బాగుంటుంది అని వ్యాఖ్యానించాడు.

కోహ్లీ, రోహిత్ ల ఫామ్ పై తానేమీ ఆందోళన చెందడంలేదని గంభీర్ స్పష్టం చేశాడు. ఈ నేపథ్యంలోనే సంజయ్ మంజ్రేకర్ విమర్శనాత్మకంగా స్పందించాడు.

# బట్లర్ 115 మీటర్ల సిక్సర్.. కొడితే బంతి కూడా కనబడలేదు





**హైదరాబాద్ పెన్ పవర్:** ఇంగ్లాండ్ కెప్టెన్ జోస్ బట్లర్ సరైన సమయంలో ఫామ్ లోకి వచ్చాడు. గత కొద్దికాలంగా ఫామ్ లేక ఇబ్బందిపడుతున్న ఈ ఇంగ్లాండ్ ఓపెనర్ మళ్ళీ తన పునర్వైభవాన్ని ప్రదర్శించాడు. సోమవారం (నవంబర్ 11) వెస్టిండీస్‌తో జరిగిన మ్యాచ్‌లో కేవలం 45 బంతుల్లో 83 పరుగులు చేశాడు. అతని ఇన్నింగ్స్ లో 8 ఫోర్లు, 6 సిక్సర్లు ఉన్నాయి. బట్లర్ సూపర్ ఇన్నింగ్స్ పక్కన పెడితే ఈ మ్యాచ్ లో అతను కొట్టిన ఒక సిక్సర్ ఏకంగా 115 మీటర్ల దూరం వెళ్ళింది.

ఇన్నింగ్స్ 9 ఓవర్ మూడో బంతిని విండీస్ స్పిన్నర్ మోటీ లెంగ్త్ బాల్ విసిరాడు. ఈ బంతిని బట్లర్ ఫ్రంట్ కు వచ్చి లాంగాన్ దిశగా బలంగా బాదాడు. దీంతో బంతి నేరుగా స్టేడియం రూఫ్ మీద పడి బయట పడింది. 115 మీటర్ల దూరంలో పడిన ఈ బంతి.. కనిపించకుండా పోయింది. దీంతో అంపైర్లు కొత్త బంతిని తీసుకొచ్చారు. ఈ సిక్సర్ మ్యాచ్ మొత్తానికే హైలెట్ గా నిలిచింది. ఐపీఎల్ కు ముందు బట్లర్ ఇలాంటి ఇన్నింగ్స్ ఆడడంతో అతన్ని అన్ని ఫ్రాంచైజీలు టార్గెట్ చేసే అవకాశం కనిపిస్తుంది. 2025 ఐపీఎల్ సీజన్ కోసం రాజస్థాన్ రాయల్స్ ఈ ఇంగ్లీష్ కెప్టెన్ ను రిటైన్ చేసుకొని సంగతి తెలిసిందే.ఈ మ్యాచ్ లో మొదట బ్యాటింగ్ చేసిన వెస్టిండీస్ 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 158 పరుగులు మాత్రమే చేయగలిగింది. కెప్టెన్ పావెల్ 43 పరుగులు చేసి టాప్ స్కోరర్ గా నిలిచాడు. 159 పరుగుల లక్ష్యాన్ని ఇంగ్లాండ్ 14.5 ఓవర్లలోనే ఛేజ్ చేసింది. బట్లర్ 45 బంతుల్లో 8 ఫోర్లు, 6 సిక్సర్లతో 83 పరుగులు చేశాడు. లియామ్ లివింగ్‌స్టోన్ 11 బంతుల్లోనే 23 పరుగులు చేసి వేగంగా బ్యాటింగ్ చేశాడు. ఈ విజయంతో ఇంగ్లాండ్ 5 టీ20ల సిరీస్ లో 2-0 ఆధిక్యంలో నిలిచింది.

# ధోనీ ఆల్‌టైం రికార్డ్ బ్రేక్ చేసిన న్యూజిలాండ్ క్రికెటర్





**హైదరాబాద్ పెన్ పవర్:** శ్రీలంకపై జరిగిన రెండో టీ20లో న్యూజిలాండ్ వికెట్ కీపర్ మిచ్ హే ఆల్ టైం రికార్డ్ తన ఖాతాలో వేసుకున్నాడు. రంగి దంబుల్లా అంతర్జాతీయ స్టేడియంలో జరిగిన ఈ మ్యాచ్ లో ఐదు 5 క్యాచ్ లతో పాటు ఒక స్టంపింగ్ చేసి ఆరుగురు ఆటగాళ్లను ఔట్ చేయడంలో భాగస్వామ్యం పంచుకున్నాడు. దీంతో టీ20 క్రికెట్ చరిత్రలో ఒక ఇన్నింగ్స్ లో ఎక్కువ మందిని ఔట్ చేసిన వికెట్ కీపర్ గా ఆల్ టైం రికార్డ్ సృష్టించాడు.ఈ మ్యాచ్ లో మిచ్ హే కుశాల్ పెరీరా, అసలంక, రాజపక్స, వెల్లలాగే, తీక్షణ క్యాచ్ లను అందుకున్నాడు. పతిరాణాను స్టంపింగ్ చేశాడు. ఇప్పటివరకు ఈ రికార్డ్ భారత మాజీ కెప్టెన్ మహేంద్ర సింగ్ ధోనీ పేరిట ఉంది. అతను 2018 లో బ్రిస్టల్ లో జరిగిన టీ20 మ్యాచ్ లో ఇంగ్లాండ్ పై 5 క్యాచ్ లను అందుకున్నాడు. ధోనీతో పాటు మహ్మద్ షాజాద్,ఇర్ఫాన్ కరీం,కిప్లిన్ డోరిగా సంయుక్తంగా 5 గురు ఆటగాళ్లను ఔట్ లలో ఔట్ చేసిన వికెట్ కీపర్లుగా రెండో స్థానంలో నిలిచారు. ఈ మ్యాచ్ విషయానికి వస్తే మొదట బ్యాటింగ్ చేసిన న్యూజిలాండ్ 19.3 ఓవర్లలో 108 పరుగులకే ఆలౌట్ అయింది. హసరంగా 4 వికెట్లు తీసి సత్తా చాటగా.. ఫాస్ట్ బౌలర్ పతిరానా 3 వికెట్లతో నిప్పులు చెరిగాడు. లక్ష్య ఛేదనలో శ్రీలంక 103 పరుగులకే ఆలౌట్ అయింది. దీంతో 5 పరుగుల తేడాతో న్యూజిలాండ్ గెలిచి రెండు టీ20 మ్యాచ్ ల సిరీస్ ను 1-1 తో సమం చేసింది.



కృతి సనన్ వార్డ్‌రోబ్ అప్రయత్నంగా ఫ్యాషన్ ఎంపికలతో నిండి ఉంది

# వైల్డ్ లైఫ్ సఫారీలో సమ్యుక్త.. సింప్లిసిటీలో అందాల రాణి!

**హైదరాబాద్ పెన్ పవర్:** సౌత్ సినిమా పరిశ్రమలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంటున్న అందాల తార సమ్యుక్త మీనన్, ప్రస్తుతం వైల్డ్ లైఫ్ సఫారీలో విహరిస్తూ తీసుకున్న కొన్ని ఫోటోలను తన ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేసింది. "%×శ్రీ ˉష్ట్రవ ఔఆశ్రీంం%" అంటూ యాలా నేషనల్ పార్క్ నుండి ఈ ఫోటోలను పోస్ట్ చేయడం ద్వారా, ఆమె ప్రకృతి ప్రేమను వ్యక్తపరిచింది. పచ్చని చెట్లు, నీటితో నిండిన సరస్సు, మరియు వైల్డ్ లైఫ్ సౌందర్యాలను ఆస్వాదిస్తూ ఆమె తన ప్రయాణాన్ని ఫ్యాన్స్‌తో పంచుకున్నారు.ఈ ఫోటోల్లో ఆమె నేచురల్ లుక్‌తో, సింపుల్ మేకప్‌లో ఎంతో అందంగా కనిపిస్తోంది. సమ్యుక్త మీనన్ కెరీర్ గురించి మాట్లాడుకుంటే, ఆమె అతి తక్కువ కాలంలోనే సౌత్ ఇండస్ట్రీలో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకుంది. ఆమె నటనలో వైవిధ్యాన్ని చూపుతూ, ప్రతి పాత్రలో ప్రత్యేకతను చూపిస్తూ ముందుకు సాగుతోంది. ప్రస్తుతం లేడీ ఓరియెంటెడ్ చిత్రంలో ప్రధాన పాత్రలో నటించేందుకు సిద్ధమైంది.హాస్య మూవీస్ పతాకంపై రాజేష్ దండా నిర్మాణంలో రూపొందుతున్న ఈ చిత్రంలో సమ్యుక్త ప్రధాన పాత్ర పోషిస్తుంది. ఈ ప్రాజెక్ట్ 2024 వేసవిలో విడుదల కానుంది. ఇక గ్లామర్ పాత్రల్లో మాత్రమే కాకుండా, నటనకు ఆస్కారం ఉన్న పాత్రలతో ప్రేక్షకులను అలరించే ప్రయత్నంలో ఉంది. బెల్లంకొండ సాయి శ్రీనివాస్ హీరోగా నటిస్తున్న చిత్రంలో కూడా ఆమెకు మంచి పాత్ర లభించింది.అదేవిధంగా, లారెన్స్‌తో చేస్తున్న మరొక చిత్రంలో కూడా సమ్యుక్త అద్భుతమైన పాత్రలో కనిపించనుంది. ఈ రెండు సినిమాల్లోనూ సమ్యుక్త గ్లామర్ మరియు నటనా ప్రతిభతో ప్రేక్షకులను ఆకట్టుకోవడం ఖాయం అని సినీ వర్గాలు భావిస్తున్నాయి. తన వైల్డ్ లైఫ్ సఫారీ అనుభవాలను పంచుకుంటూ ఇన్‌స్టాలో చేసిన ఈ పోస్ట్‌లు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. ఈ ఫోటోలు చూసిన అభిమానులు ఆమె సింప్లిసిటీకి, ప్రకృతి ప్రేమకు ఫిదా అవుతున్నారు. ప్రతి ఫోటోలో ఆమె చిరునవ్వుతో ప్రకృతిలో నిండుగా మమేకం అవుతూ కనిపిస్తోంది.





ఎరుపు రంగులో నేహా శెట్టి యొక్క ఫ్యాషన్ ప్రకటన

On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, Published at D.NO: 49-1-35, Miriyalapalem Center, Railway Station Road, Ongole, Prakasam District -523001,Andhrapradesh. Printed by GANTYADA APPARAO, Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS, D.NO: 49-1-35, Miriyalapalem Center, Railway Station Road, Ongole, Prakasam District -523001,Andhrapradesh. Editor: G.APPARAO, (Responsible for selection of news under the PRB Act ) RNI : APTEL/2014/58046 e-mail:penpower9@gmail.com